
ఆంధ్ర సచిత్ర వార పత్రిక

24-11-78
75 పైసలు




దేనితోనూ సరిపోల్చలేని ఆ లావణ్యం.
మృదువైన. సుకుమారమైన. సహజ సౌందర్యం.
అవునుమరి ! లక్స్ సుప్రీమ్‌తో మీలావణ్యం
తొణికిసలాడుతుంది, మీలో కలిగే అనుభూతి
అదే. మనోహరమైన పరిమళం. సమృద్ధియైన,
మెత్తటి నురుగు. మీ చర్మంపై పట్టులాగా
మెత్తగా పరుచుకుంటుంది. లక్స్ సుప్రీమ్‌లోని
బ్యూటీ క్రీమ్ మీ లావణ్యానికి కోమలత్వాన్ని,
మృదుత్వాన్నీ, సహజ సౌందర్యాన్నీ ఇస్తుంది.
LUX
SUPREME
మీరు తిరిగి ఇంక
మరేదీ వాడలేరు


ఎం.రామకృష్ణారెడ్డి B.E.
సమర్పించు
శ్రీరామకృష్ణా కంబైన్స్
తప్పక
చూడండి!
సీతాపతి
సంసారం
దర్శకత్వం
ఎం.ఎస్.కోటారెడ్డి
నిర్మాతలు
ఎం.సుబ్బరామిరెడ్డి
కె.శంకరరెడ్డి M.A.
సంగీతం: చక్రవర్తి
మాటలు: జంధ్యాల
ఫొటోగ్రఫీ: పి.భాస్కరరావు
కూర్పు: నరసింహారావు
కళ: భాస్కరరాజు
నైజాం: శ్రీతారకరామ
రిలీజ్: నవభారత్
DIMPLE
తూ.గో.జిల్లా: శ్రీ జయలక్ష్మి పిక్చర్స్ (త్రూ సువర్ణ ఫిలింస్) నెల్లూరు: శ్రీ సత్యసాయి ఫిలిం డిస్ట్రిబ్యూటర్స్ (త్రూ నెల్లూరు ఫిలిం డిస్ట్రిబ్యూటర్స్) నైజాం



ముఖ చిత్రం

13-10-78న వెలువడిన సంచికపై ముఖ చిత్రం తెలుగు ప్రేక్షకులు మరచిపోతున్న అందమైన శ్రీవిద్యది గాపటం మాకు చాలా సంతోషముగా ఉన్నది. దగుల్బాజీ, అమెరిక కథలు చాలా హ్యూమరస్‌గా ఉన్నవి.

బి.వి.యస్. శాంతి, బి.జె. పద్మ. [ఒంగోలు.]

* * *

ఈ వారం అనగా 20-10-78 నాటి (మీ) మా అభిమాన ఆంధ్రసచిత్రవారపత్రిక, దసరా సంచిక కన్నుల విందుగా మా ముందు నిలిచింది. "కలకత్తా దుర్గ" ముఖచిత్రం మమ్మలనెంతగానో ఆకర్షించింది.

సింగా ఉమాశంకర్ రెడ్డి, న్యాయపతి రమేష్‌బాబు, కోటేశ్వర్ రెడ్డి, కమలారాణిరెడ్డి, గీత, సుజాత, వాణిశ్రీ. [జరంపురం]

* * *

ఆంధ్ర సచిత్ర వారపత్రిక చదివే పాఠకులలో నేను ఒకడ్ని. 27-10-78 జయప్రద-

-ఆ చిరుగాలి పగటిమేఘాల నీడలో ఒంటరిగా కూర్చున్న (అప్రద). మధురమైన ఆమె చెక్కిళ్ళపై, ఎవరో ముద్దు పెట్టుకున్నట్లు సన్నగా తెరచిన పెదవులతో ఎవర్నో పిలుస్తున్నట్లు, వికసించిన మందారపువ్వులాంటి ఆమె కళ్ళల్లో ఎవరో కనిపిస్తున్నట్లు.

ఎ. నారాయణరావు [మిర్యాలగూడ.]

* * *

ఆంధ్రుల "స్వప్న సుందరి" కుమారి జయప్రద ముఖచిత్రంతో వెలువడిన ఆంధ్రపత్రిక" సర్వాంగ సుందరంగా ఉంది. అతి తక్కువ కాలమ్‌లో ధర్మాన్ని గురించి సూక్ష్మంగా విపులీకరిస్తున్నందుకు బులుసువారు ఎంతైనా అభినందనీయులు.

ఇంద్రగంటి నటరాజ్. [రాజమండ్రి]

* * *

మా పశ్చిమ బెంగాల్ వరదల వలన చాల వరకు దెబ్బతినడం వలన మేమెంతో విచారముగా నున్న సమయంలో మీ (మా) పత్రిక దుర్గమ్మ ముఖచిత్రంలో వచ్చి మాకు కొంతలో కొంత విచారం పోగొట్టింది.

ఆర్. చంద్రశేఖర్, రత్నంరాజు. కుమార్, శ్యామసుందర్, శ్రీనివాస్, శ్యామియార్. [ఖర్గపూర్]

* * *

దేవ్ జానీబెనర్జీగారి అద్భుత బొమ్మ శ్రీ కలకత్తా దుర్గ మమ్మల్ని ఎంతో భక్తి పారవశ్యంలో ముంచింది.

పోతురెడ్డి రేవతి, సుజాత, విజయ,శ్రీనివాసు. సుకన్య,అరుణ, రమా, శోభారాణి, రవిందర్, నరేందర్, [హుజూరాబాద్.]

* * *

అందాల అభినవ "జయప్రద" ముఖ చిత్రం 27-10-78 పత్రికకు బాగోలేదు! ఎందుకంటే, జయప్రద చీరకట్టులోనే చాలా అందంగా వుంటుంది.

చింతా రంగనాయకులు, లక్కరాజు ప్రపుల్ల చంద్రి, శోభన్, శాంతి. [ధర్మపురం]

సినిమా విమర్శ

27-10-78 నాటి ఆంధ్రసచిత్రవారపత్రికలో, పి. ఉలిగయ్యగారు, మునిరాబాద్. (రాయచూర్) నుంచి జమున "అమ్మపాత్రలను చేయడం ఇష్టం లేదట ఇంకా గ్లామరస్ పాత్రలే ధరిస్తాననడం హాస్యాస్పదం" అని వ్రాయటంచూస్తే నాకు చాలా హాస్యాస్పదంగావుంది. వారికి కేవలం ఒకనటి మీద సదభిప్రాయంలేనప్పుడు వారిని వ్యక్తిగా విమర్శించడం మంచిదికాదు. ప్రేక్షకులు మన అగ్రహీరోల సరసాలే చూశ్కోలేకపోతున్నాం అన్నారు. మన అగ్రహీరోలే మన వెండి తెరకు మూలస్తంభాలు. "కళాభారతి" జమునగారు నాటికి నేటికి కళారంగమునకు చేస్తున్న కృషి ప్రశంసనీయము. షష్టిపూర్తి అంచులదేక, సావిత్రిగార్ల రన్నా గొప్పనటా అని వ్రాశారు వారిలో యీ వైషమ్యాలు లేకుండునవి. యీ వైషమ్యాలు ఇప్పుడీ ఉత్తరాల ద్వారా మనకు కల్పించాలిందే. కళాభిమానులు కళాహృదయులు ప్రసన్నులపరచు "కళాభారతి" పరిశ్రమకు గుడ్‌బై చెప్పవలసిన అవసరం లేదు.

అమ్మనబ్రోలు చంద్రశేఖరరావు, [అమ్మనబ్రోలు.]

కథలు

"శ్రీ కలకత్తా దుర్గ" ముఖచిత్రంలో వెలువడిన దసరా సంచికలో కథలన్నీ బాగున్నాయి. ముఖ్యంగా "పిచ్చి మనుష్యులు" కథ మా మనస్సులను ఆకట్టుకొంది. దసరా కానుకాలు వాయూ ప్ర బాగున్నాయి. పరిమోహన్‌గారి వైప్యలో పరదాలు, కానుకరదాగాఉంటున్నాయి.

వీరవల్లి శేషగిరరావు, రామకృష్ణ, సుశీల, వాణి, నిర్మల. [శిరూపూర్.]

సీరియల్

13-10-78 ముఖచిత్రము శ్రీవిద్య చూడ ముచ్చటగా యున్నది. "రాగద్వేషాలు" సీరియల్ చాలా ఉంటదేముగాయుంది. కథలలో "డీర్ఘ సుమంగళీ భవ" చాలా బాగుంది. రచయిత ప్రియ బాంధవిగార్కి నా అభినందనలు "దగుల్బాజీ" కథ బాగుంది. ఈ వారం 'ఆనాటి వనితాలోకం' శీర్షిక బాగుంది.

దాసరి నరసింగరావు, [పార్వతీపురం]

మనలో మాట

దీపావళి కథల పోటీకి వచ్చిన కథలలో మామూలు ప్రచురణకి స్వీకరించిన కథల విషయం ఆయా రచయిత(త్రు)లకి తెలియచేశాము.

పోటీ నిబంధనల ననుసరించి ప్రచురణార్హంకాని కథలని తిప్పి పంపడం సాధ్యంకాదని, ఆ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలకి అవకాశంలేదని గమనించ కోరుతున్నాము.

పోటీలో పాల్గొన్న రచయిత(త్రు)లు అందరికీ మరోసారి మా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాము. —సం.

త్వరలో ప్రారంభం!

కొత్త సీరియల్

గవర్నెస్ కరుణ

రచన:

గంటి వెంకటరమణ

ఇప్పుడు! చురుకైన జీవనంకోసం శక్తినిచ్చే యింధనాన్ని సేవించండి.



బూస్ట్

మాల్ట్ చాకొలెట్ మిల్క్ డ్రింకు

రైలు మోస్తరుగానే మీరు కూడా ప్రతి రోజు ఉత్సాహంగా ప్రారంభించేందుకు ఇంధనం కావాలి. అందుచేతనే ప్రతి ఉదయం మీరు బూస్ట్ సేవించాలి.

మీరు చకచకా పనులు చేసుకొనడంలో మీకు తోడ్పడే శక్తిదాయకమైన ఇంధనం. ముఖ్యంగా పనిలోను, ఆటల్లోను అదనంగా శక్తిని వెచ్చించే మీ పిల్లలకు ఇది కావాలి.

వారికి బూస్ట్ యిస్తుంది. ఇది మాల్ట్ చాకొలెట్ మిల్క్ డ్రింకు. పౌష్టికాహారం గురించి సంపూర్ణంగా తెలిసిన 'హార్లిక్స్' ఉత్పత్తిదారులు తయారు చేసింది.

సంపన్నమయిన క్రీమ్‌తో కూడిన బూస్ట్ మీకు మరింతగా శక్తినిస్తుంది. ఎందుచేతనంటే ఇది సంపూర్ణమయిన మీగడ పాలతోను, గోధుమతోను, బార్లీ మాల్ట్‌తోను, కోకోతోను తయారయింది.

బూస్ట్‌లో మీ పిల్లల పెరుగుదలకుగాను, ఇటువంటి మరే ఇతర చాకొలెట్ డ్రింకులోను లేనంత ఎక్కువగా పౌష్టిక పదార్థాలు ఉన్నాయి.


అంతేకాదు. బూస్ట్‌కి, మీ కుటుంబమంతా కూడా యిష్టపడే క్రీమ్ మాల్ట్ చాకొలెట్ రుచి, సువాసన ఉన్నాయి. బూస్ట్, మీ రోజుని ప్రారంభించేందుకు అద్భుతమైన మార్గం—ప్రతి రోజూ.

రెండు సైజులలో లభిస్తుంది.

'హార్లిక్స్' ఉత్పత్తిదారులనుంచి.

B-4575-TEL-1

లోకం పోకడ * డూమెన్



ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు
స్థాపితం : 1908

శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు :
[1938 1972]

శుక్రవారం : 24 11–'78
కాళయుక్తినామ సం. కార్తీక బ. నవమి
సంపుటము 72 సంచిక 11

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

*

పోస్టులో ఏడాది చందా రు. 41-60
ఆరు మాసాల చందా రు. 20-80
విడి ప్రతి వెల 75 పైసలు

అంధ్రపత్రిక కార్యాలయము
గాంధీనగరం, విజయవాడ-520 003

విషయానుక్రమణిక

ఆట... బొమ్మ :
హిం... మీనా-...
(ఫొట... ంతిలాల్ ఖత్రి)

కథలు :

అర్చనా ! అర్చనా !! ... 14
వయసు – వ్యామోహం ... 44

సీరియల్ కథలు :

రాగద్వేషాలు ... 8
ఆకర్షణ—వ్యామోహం ... 19

వ్యాసాలు, శీర్షికలు :

ఉత్తరాలు, మనలో మాట - 4. లోకం పోకడ - 6. హైదరాబాద్ నోట్ బుక్. మినీ ఇంటర్వ్యూ - 7, వారఫలం -18. డాక్టర్ సలహాలు-22, సినిమా-24, జి.వి.జి. పేజీ - 30 బొమ్మల మహాభారతం - 34. ఫొలాజిని డైరీ - 35. మాయాజాలం పతికట్టు - 36. ప్రశ్నావళి - 42. ధర్మపథం-47. వంటలు - 50.

హై ద రా బా ద్ నో ట్ బు క్

పోలీసులు - ప్రజలు

పోలీసుశాఖను పూర్తిగా ప్రక్షాళనంచేయాలని, క్రిమినల్ కోడ్, తదితర చట్టాలు మారనంతవరకు పోలీసులకు, ప్రజలకు మధ్య వైమనస్యం తొలగదని సుప్రీంకోర్ట్ న్యాయమూర్తి శ్రీ వి. ఆర్. కృష్ణయ్యర్ అక్టోబర్ 15న ఆంధ్ర సారస్వత పరిషత్తుహాలులో జరిగిన "పోలీసులు-ప్రజలు" సదస్సులో తెలిపారు. 200 సంవత్సరాల బ్రిటిష్‌పాలనలో పోలీసు కాల్పులవల్ల మరణించిన వారి సంఖ్యకు, 30 సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో పోలీసుకాల్పుల మృతులలో సంఖ్యకు తేడా లేదని బరోడా డైనమేట్ కేసు నిందితుడు శ్రీ సి.జి కె. రెడ్డి విమర్శించారు. జనతాపార్టీ ప్రజలకు చేసిన వాగ్దానాలను విస్మరించిందని మార్క్సిస్ట్ పార్టీ నాయకుడు శ్రీ ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్ విమర్శించారు. ఈ సదస్సును సామాజికశాస్త్రాధ్యాయన పాఠశాల ఏర్పాటు చేసింది. ప్రొఫెసర్ ఆలంఖుంద్ మిర్ ప్రారంభంలో స్వాగతం చెప్పారు.

రచయితలకు శ్రీ హయగ్రీవాచారిహితవు:—

డాక్టర్ చంద్రిక "కలియని కెరటాలు" అనే నవలను సుప్రసిద్ధ రచయిత శ్రీ పోతుకూచి సాంబశివరావుకు అక్టోబర్ 8వ తేదీన కృష్ణదేవరాయాంధ్రభాషానిలయంలో అంకితమిచ్చారు. ఈ నవలను సాంకేతిక విద్యా శాఖామంత్రి శ్రీ జి. హయగ్రీవాచార్యులు ఆవిష్కరిస్తూ రచయితలు సమాజంలోని లోపాలను చూపి సంస్కరణకు తోడ్పడాలని హితవుచెప్పారు. తెలుగుదేశంలో రచయిత్రులు ముందంజవేయడం హర్షదాయకమన్నారు. అధ్యక్షత వహించిన ఆంధ్రా బ్యాంక్ పౌరసంబంధాధికారి శ్రీ కె. వి. భాస్కరరావు రచయిత్రిని ప్రశంసించారు. స్వామి దేవానంద రచయిత్రిని, కృతిస్వీకర్తను ప్రశంసించారు. సుప్రసిద్ధ రచయితలు శ్రీ దాశరథి రంగాచార్య, డాక్టర్ అక్కిరాజు రమాపతిరావు (మంజుశ్రీ), డాక్టర్ చంద్రిక ఇంకా మంచి నవలలు వ్రాయాలన్నారు. గ్రంథస్వీకర్త శ్రీ పోతుకూచి సాంబశివరావు కృతజ్ఞత తెలిపారు. ప్రారంభంలో శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం కార్యదర్శి శ్రీ ఎం.ఎల్. నరసింహారావు స్వాగతంచెప్పగా, సహాయకార్యదర్శి శ్రీఅక్కిరాజు జనార్ధనరావు కృతజ్ఞతావందనాలు సమర్పించారు.

టాల్‌స్టాయ్ 150 వ జయంతి :—

గాంధీజీ, రష్యా రచయిత, తత్వవేత్త టాల్‌స్టాయ్‌ల భావాలు ఒక్కటే. సమాజం విషయంలో వారిద్దరూ చాల సన్నిహితులు. ఇద్దరూ అహింసావాదులు; శాంతికాములు. కాని గాంధీజీ టాల్‌స్టాయ్‌కి శిష్యుని వంటివాడు. ఈ సంగతి ఆయనే చెప్పుతున్నారు. దక్షిణాఫ్రికాలో భారతీయులపై జరిగిన అత్యాచారాలకు నిరసనగా సత్యాగ్రహోద్యమాన్ని నిర్వహించడంలో గాంధీజీకి టాల్‌స్టాయ్ రచనలే ఉత్తేజం కలిగించాయి. టాల్‌స్టాయ్ జయంతి గాంధీజీ జయంతి తర్వాత అక్టోబర్ 3న రావడం మరొక విశేషం. ఆయన "యుద్ధం-శాంతి" అనే ఉద్గ్రంథం అజరామరమయింది. అక్టోబర్ 3న అభ్యుదయ రచయితల సంఘం, భారత రష్యా సాంస్కృతికసంఘం సమిష్టి యాజమాన్యాన జరిగిన టాల్‌స్టాయ్ 150వ జయంతికి అధ్యక్షతవహించినఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి. రామిరెడ్డి. ముఖ్య అతిథి ముఖ్యమంత్రి డాక్టర్ చెన్నారెడ్డి; డాక్టర్ సి. నారాయణరెడ్డి, భారత-రష్యా సాంస్కృతికసంఘం ఉపాధ్యక్షుడు శ్రీ సి. సుదర్శన్, రచయిత్రి శ్రీమతి అబిదా, శ్రీ బి. కృష్ణ-టాల్‌స్టాయ్ జీవితవిశేషాలు, రచనా విశేషాలు వివరిస్తూ ప్రసంగించారు.

ఉపశ్రుతి :

"మనకు ఇంతో అంతో మంచి రంగస్థలం రవీంద్రభారతి. దానిలో జరిగే సాంస్కృతిక కార్యక్రమాలలో సగానికి సగం ఉపన్యాసాలే వుంటూ విసుగు పుట్టిస్తున్నాయండీ!" అన్నారు ఒక ప్రేక్షకుడు నాతో. "ఇలాటి సమావేశాలలో ప్రసంగించేవారు ఐదుగురికి మించరాదని, వాళ్ళుకూడ చెరి రెండు నిమిషాలకు మించి ప్రసంగించరాదని నిబంధనచేస్తే బాగుండును" అన్నారు మరొకరు. "అలాటిదేదో వుండనే వుందండీ. దానిని కొత్తగా వచ్చిన రవీంద్ర భారతి డైరెక్టరు శ్రీ మూర్తి అమలుపరిస్తే బాగుండును" అన్నారు ఇంకొకరు.


—తిరుమల రామచంద్ర

మినీ ఇంటర్వ్యూ

22 సంవత్సరాల పుట్టి రాం బాబు గుడ్లవల్లేరు కళాశాలలో బి. కాం., చదువుతున్నాడు. చూడటానికి నూతన పోకడలతో కనపడతాడు డిగ్రీ పూర్తికాగానే "హైదరాబాద్ ఫిలిం టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్" లో నటనలో శిక్షణ పొందాలని సరదా పడుతున్నాడు.

నేటి విద్యావ్యవస్థ గురించి మాట్లాడుతూ "కొంతమంది విద్యార్థులు తను విద్యార్హతపట్టాలు ఎంత తొందరగా తీసుకుందామా! అని ఆదుర్దా పడుతున్నారు తప్ప యెంతవరకు విజ్ఞానం పొందాము! అని ఆలోచించడంలేదు అన్నాడు. "రాజకీయ నాయకులనుచూశావా?" అంటే "ఈనాడు వున్న రాజకీయాలు నాకు గిట్టవు. రోజుకు ఒక పార్టీ, రోజుకు ఒక జెండా మార్చే నాయకులు మన పాలనలో ఎక్కువ అయ్యారు" అన్నాడు. ఇప్పుడు వస్తున్న చిత్రాలలో నీతిదాయకమైన చిత్రాలు చాలా తక్కువని, మన చిత్రాలలోని ముద్దులు, అసభ్యకరమైన దృశ్యాలు ఇంగ్లీషు చిత్రాలతో పోటీ పడుతున్నాయని సినీ పరిశ్రమ గురించి తన అభిప్రాయాన్ని వెల్లడించాడు.

వరకట్నం తీసుకొనడం, తీసుకొనకపోవడం తను తన కుటుంబ పరిస్థితులను బట్టి జరుగుతూ వుండాలని చెపుతూ, తన అభిరుచులకు సరిపడే అమ్మాయి దొరికి నట్లయితే కట్నం లేకుండా వివాహము చేసుకొంటాను అని గట్టిగా చెపుతున్నాడు. ఇంటర్ కాస్ట్ మ్యారేజీని ఇతడు సమర్థి



స్తున్నాడు. [కాని చేసుకుంటాడా?] స్త్రీ పురుష భేదం లేకుండా అందరితో సరదాగా మాట్లాడటం, స్నేహం చేయటం అలవాటు వున్న యితడు ఖాళీగా వున్నప్పుడు సినిమాలు చూస్తాడు, రేడియో కార్యక్రమాలు వింటాడు.

[ప్రసాద్]

విన్నది నిజమేనా?'' ఉపోద్ఘాతంగా ప్రారంభించింది

తలెత్తి మొహం చిట్లించారురావుగారు.

"చిన్న పిల్ల– పట్టుమని పాతికేళ్ళు లేవు దానికి! జీవితమంతా ముందే వుంది! ఏం అనుభవించిందది!...''

"... .. ..''

"ఇంక అల్లుడికీ– దానికీ సంబంధం లేనట్టేగా?''

"అసలు నీ మనసులోని ఉద్దేశమేమిటో చెప్పు అక్కయ్యా.'' అన్నారు రావుగారు విసుగునీ అసహనాన్నీ కప్పిపెట్టుకుంటూ!

అసలు సంగతి తెలిసినా వివరూ ఇంత దాకా సూటిగా ఆయన నిట్లా అడగలేదు.

"ఏం లేదురా. దాన్ని చూస్తే నాకడుపు తరుక్కుపోతోంది! పిచ్చిపిల్ల– పచ్చగా విలసిల్లాల్సిన భవిష్యత్తు!... ఏం మిగిలింది దానికి?...'' ఆపింది.

కడుపులోంచి తెలియని బాధ మళ్ళీ మొదలైంది రావుగారికి. ఇందిర జీవితం అట్లా కావడానికి కారకుడు తను! ఈ బాధ తనని ఆజన్మాంతం పీడిస్తూనే వుంటుంది.

"నువ్వు- నేను శాశ్వతం కాదుకదా! ఆ మాటకొస్తే ఎవరూ శాశ్వతం కాదనుకో! కానీ నీ తరువాత ఇందిరకో తోడంటూ వుండాలి కదా? కనీసం పిల్లవాడు పెద్దవాడయ్యేదాకావన్నా...'' రావుగారి మనసులోని



గుండెలు దడదడ లాడతాయి! వాళ్ల ఋణం ఈ జన్మలో తను తీర్చుకోగలడా? దేవుడు ఆరూపంగా సాక్షాత్కరించాడు! అంతే! వాళ్ళనిప్పుడు తను చూడబోతున్నాడు. ఆ ఆలోచన తన మనసుకి హాయినే కలిగిస్తోంది!

ఎయిర్ పోర్టుకి వెళ్ళింది ఇందిర— బాబుతో! వాళ్ళ ప్లేన్ వస్తోందని వినబడిన దగ్గిర్నించీ రెస్ట్‌లెస్‌గా వుందామెకి! తీరా వాళ్ళు విమానం దిగి ఎదుటికి వచ్చేటప్పటికి నోట మాటలే కరువయ్యాయామెకి!

రెండు చేతులూ జోడించింది శ్రీకర్‌కి! శ్రీలతని కన్నీళ్లతో అమాంతం కౌగిలించుకుని ఉక్కిరి బిక్కిరి చేసేసింది! ఆనందంతో ఏడ్చేసింది! శ్రీలత పరిస్థితీ అట్లాగేవుంది.

చిత్రంగా కళ్ళు విశాలం చేసుకుని వాళ్లని పరికిస్తున్నాడు బాబు! బాబుని అమాంతం ఎత్తుకుని ముద్దుల వర్షం కురిపించేసింది శ్రీలత!

ఇందిర చేతిలించీ తను తీసుకున్నాడు బాబుని శ్రీకర్! ఆప్యాయంగా, ఆర్తిగా— గుండెలకు హత్తుకున్నాడు వాణ్ణి! వాణ్ణి ఎత్తుకున్న ఆ యిద్దరికీ కూడా కళ్ళు చెమర్చాయి! వాడూ కొత్త లేకుండా 'అంకుల్ ఆంటీ' అంటూ కబుర్లు చెప్పడం ప్రారంభించాడు.

పరస్పర పరామర్శ లయ్యాయి! శ్రీలతా శ్రీకర్‌లు ఎప్పట్లానే వున్నారు? అనుకుంది ఇందిర. ఇందిర కొంచెం నయంగా వుంది— అనుకున్నారు వాళ్ళు! అంతా ఇంటికొచ్చారు.

రావుగారు గేటుదగ్గిరికే ఎదురువచ్చారు. నమస్కారం చేశారు వాళ్ళు!

ప్రతి నమస్కారం చేస్తూ శ్రీకర్ని ఆప్యాయంగా కౌగిలించుకున్నారు ఆయన! శ్రీకర్ని చూడంగానే ఆయనకి అతణ్ణి ఎక్కడో చూసినట్లే అనిపించింది. ఆలోచిస్తున్నారు ఎక్కడ చూశానా అని!

వాళ్ళు అక్కడ్నించీ ఇందిరకీ— బాబుకీ ఎన్నో బహుమతులు తెచ్చారు. స్నానాలూ— భోజనాలూ అయ్యాయి. తీరిగ్గా కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్న సమయంలో ఆయన అడగకుండానే తనే చెప్పేశాడు శ్రీకర్.

"నేను మీ అమ్మాయిని పెళ్లి చూపులు చూడడానికి వచ్చినప్పుడు మనిద్దరం కలుసుకున్నాం" అని!

ఆయనకి అప్పుడు అంతా గుర్తుకొచ్చింది. వింత విచిత్రం అనుకున్నారు! కాసేపటికి గానీ తేరుకోలేక పోయారు!

లోపలెన్నో ఊహాగానాలు చెలరేగాయి! "మీ అమ్మా నాన్నా అంతా బావున్నారా— బాబూ!" అడిగారు.

"నాన్నగారు పోయారండీ! అమ్మ మాత్రం వుంది. అమ్మని చూడాలి. ఏదీ రావడమే ఇక్కడికి వచ్చాంగా?" నవ్వాడతను.

"మీవెంత మంచి మనసులు బాబూ! మీలాంటివాళ్ళని అరుదుగా చూస్తాం ఈ ప్రపంచంలో! ఆపదలో ఆదుకోవడ మనేది ఒక గొప్ప గుణం! నీ భార్య గూడా నీకు తగినది. అనుకూలమైంది! మీ ఇద్దరి జంటా అపురూపమైనది.

ఇందిర నాకంతా చెప్పింది. ఆసమయంలో



మీరే లేకపోతే ఇందిర గతేమయ్యేదో? నేనే మయ్యేవాడినో? మీరన్ని విధాలా ఆదుకుని— ధైర్యం చెప్పి, ఆమెకి జీవం పోశారు. పునర్జీవితం ప్రసాదించారు. ఆమె కడుపులోని శిశువుని కాపాడింది అక్షరాలా మీరే! ఇప్పుడు వాడే మా జీవితాలకు వెలుగయ్యాడు! నాకు నిజంగా ప్రాణభిక్ష పెట్టారు మీరు! ఇందిరే నా ప్రాణం బాబూ! మీకు తెలుసుగా? దానికేదయినా అయితే నేను జీవించలేను. ఆ దుర్మార్గుడు అంత చేసినా మేమీవిధంగా బతక గలుగుతున్నామంటే కేవలం మీ చలవే! మా ముగ్గురి ప్రాణాలూ నిలబెట్టి—మా కింత మేలుజేసిన- మీ ఋణం ఏ విధంగా తీర్చుకోవాలో మాత్రం మాకు తెలియడంలేదు—ఏమిచ్చినా ఏంచేసినా దానికి సాటి రాదు!" హృదయ పూర్వకంగా అన్నారు రావుగారు.

"మమ్మల్నంతగా పొగడకండి—ఇందులో మేము చేసింది ఏముంది?..." అన్నాడు శ్రీకర్ వినయంగా!

* * *

ఆ తరువాత నాలుగు రోజులు ఉత్సాహంగా — సరదాగా — సంతోషంగా గడిచాయి! ఇందిర — శ్రీలతకి కలకత్తా అంతా తిప్పి చూపించింది. సినిమాలకి — షాపింగ్‌లకీ వెళ్ళారు!

"శ్రీకర్ మీ ప్రోగ్రాం ఏమిటి? ఇంక అమెరికా వదిలేసి వచ్చేనా?" అడిగింది ఇందిర ఒకరోజు! సంతోషమంతా తనదే వచ్చినట్లు వుంది ఇందిర!

"ఆఁ వదిలేసినట్లే" అంది శ్రీలత సమాధానంగా! శ్రీలతబాబుని క్షణంవదలడం లేదు. వాడి పనులన్నీ ఆమే చూస్తోంది! వళ్ళో కూచోబెట్టుకుని వాడితో కబుర్లు చెప్తోంది!

"ముందు మా అమ్మని చూసి రావాలి. ఆ తరువాత వాళ్ళ ఊరువెళ్ళి వాళ్ళ వాళ్ళని చూసి నెమ్మదిగా ఆ తరువాత సంగతి ఆలోచించాలి. నాకు వెంటనే తగిన ఉద్యోగం దొరకడం కష్టం. అందుకే ఎవరితోనన్నా కలిసి ఇండస్ట్రీ ఒకటి స్టార్టు చెయ్యాలని ఆలోచన వుంది! అప్పటికీ ఒక రూపు రావాలంటే టైమ్ పడుతుంది" అన్నాడు సాలోచనగా శ్రీకర్.

"ఏం ఇండస్ట్రీ పెట్టాలని?" అడిగారు

రాగద్వేషాలు

రావుగారు.

"నా సబ్జెక్ట్ ఎలక్ట్రానిక్స్ అండీ! ఎలక్ట్రానిక్స్ ఇండస్ట్రీ పెట్టాలని కంప్యూటర్లు చెయ్యడం— వాటిమీదన్న మాట!"

"ఎక్కడ స్టార్ట్ చేద్దా మనుకుంటున్నావు?"

"ఇంకా అదంతా ఆలోచించలేదండీ! ఎస్ వేర్ ఇన్ ఆంధ్రప్రదేశ్ పెట్టాలని వుంది. అది పెట్టుబడి పెట్టేవాళ్ళ మీద కూడా ఆధారపడి వుంటుంది కదండీ!"

"ఎవరన్నా వున్నారా మీ దగ్గర రిలేషన్సులో?" అడిగారు రావుగారు.

"లేరండీ ఒకవేళ వున్నా రిలేషన్సుతో కలవడం— అందులో ఇట్లాంటి వాటిల్లో నా కిష్టం లేదండీ! ఫ్రెండ్సయితే నయం!"

వెక్కిరించినందుకు జరిమానా

నాలిక బయటపెట్టి ట్రాఫిక్ పోలీసును వెక్కిరించిన నేరానికి ఫ్రాన్స్‌లోని నాన్సీలో ఒక కారు యజమానికి కోర్టు 800 ఫ్రాంకులు జరిమానా విధించింది. కాని తాను నిర్దోషినని, ఎండిపోయిన పెదాల్ని తడి చేసుకోడానికి మాత్రమే నాలిక బయట పెట్టానని కారు యజమాని అప్పీలు చేసుకున్నాడు. మరి ఏం జరుగుతుందో చూడాలి!

కొంచెం సేపయ్యాక రావుగారన్నారు — "నీ కభ్యంతరం లేకపోతే ఆ ఇండస్ట్రీకి కావలసిన పెట్టుబడి నేను పెడతాను. నన్ను నా పార్ట్‌నర్‌గా చేస్తాను" కొంతసేపు ఆశ్చర్యంతో ఏమీ మాట్లాడలేక పోయాడు శ్రీకర్.

"అవును బాబూ— నువ్వు మాకు చేసిన సహాయంలో మేము చెయ్యబోయే దెంత? నువ్వేమీ సంకోచించకు. ఇందులో నాస్వార్థం కూడా లేకపోలేదు—" కుర్చీలో వెనక్కువాలి అన్నారు—ఇంకా! "నేనూ పెద్దవాడినవుతున్నాను. ఈ బిజినెస్ వ్యవహారాలన్నీ నేను ఒక్కణ్ణే చూసుకోలేక పోతున్నాను. నాకు సహాయం కావాలి. ఇందిర ఆడపిల్ల! అది ఒక్కత్తే అన్నీచూసుకోలేదు. నేనూ దానికి అప్పగించలేను. నీకు తెలిసే వుంటుంది — నేను హార్ట్ పేషెంట్‌ని! ఏమో—ఏక్షణంలో ఏమవుతుందో చెప్పలేం— మొదట్నించీ నేను కొడుకుల్లేకపోయినా - అల్లుడొస్తాడనే ధీమాతో వుండేవాడ్ని! కానీ...వాడు... వాడట్లా భ్రష్టుడయ్యాడు! ఇన్నాళ్ళూ నా తరువాత నా ఆస్తినీ- ఇందిరనీ చూసే వాళ్ళు ఎవరా అని దిగులుపడేవాడ్ని! ఆస్తి కోసం ఇందిరని ఎవరైనా — ఏమైనా చెయ్యొచ్చు— దానికో అండ అంటూ నేనేర్పరచాలి! అది ఎట్లాగా అని కొట్టుమిట్టాడుతున్నాను. దేవుడు పంపినట్లు నువ్వు వచ్చావు- సమయానికి! ఇంక దేనికీ నాకు భయంలేదు. ఇందిరకీ — నా ఆస్తికి కూడా ఇక ఏ భయమూలేదు. దాని కొడుకు పెద్దవాడయ్యేదాకా దాని బాధ్యత- ఆస్తి — బాధ్యతా కూడా నీదే!

నీతో ఇప్పటి నా పరిచయం స్వల్పమే అయినా ఇందిర ద్వారా నువ్వు పరోక్షంగా నా ఆత్మీయుడివే! అందుకే ధైర్యంగా అన్నీ నీకు ఏకరువు పెడుతున్నాను" మంత్రముగ్ధుడిలా వింటున్నాడు శ్రీకర్.

"నాకూ ఈ కలకత్తా జీవిత మంటే విసుగొస్తోంది. నేనిక్కడ కొన్ని- అదే కొంత బిజినెస్ వైండ్ అప్ చేసి మన వైపుకు వద్దామనుకుంటున్నాను.

సరే... నువ్వు ముందు వెళ్ళి మీ వాళ్ళ నందర్నీ చూసిరా మిగిలిన సంగతులన్నీ వివరంగా తర్వాత మాట్లాడుకుందాం..." అన్నారు.

ఇవన్నీ వింటున్న ఇందిర చాలా సంతోషించింది. శ్రీలత ఆశ్చర్యంగా చూస్తూండి పోయింది!

"మీకు నామీద వున్న నమ్మకానికి కృతజ్ఞతలు రావుగారూ...కానీ మీ ఈనమ్మకానికి నాకు తగిన అర్హత..." శ్రీకర్‌ని మధ్యలోనే ఆపేశారు రావుగారు.

"భలేవాడివోయ్...నీసంగతి నీకు తెలీదు మాకు తెలుసు!"

ఆ తరువాత రోజు శ్రీకర్ భార్యతో వాళ్ళ వూరికి బయల్దేరాడు.

వాళ్ళు తీసుకెళ్ళ గలిగినన్ని కానుకలు ఇచ్చింది ఇందిర శ్రీలతకి.

బాబు వాళ్ళతో తనూ వెళ్తానని గోల చేశాడు. ఎంతో సముదాయిస్తేగానీ— ఏవేవో చెప్పి మరిపిస్తేగానీ వూరుకోలేదు— వాడు!

(ఇంకా వుంది)



హాల్లో కూర్చుని పుస్తకం చదువు కుంటున్న అనంత్— తలొంచుకుని అడుగులో అడుగు వేసుకుంటూ బైటనుండి నెమ్మదిగా హాల్లోకివస్తున్న భార్యనుచూసి—

"అలా ఉన్నావేం అర్చనా?" అని అడిగాడు.

పుస్తకంలో నుంచి సగం ముఖం కన్పిస్తున్నా భర్తను చూసి తన చిరాకును కనబడనీయకుండా మౌనంగా మేడమీదకు వెళ్ళి పోయింది.

భార్య ముఖంలోని భావాలేమీ చదవలేక పోయాడు అనంత్. పుస్తకం సోఫాలో పడేసి మేడమీదకు వెళ్ళాడు. అర్చన గది ముందు నిలబడి తలుపు తట్టాడు... జవాబు లేదు. తలుపులు తెరుచుకోనూ లేదు. కొంతసేపలా నిలబడి తిరిగి నెమ్మదిగా మెట్లు దిగుతున్నాడు.

"ఎక్కడికి వెళ్తున్నారు?" అని అధికార పూర్వకంగా వినిపించిన భార్య కంఠధ్వని విని ఆగి, కుడిభుజం మీదుగా తలత్రిప్పి వెనక్కి చూశాడు. సగం తెరచి వున్న తలుపుల మధ్య నిలబడి వుంది అర్చన. ఆమె ముఖంలో ప్రశాంతతకు బదులుగా ఏదో ఆందోళన కన్పిస్తుంది.

"ప్రతి రోజూ సాయంకాలం ఎక్కడికి వెళ్తాను. కాన్వెంటుకు వెళ్ళి పిల్లల్ని తీసుకురావద్దా?" అని అన్నాడు అనంత్.

"నాకు బంగ్లోపనుంది అలా వెళ్ళి వచ్చేటప్పుడు పిల్లల్ని తీసుకువస్తాలెండి" అని మొట్ట మొదటి సారిగా కాన్వెంటుకు వెళ్తానంటున్న భార్య వంక చూసి "సీయిష్టం" అని వచ్చి, తిరిగి పుస్తకంలో మునిగి పోయాడు అనంత్.

* * *

"అమ్మా!... నాన్న దగ్గర పడుకుంటామే..." అంటూ గోల చేస్తున్న యిద్దరి పిల్లల్ని కసిరికొట్టి, తన వద్దే పడుకోబెట్టుకుంది అర్చన.

అనంత్ గదిలోకి వచ్చేసరికి పిల్లలిద్దరి మధ్యా నిశ్చింతగా నిద్రిస్తున్న భార్యను చూసి ఆశ్చర్యపోయాడు. యిక, అర్చన క్లబ్‌లు, మీటింగులు, మహిళా సమావేశాలూ అన్నీ బంద్ అన్నమాట! అనుకున్నాడు.

అనంత్ మొట్ట మొదటిసారిగా మంచం మీద ఒంటరిగా పడుకున్నాడు

* * *

"ఏమండోయ్! మీరు కొంచెందూరంగా వుండండీ!..." అన్న అర్చన మాటలకు "ఎందుకూ?" అన్నాడు నవ్వుతూ అనంత్.

"ఎందుకంటారేమిటి? మీ బట్టలు పాడైపోతాయి." తలమీద నీళ్ళు దిమ్మరించుకుంటూ అరిచింది అర్చన.

"ఫర్వాలేదు, కుంకుడురసం పోస్తాను."

"యివ్వాళ రమ్మని పిలవలేదుగా!" కసిరినట్లు అన్న భార్య మాటలకు మారు మాట్లాడకుండా బాత్‌రూంలో నుండి వచ్చేశాడు.

చిలిపిచేష్టలకు స్వస్తి చెప్పాడాపూట అతను.

* * *

"పిల్లలేరి?" భోజనం ముందు కూర్చుంటూ అడిగాడు అనంత్.

"వాళ్ళు ముందే తినేశారు." నేతి గిన్నె అతని దగ్గరగా పెడుతూ అన్నది.

"నువ్వు భోంచేయవా?" అని అడిగాడు.

"ఈ పూట నాకాకలిగా లేదు." అని ముక్తసరిగా జవాబిచ్చి వెళ్ళిపోయిన భార్య ప్రవర్తనకు ఆశ్చర్యపోతూ ఏదో అయ్యిందని పించి లేచాడు.

ఆ పూట అనంత్ అసంతృప్తిగానే భోజనం ముగించాడు.

"అదేమిటి !... ఈ బట్టలన్నీ యిలా బీరువాలోకి వచ్చాయేం ?" బీరువా ముందు నిలబడి అడిగాడు అనంత్.

"అందరి బట్టలూ కలిసుంటే పిల్లలు అన్నీ కెలికేస్తున్నారు. అందుకని మావి వేరుగా వుంచాను. నలిగిపోకుండా వుంటాయి." అన్న అర్చన మాటలు సమంజసమే అనుకున్నాడు. చొక్కా వేసుకుని "అర్చనా ! చొక్కా గుండీలు పెట్టు" అన్నాడు

"అవతల దోభీ కాచుక్కూర్చుంది." అంటూ పాత బట్టలను తీసుకుని గదిలోంచి బైటకు వెళ్ళి పోయింది

ఆఫీసుకు పోబోతూ మరోసారి భార్యను కేకేశాడు మామూలు కోసం. మరోపిలుపుకు –"ఏమిటి ?" అంటూ ముఖానికి పసుపు రాసుకుంటూ మానె ఖంతో గదిలోకి వచ్చిన భార్యను చూసి మౌనంగా ఆఫీసుకు వెళ్ళి పోయాడు.

ఆరోజు అతనిచేత ఆఫీసులో అందరూ వేడివేడిగా తిట్లు తిన్నారు.

* * *

"చూడు.. నిన్నే.. ఏయ్ అర్చనా..." నిద్రపోతున్న భార్యను తట్టి లేపుతున్నాడు అనంత్. కొంతసేపటికి నిద్రమత్తులో "ఏమిటండీ ?... అర్ధరాత్రి వేళ ..." నసుగుతూ విసుక్కుంది అర్చన.

"బైట వెన్నెల ఎంత వృధా అవుతోందో చూడు" అన్నాడు.

"అబ్బబ్బ... వెన్నెల రేపుంటుందిగా..." అంటూ దుప్పటి ముసుగేసిన భార్యవంక కొన్ని క్షణాలు చూసి, ఆమె కిరువైపులా నిద్రిస్తున్న పిల్లల్ని ముద్దాడి తన మంచం మీద కొచ్చి పడుకున్నాడు అనంత్.

ఆ రాత్రి అన్నీ పీడకలలే !

* * *

భార్యా భర్తల మధ్య నిశ్శబ్దం తాండవిస్తోంది. అర్చనకిక ఆ గదిలో పనిలేకున్నా అవీ యివీ చూస్తూ సర్దుతుంది.

అనంత్ ఏదో నిశ్చయాని కొచ్చినట్లు బరువుగా నిట్టూర్చి, జేబులో నుండి కొన్ని కాగితాలు తీసి భార్య కెదురుగా వున్న టేబుల్ మీద పడేసి "అదిగో—ఆ కాగితాలు కూడా నీ వెంట తీసుకువెళ్ళు" అని గంభీరంగా పల్కిన భర్త వంక నివ్వెరపోయి చూసి "ఏమిటివి?" అని ఆశ్చర్యంగా ప్రశ్నించిన అర్చనకు "చూసి చదువుకో" అని సమాధాన మిచ్చాడు అనంత్.

ఆమె వణికే చేతులు కాగితాలు తిప్పే, అదిరే మనసు చదివింది. ఆమెకు, పిల్లల పేరిట తన సగం ఆస్తి వ్రాసి యిచ్చిన వీలునామా. అతని సంతకం మాత్రం పెట్టి వున్న తెల్ల కాగితం ఒకటి !

"ఏమిటిది?" క్షీణ స్వరంతో అడిగింది అర్చన.

"నువ్వాడుతున్న నాటకానికి బహుమానం" వ్యంగ్యంగా అన్నాడు.

"నాటకమా...!"

"అవును- పిల్లల్ని తీసుకురావడానికి కాన్వెంటుకు నీవే ఎందుకు వెళ్తున్నావో, పిల్లలు మనకంటే ముందే భోంచేసి నీదగ్గరే ఎందుకు పడుకుంటున్నారో, నీకు రోజుకొక పూటే ఎందుకాకలి అవడంలేదో—బీరువాలో నా బట్టలు వేరుగా ఎందుకున్నాయో, వెన్నెల రేపెందుకు రాదో, ఈ రోజు మీ యింటి నుండి పెళ్ళిగారి లెందుకొచ్చిందో నీ వెంత విచిత్రంగా మారిపోయావో, ఎందుకిలా ప్రవర్తిస్తున్నావో నాకు తెల్సిపోయింది. నీ ఆలోచనలు కూడా తేటతెల్లమై పోయాయి. పైకి మాత్రం నటన."

"తెలిసే ఎందుకాపుతున్నారు?"

"ఆపడం లేదు. ఆలోచించమంటున్నాను- అది నిజమని నమ్మవద్దంటాను."

"మీకు చెప్పిన డాక్టరే నాకూ చెప్పింది. ఆయన మాటలుకూడా నమ్మవద్దంటారా?"

"డాక్టర్ ! ... హుం! ... నన్ను చూస్తుంటే తెలియడంలేదా ?"

"మిమ్మల్నెందుకు చూడాలి ? మీరే నన్ను చూడ్డంలేదంటే !"

"నిజమే ! అందమైన నీకు, ఈ జబ్బు ఎక్కడ అంటుకుంటుందోనని పారిపోతున్నావు."

"చూశారా ! నిజాన్ని మీరే అంగీకరించారు...అయితే మీకా జబ్బు వుందన్న మాటేగా !"

"అర్చనా ! అర్చనా !! ... నీకెలా బోధపర్చాలో అర్థం కావడంలేదు."

"వద్దండి ! వద్దు. ఈ భయంకరమైన వ్యాధి యింకొకరికి సోకకూడదు. అది మరొకర్ని వరించకముందే యిక్కడ్నుంచి వెళ్ళిపోవడం మంచిది."

"ఎవడో చేతకాని డాక్టర్ మాట పట్టించుకుంటావెందుకు ?"

"డాక్టరన్నవాడు అనవసరంగా నిపర్ణి శోధ పెట్టడు."

"అయితే-భర్తనే మమకారం కూడా లేదన్నమాట నీకు !"

"మమతానురాగాలను కూడా తినేస్తుందంటీ జబ్బు !- అందుకే దూరంగా వెళ్ళిపోతున్నా."

"పోతే నువ్వుపో !...పిల్లలెందుకు ?!"

"వాళ్ళు సుఖంగా వుండడం నాక్కావల్సింది."

"అ...ర్చ...న!"

"చూడండీ ! యింట్లో వుంటూ మిమ్మల్ని వేరుగా చూస్తుంటే- మీకూ నాకూ బాధే ! ఒకే యింట్లో రెండు కుండలు ఉడుకుతుంటే, నలుగురూ అనుమానించకుండా, అవమానించకుండా వుండాలనే...ఈ ప్రయాణానికి నిశ్చయించుకున్నాను"

వ్యత్యాసం

– రామసూరి

ఒక్కొక్కప్పుడు
ఆకాశంలో మబ్బులా
ఎక్కడికో ఈ పరుగు
ఎందుకో గుండెల్లోంచి చిందే
ఈ కన్నీరు –
లోయల్లోంచి
కొండల్లోంచి
ఈ ప్రకృతి గుండెల్లోంచి
పలకరించే
చైతన్యాన్ని
ఎద లోతుల్లో
పదిలంగా దాచుకునే
ఈ పువ్వులు
సాయంత్రానికి
రాలిపోతామని తెలిసి కూడా
నవ్వుతూ పలకరిస్తాయే !
కాని
నేను ఎదురుగా
ఎంతో ఉజ్వలమైన భవిష్యత్తు
కన్నుగీటి పలకరిస్తున్నా
క్షణ క్షణానికీ
చతికిలపడి పోతానేం ???

"అర్చనార్చనా! ... నాకేజబ్బూలేదు. వేరే డాక్టర్ ఏమన్నాడో తెలుసా?"

"వద్దు. వేరే డాక్టర్‌తో నాకుపనిలేదు. నమ్మకం వుంది నాకు."

"అయితే... యిన్నాళ్ల బంధం!..."

"అది చిటికి చిటికి పోతుందనుకో లేదండీ!"

"మానవత్వమైనా దాగుందా నీలో!.."

అర్చనా! అర్చనా!!

"లేదు ఆమాటకొస్తే మనిషినేకాదు"

"మానసా, మనుతున్న భార్యేనా యిలా ప్రవర్తించేది?"

"మిమ్మల్ని ఓదార్చే నేర్పుగాని, సేవలు చేసే ఓర్పుగాని నాకు లేదు. నాకు నా సౌఖ్యం కంటే భవిష్యత్ ముఖ్యం. పిల్లలు మనిద్దర్లో ఏ ఒక్కర్నీ ఏవగించుకోవడం నా కిష్టం లేదు."

"పిల్లల వంకన నువ్వు నన్ను అసహ్యించుకుంటున్నావు."

"అలా అంటారని తెలుసు. ఏక్కడున్నా మీ మేలే కావాలి."

"అందుకే నిజం తెల్సుకోకుండా విడిచి వెళ్తున్నావు."

"అవును. సతీ సుమతిలాగా కుష్ఠురోగైన భర్తను భరించే శక్తిగాని, బాగు చేసుకునే పాతివ్రత్యంగాని నాకు లేదు" అని గదిలోనుంచి బైటకు వెళ్ళిపోయింది అర్చన.

అనంత్ శిలా విగ్రహంలా నిల్చున్నాడు. టేబుల్ మీదున్న వీలునామా కాగితాలు గాలికి కదులుతూ అతన్ని గేలి చేస్తున్నట్టున్నాయి.

* * *

"డాక్టర్! నాకీ జబ్బు వస్తుందని అర్చన కెందుకు చెప్పారు?" ఆవేశంగా అడిగాడు డాక్టర్ని అనంత్.

"అది నా బాధ్యత" ముక్తసరిగా అన్నాడు డాక్టర్.

"ఎంత పని చేశారండీ!... యిప్పుడు నేను ఒంటర్ని" బాధా తప్త హృదయంతో అన్నాడు అనంత్. మళ్లీ అనంత్ అన్నాడు.

"నాకు తెల్సు డాక్టర్! ఏదైతే ఆమెకు తెలియకూడదనుకున్నానో, యింత ప్రాకులాట అంతా వ్యర్థం అయ్యేరోజు వస్తుందనుకున్నాను అలాగే అయ్యింది. అర్చనను దూరం చేసింది."

"అందర్నీ దూరంచేసే భయంకరమైన అంటువ్యాధి అనంత్." అని డాక్టర్ అన్న వెంటనే లేచి నిలబడి "క్షమించండి. అంటు వ్యాధి కదూ!" అని బైటకు వెళ్ళిపోయాడు అనంత్.

డాక్టర్ బిత్తర పోయాడు.

* * *

(38 వ పేజీ చూడండి)


ఫిల్టర్ కాఫీ రుచిని మేము యిలా
తీసుకెళ్లి...
...ఇందులో అలా చేర్చేసాం
రికరి®
ఇన్‌స్టంట్
Nescafé
SPECIAL TUMBLER PACK
Ricory
INSTANT
A COFFEE CHICORY BLEND
ఇది నెస్‌కాఫీ ఉత్పత్తిదారులదే–ప్రపంచమంతటా కాఫీ

వారఫలం

24-11-1978 శుక్రవారం మొదలు 30-11-1978 గురువారంవరకు

మేషం :— రాజకీయ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. వృత్తిలో పోటీవారిపోటీ పెరుగుతుంది. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. ప్రయోజనంగల పరిచయాలు యేర్పడతాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. ఆడంబరం కోసం వ్యయం జరుగుతుంది.

వృషభం :— ప్రయాణాలు ఫలిస్తాయి. సాహసిక వ్యవహారాలు లాభిస్తాయి. వ్యాపారంలో శ్రమమీద అనుకూలత లభిస్తుంది. మీ అంచనాలు తారుమారు కాగలవు. ఏ వ్యవహారంలోను మొగమాటాలు తగవు. స్త్రీలకు-దైవకార్యాలు నెరవేరతాయి. సంతానానికి సౌఖ్యసంతోషాలు లభిస్తాయి.

మిధునం :—మీ కార్యక్రమాలు అడావుడిగా ఉంటాయి. పోటీవారిలో గౌరవం లభిస్తుంది. వృత్తిలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. విద్యా వైజ్ఞానిక రంగాల్లో మీ కృషి రాణిస్తుంది. మిత్రుల సహాయం లభిస్తుంది. స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. పుణ్యకార్యాలు చేస్తారు.

కర్కాటకం :—సాహసిక వ్యవహారాలు లాభిస్తాయి. మిత్రులకు సహాయం చేస్తారు. వారం మధ్యలో స్థిరాస్తి వ్యవహారాలు బాగుంటాయి. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. స్త్రీలకు— సంతోషకరమైన వార్తలను వింటారు. ప్రయాణాలు వాయిదా పడతాయి.

సింహం :— మీ శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది. వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కలుసుకొంటారు. మీ కార్యక్రమాలు చురుకుగా సాగుతాయి వ్యాపారంలో పోటీవారిపోటీ తగ్గుతుంది. రాజకీయ వ్యవహారాలు బాగుంటాయి. స్త్రీలకు- ఆరోగ్యం బాగుంటుంది. సాహిత్య కళా రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

కన్య :— మీ ప్రయత్నాలు బాగుంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. రావలసిన డబ్బు అందుతుంది. ప్రయోజనంగల పరిచయాలు యేర్పడతాయి. భాగస్వాములతో కలిసిచేసే వ్యాపారాలు లాభిస్తాయి. స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

తుల :— మీ తాలూకు మనుష్యులే మిమ్మల్ని వ్యతిరేకిస్తారు. ప్రయాస కలుగుతుంది. వారం మధ్యలో మీ కార్యక్రమాలు బాగుంటాయి. వ్యాపారంలో నూతనావకాశాలు లభిస్తాయి. పోటీవారిలో గౌరవం బాగుంటుంది. స్త్రీలకు— ఆరోగ్యం బాగుండదు. విలాసవస్తువులుకొంటారు.

వృశ్చికం :— రావలసిన డబ్బు అందుతుంది. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. వారం మధ్యలో మీ తాలూకు వస్తువులు పోవచ్చును. ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. వ్యతిరేకమైన వార్తలను వింటారు. స్త్రీలకు కుటుంబ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి.

ధనుస్సు:— వ్యాపారంలో ముఖ్యమైన వ్యక్తులను కలుసుకొంటారు. స్థిరాస్థివ్యవహారాలుబాగుంటాయి. మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. సాహసిక వ్యవహారాలు లాభించగలవు విద్యా వైజ్ఞానికరంగాల్లో మీ కృషి రాణిస్తుంది. స్త్రీలకు- ఆరోగ్యం బాగుంటుంది. బంధువులకు సహాయం చేస్తారు.

మకరం:— ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. సంతోషకరమైన వార్తలనువింటారు. ప్రయోజనంగల పరిచయాలు యేర్పడతాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. అధికారులవలనజరగవలసిన వ్యవహారాలు బాగుంటాయి స్త్రీలకు— పుణ్యకార్యాలు చేస్తారు. శుభకార్యాల విషయంలో అనుకూలత లభిస్తుంది.

కుంభం:— సాహసిక వ్యవహారాల్లో నష్టం వస్తుంది. ఫలితంలేని శ్రమ కలుగుతుంది. వారం మధ్యలో వృత్తి వ్యాపారాలు బాగుంటాయి మిత్రులకు సహాయం చేస్తారు. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతిలభిస్తుంది. స్త్రీలకు—ఆరోగ్యం బాగుండదు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

మీనం :— నూతన వ్యవహారాలు బాగుంటాయి. మీ ఆలోచనలు ఫలిస్తాయి. వారం మధ్యలో మీ ప్రయత్నాలకు ఆటంకాలువస్తాయి. వృత్తిలో యెవరినీ విశేషంగా నమ్మడంతగదు. ఆందోళన కలుగుతుంది. స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. బంధువులకు చికాకులు యేర్పడతాయి.

—మహేష్

గమనిక

ఈ వారంతో మినీ యింటర్‌వ్యూ శీర్షికని ఆపివేస్తున్నాము. పాఠకులు గమనించగోరుతున్నాము. —సం॥

అన్నం దగ్గర రెడ్ వైన్, ఆపుల్ వైన్ అరగాలన్ సీసాలనిందుకి పెట్టారు. ఎవరికి కావాల్సినంత వాళ్లు వంచుకొని మంచినీళ్లలాగా, మంచినీళ్ల బదులు తాగుతున్నారు. కబుర్లు చెప్పుకొంటున్నారు.

"మీరేం చేస్తున్నారు?" అని అడిగింది పార్వతి, షీలను.

"ఓక్లేహైలో టీచర్‌గా పన్చేస్తున్నాను" అని కొంచెం గర్వంగా చెప్పింది.

"ట్రెయినింగ్ పూర్తిచేసారా?"

"ఆ స్టుపిడ్ ట్రెయినింగ్ అయింది. నేను ట్రెయినింగ్ అక్కర్లేని రోజుల్లోనే టీచరుగా జేరాను. కాని ట్రెయినింగ్‌చేసి వచ్చినవాళ్లు వాళ్లేదో సుపీరియర్ జాతైనట్టు ఆ ట్రెయినింగ్ నేనేదో పాస్ కాలేనట్టు మాట్లాడ్డం మొదలు పెట్టారు. అందుకని, వాళ్లు జీతం ఇస్తూ ట్రెయినింగ్ చెయ్యమంటే మనకేమిటి అని ఈ ఏడాది పూర్తిచేసాను. కోర్సులో నాకు మంచి గ్రేడ్సు వచ్చాయి. టీచింగ్ ప్రాక్టీస్‌లో నా సూపర్‌వైజర్ నాకు సలహాలివ్వడం మొదలు పెట్టాడు. ఓ రోజు వళ్లు మండి నేనూ వాడికి సలహాలివ్వటం మొదలుపెట్టాను. దాంతో నోరు మూసుకొన్నాడు. ఇప్పుడు మా మాక్స్, అదే నా సూపర్‌వైజర్, నేను ఫ్రెండ్సు అయిపోయాం. నాకు చాలా కాంప్లిమెంట్సు యిస్తూవుంటాడు. వాళ్లతో ఎగ్రసివ్‌గా వుండకపోతే బతకలేం. మీకేమన్నా టీచర్‌గా జేరదామని ఉద్దేశం వుందా?" అని అడిగింది షీల.

"ఫిబ్రవరీ సెషన్‌కి మొనాష్ కాలేజికి అప్లై చేద్దామనుకొంటున్నాను" అని చెప్పింది పార్వతి.

"ట్రెయినింగ్ ఓక్లేహైలో చేస్తానని చెప్పండి వాళ్లతో." పార్వతి షీలని చాలా వివరాలు అడిగింది.

కాస్సేపటికి మాటలు స్విమ్మింగ్ మీదకు మళ్లాయి.

"నేను నేర్చుకోవాలనుకొంటున్నాను" అంది పార్వతి.

"డాండినాంగ్‌లో మంగళవారం సంత జరుగుతుంది. అక్కడ గ్రీకులకోసం, చాలా మోడెస్టువి స్విమ్మింగ్ డ్రెసెస్ అమ్ముతారు. గ్రీకులు అన్ని విషయాల్లోనూ మనలాగే! వాళ్లతో డేటింగ్‌లు గట్రా కుదరవు. బాబ్ నన్నోసారి సినిమాకి తీసుకువెళ్తానంటే మా అమ్మ ఒప్పుకోలేదు. ఇదంతా మనవాళ్ల వైఖరి. నేను బిల్లు చెత్తగా తిరగదల్చుకొంటే క్లాసులు మానేసి డే టైమ్‌లో తిరగిరాదా? అల్లా ఆలోచించం. మనం గ్రీకుల్లోంచి స్వంత విషయాల్లోకి వచ్చేసాం! ఇంతకీ వాళ్లల్లో ఆడపిల్లకి పెళ్లి కుదిరినా అబ్బాయితో అమ్మాయిని ఎక్కడకి పంపరు. పంపితే పక్కన తైనాతీ తప్పదు. అందుకని పార్వతిగారూ! గ్రీకుల తిళ్లు మనకి రుచిగా వుంటాయి. గ్రీకుల బట్టలు మనకి నప్పుతాయి. డాండినాంగ్‌కి వెళ్లండి. అప్పైన మీరు స్విమ్మింగ్‌కి వెళ్లేటప్పుడు నన్ను తీసుకొని వెళ్లండి" అంది వనజ.

సీరియల్

ఆకర్షణ-వ్యామోహం



కమనశర్మ

(గత సంచిక తరువాయి)

"నేను వెళ్లినప్పుడు, అల్లాగే మీరు వద్దురుగాని" అంది పార్వతి.

"ఏం? కృష్ణకి లాగానే మీఆయనకి మీరు స్విమ్ చెయ్యడం యిష్టం వుండదా?" అని అడిగింది లక్ష్మి.

"అదేం లేదు. షీల స్విమ్ చెయ్యడం ఆయన కిష్టం వుండదా?" అని అడిగింది పార్వతి

"అదేంలేదు. నాకు, మాఆయనకు స్విమ్మింగ్ రాదు. పైగా ఆ డ్రెస్సులో వళ్లు కనిపిస్తూ వుంటే ... నన్నలా ఊహించుకోలేను" అంది షీల.

"మాఆయనకి నేను స్విమ్మింగ్ చెయ్యనని కోపం. షీల అల్లా అంటుందిగాని వాళ్లాయనకి షీల చెయ్యడం ఇష్టంలేదు. షీల అందాలు ఊళ్ళోవాళ్లు కంటబడ్డే భరించలేడు. అందుకని తను కూడా స్విమ్ చెయ్యడు. కదూ! కృష్ణా" అంది లక్ష్మి. పైభాషల వాళ్లని 'గారు' లేకుండా పిలవడం సులభమే! అందుకని మిగిలిన ఇండియన్సుని లక్ష్మి 'గారు' లేకుండానే పిలుస్తుంది.

ప్రశ్న వినకుండానే "నా స్వభావమే అంత" అన్నాడు కృష్ణ. అందరు నవ్వారు.

రాత్రి పన్నెండయ్యాక ఒకొక్కళ్లే సెలవు తీసుకొని ఇళ్లకి బయల్దేరారు.

మరుసటి మంగళవారం శంకరరావు పెందరాళే యింటికి వెళ్లాడు. పార్వతి, బాబుని తయారుచేసి తను తయారై వుంది. ముగ్గురు బస్సులో డాండినాంగ్ వెళ్లారు. ఆ బజారు ఇండియాలో పెద్ద సంతలుండే తీరులో వుంది. అమ్మేవాళ్లు తెల్లవాళ్ళు. అమ్ముతున్నవి తెల్లవాళ్ళకి కావలసిన వస్తువులు. అంతే తేడా. ఇండియామీద బెంగపెట్టుకొన్న వాళ్లిక్కడ బేరాలాడవచ్చు. మిగిలినచోట్ల బేరం ఆడితే వింత మృగాలను చూసినట్టు చూస్తారు. కింద లాగు, పైన గౌను వున్న డ్రెస్ ఎన్నుకుంది పార్వతి. అయిదు డాలర్లు చెప్పి నాలుగు డాలర్ల డెబ్బై అయిదు సెంట్లు కివ్వడానికి ఒప్పుకొన్నాడు కొట్టతను. శంకరరావుకి అది అమ్మమ్మలు వేసుకోవాల్సినదానిలా అనిపించింది. పైగా కొంచెం మాసినట్టుంది. "ఇక్కడ కొనుక్కోవద్దు. మయెర్సులో గాని వూల్‌వర్త్సులో గాని కొందాం" అన్నాడు.

జరిగిన కథ - 3 : కొత్త జీవితం గడపటానికి స్వదేశం నుండి ఆస్ట్రేలియా వెళ్లిన శంకరరావుని, పార్వతిని — రంగస్వామి, ప్రొ. బ్రౌన్‌లు సాదరంగా ఆహ్వానించి వాళ్ల ఫ్లాట్‌కి తీసుకువెళ్తారు. పార్వతి టీచర్ ఉద్యోగానికి ప్రయత్నించి నిరాశ చెందుతుంది. తర్వాత కొన్నాళ్లకు ఒక బట్టల కంపెనీలో ఉద్యోగానికి చేరుతుంది. ఉన్నంతలో 'వినాయక చవితి' పండుగ జరుపుకుంటారు శంకరరావు దంపతులు.

"దీనికే అక్కడ ఏ ఎనిమిది డాలర్లో తగలెయ్యాలి. దండగ" అంటూ పార్వతి, దాన్ని పాక్ చేయించింది.

"నేను మాత్రం బాబుకి, నాకు మయెర్సులో కొంటాను" అన్నాడు శంకరరావు.

ఆ మర్నాడు పొద్దున్న యూనిలో పని లేకపోవడంతో శంకరరావు, పెళ్లాం పిల్లాడులతో ఛాడ్‌స్టన్ షాపింగ్ సెంటర్‌కి వెళ్లాడు. అదో పెద్ద ఇంద్రభవనంలాగా కళ్లు మిరుమిట్లు కొలుపుతూ గందరగోళంగా వుంది. అక్కడ జనంలో పడుచు మగవాళ్లు కొద్దిగా వున్నారు. అంతా స్త్రీలు పసిపిల్లలు వృద్ధులు.

పిల్లల్ని ఆడించడానికి రంగులరాట్నం లాంటి రకరకాల రైడ్సున్నాయి. బాబుని ఓ క్షేమకరమైన దాంట్లో ఎక్కించి ఇరవై సెంట్ల కాయిన్ వేసాడు. బాబు యిప్పుడిప్పుడే ఒక్కడు కూర్చోగల వయస్సుకి వస్తున్నాడు. అది కదుల్తుంటే వచ్చీరాని పళ్ళతో బాబు కిలకిలా నవ్వుతుంటే "ఈ సంపన్న దేశంలో నా కొడుకు పెద్దవాడై పెద్ద చదువులు చదివి పెద్ద ఉద్యోగం చెయ్యాలి" అనుకొంది పార్వతి. "నా కొడుకుకి డబ్బు కిబ్బంది అంటే ఏమిటో తెలియకుండా ఈ దేశంలో అయితే పెంచగలను. అక్కడేముంది. ప్రతీ నెల పై నెల ఫస్టుకోసం ఎదురుచూడటమే, ఎంత పెద్ద ఉద్యోగం చేసినా! వ్యాపారస్తులకి మాత్రమే ఇండియాలో సుఖాలు. రిసెర్చి స్కాలర్నైన నేను మరో రెండు నెలలలో కారు కొంటానిక్కడ. అక్కడైతే రిటైర్రయ్యేనాటికే కారు కొనేది" అనుకొన్నాడు శంకరరావు. రైడయిపోగానే బాబుని తీసుకొని దంపతులిద్దరు మయెర్సుకి నడిచారు. అక్కడ పైకి కిందకి పోయే మెట్లమీద కాస్సేపు బాబుతో ఆడుకొని, బట్టలవేపు నడిచారు. అక్కడ నాలుగు డాలర్లకి ఒక మంచిరకం స్విమ్మింగ్ ట్రంక్ కొనుక్కొన్నాడు. బాబుకి ఒక డాలరు పెట్టి కొన్నాడు. ఎవరు కొనని రంగులు, పాతబడ్డ ఫాషన్లవి, గుట్టలుపోసి బట్టలు సగం ధరలకి అమ్ముతున్నారు. "మన దేశంలో 'తగ్గింపు ధరలు' ఒక తమాషా. ముందర ధరలు పెంచి వాటిమీద తగ్గింపు ధరలు వేస్తూవుంటారు. ఇక్కడ తగ్గింపు అంటే నిజమైన తగ్గింపేకదా!" అన్నాడు శంకరరావు. పార్వతి ఒప్పుకొంది. అక్కడనుంచి బొమ్మల విభాగానికి వెళ్లారు. అక్కడ రకానికో బొమ్మ, వచ్చిన పిల్లలు ఆడుకోడానికి పెట్టారు. పిల్లలు వాటితో ఆడుకొని కొనకుండా వెళ్లిపోయినా ఎవరూ ఏమీ అనడంలేదు. శంకరరావు పిల్లాడికి చూపించే మిషతో అన్నింటితోను ఆడుకొన్నాడు.

చిచ్చా!

డా॥ సి. నారాయణరెడ్డి

రోజా వింటాను నీ పిలుపు
మెడలా నిక్కిన మేడలోనుంచి
కిటికీల చెవుల్ని పొడిగించి.
పలికేది పాలగొంతే
ఉరిమేది ఉల్కా సమాజం.
పిలిచేది పిసరంతే
ఉలికేది ఉగ్రాక్షి కోణం.
చిచ్చా! నీ ఒళ్లంతా మెరుపు
పచ్చి కుంకుమలాంటి ఎరుపు.
నువ్వు పాకుతావు
రెండు కాళ్ల భుజంగంలాగా.
నువ్వు నడుస్తావు
నేల నెరుగని తరంగంలాగా.
ఎంత మిసిమి నీ బుగ్గల్లో?
వెన్నెల ఉరిపోసుకుంటుంది.
ఎంత రశ్మి నీ కళ్లల్లో?
సూర్యాత్మ వెలవెల బోతుంది...
మెత్తదనాల కుప్పా!
ఎక్కడిది నీకీ చురుకు?
అర్థమయిందప్పా
"చైతన్యం" నీ గుత్తా సరుకు.

ఆకర్షణ - వ్యామోహం

"చిన్నతనంలో తీరని ముచ్చట్లు తీర్చుకొంటున్నారా?" అంటూ పార్వతి నవ్వింది.

"కాదు. ఏదైనా చిన్న బొమ్మ బాబుకి కొందామని" అన్నాడు శంకరరావు. పౌరుషానికి రెండు డాలర్లు పెట్టి ఓ చిన్న ట్రక్కు బొమ్మ కొన్నాడు.

అక్కడ్నుంచి కాంటీన్‌కి వెళ్లి చీజ్ టొమేటా సాండ్‌విచ్‌లు, అయిస్‌క్రీము కొనుక్కొని తినీ, బస్సెక్కి ఇల్లు జేరుకొన్నారు. షాపింగ్ అంటే తలనొప్పిలా కాక ఏదో వస్తు ప్రదర్శనలో సరదాగ గడిపినట్టు గడిచింది ఆరోజు.

ఆ ఆదివారం శంకరరావు, పార్వతి పిల్లాడిని తీసుకొని ఎల్‌వుడ్ బీచికి వెళ్లారు. వేసంగికాలం బాగా వచ్చిందేమో జనం కిక్కిరిసి వున్నారు. శంకరరావు స్విమ్మింగ్ ట్రంక్ మీద పంచె కట్టుకొని వెళ్లాడు విప్పుకోడానికి వీలుగా వుంటుందని. పంచెమీద లాల్చీ వేసుకొన్నాడు. పార్వతి కూడా స్విమ్మింగ్ డ్రెస్ మీద చీర కట్టుకొంది. బుట్టలో తువ్వాళ్లు, మారు బట్టలు తిండి సర్దుకున్నారు. బస్సుకోసం నిలబడ్డారు.

దారిన పోయేవాళ్లు వీళ్లని కొంచెం వింతగా చూస్తూ వెళ్లారు. పిల్లలు మరికొంచెం తేరిపార చూసారు. ఆస్ట్రేలియాలో రూల్సు ప్రకారం ఎవరు నైటు డ్రెస్సులతో రోడ్లమీద తిరగరాదు. తిరిగితే పట్టుకొని జరిమానా వేస్తారు. చాలామంది ఇండియన్లు పంచె, లాల్చీ రాత్రిళ్లు మాత్రమే వేసుకొంటారు. అందుకని వాళ్లు శంకరరావుని హెచ్చరించారు "మీరిండియాలోలాగా పంచె కట్టుకొని వీధిలోకి వెళ్లగలరు! ఫైను వేస్తారు జాగ్రత్త!" అని.

"చీర కట్టుకొని వీధిలోకి వెళ్తే ఆడవాళ్లకి ఫైను వెయ్యడం లేదుకదా. మనం పంచె కట్టుకొంటే ఎందుకు వేస్తారు?" అని ప్రశ్నించాడు శంకరరావు. ఆ ప్రశ్నకి జవాబు భయపెట్టినవాళ్ల దగ్గర లేదు. వాళ్లంతా ఒకరకం విలువలు పాటించేవాళ్లు. వాళ్ల యింటికి ఎవరైనా వస్తే ఆ సమయానికి పంచె కట్టుకొని వాళ్లంటే గబుక్కున లోపలికి వెళ్లి లాగూ వేసుకొని వస్తారు. శంకరరావు పంచె నలిగిపోతే వేరేది కట్టుకొంటాడు తప్పించి పంచె నుంచి లాగూకి మారడు అందుకని ఓ భారతీయ మహిళ "పంచె కట్టుకొని నలుగురిలోకి వస్తే అసభ్యంగా వుంటుంది" అని సూచించింది. ఆవిడ తండ్రి పంచెలు కట్టుకోడా! క్రితం తరంలో పంచె కట్టుకోనివాళ్లు ఎంతమంది! భారతీయ స్త్రీయేనా ఈ మాటనేది! శంకరరావుకి కోపం, పట్టుదల కలిగాయి. తను తన జాతి దుస్తులు ధరిస్తే ఆస్ట్రేలియన్లు ఎందుకు, ఎల్లా దండిస్తారో చూడాలని పంచె కట్టుకొని బయల్దేరాడు. ఆస్ట్రేలియన్లు కనుక ఏమీ అనకపోతే ఇండియన్ల నోరు మూయించటం సులభమౌతుంది అనుకొన్నాడు.

బస్సు వచ్చింది. బస్సు డ్రైవరు "మీ నేషనల్ డ్రెస్‌లో నువ్వు చాలా బాగావున్నావు!" అంటూ నవ్వుతూ పలకరించాడు.

బీచి దగ్గర బస్సు దిగి బీచ్‌లో అనువైన స్థలంకోసం వెతుకుతుండగా ఒక డ్రాయరు వున్న ఆస్ట్రేలియన్ బికినీలో వున్న ఆడపిల్ల ఎదురై "మీరు సౌత్ ఇండియన్సు కదా!" అని అడిగారు.

"అవును. ఎల్లా పోల్చుకున్నారు?" అని అడిగాడు శంకరరావు.

"నువ్వు పంచెకట్టుకొన్న విధానం. మీఆవిడ చీర కట్టుకొన్న విధానంబట్టీ అనుకొన్నాను. మీరు ఆంధ్రాస్ గాని కానడిగాస్ కాని అయ్యుంటారు. టామిలియన్సు కారు."

"మీకు మా గురించి చాలా తెలుసునే!"

"నేనిండియాలో మెడ్రాస్‌లో ఆర్నెల్లు గడిపాను. నేనిక్కడ మెల్‌బోర్న్ యూనివర్శిటీలో పన్చేస్తున్నాను."

"నేను మొనాష్‌లో పి. హెచ్. డి. చేస్తున్నాను."

"నైస్ మీటింగ్ యూ! మా ఆవిడ ఇండియాలో వున్నప్పుడు రెండు చీరలు కొనుక్కుంది. తనకి చీరలన్నా ఇండియన్ కల్చరన్నా చాలా యిష్టం." అన్నా డ్ర్ాస్ట్రేలియన్.

"అవును నాకు చాలా యిష్టం" అంది ఆ పడుచు.

"నా కిక్కడి పాంట్ సూట్స్ అంటే ఇష్టం" అంది లక్ష్మి.

"అవి చాలా సుఖం. అవునుకదా" అంది ఆ పిల్ల. అవతలవాళ్ల మాటతో ఏకీభవించడం వాళ్లకి సునాయాసంగా వస్తుంది అనుకొన్నాడు శంకరరావు.

"వస్తాం" అని చెప్పి వాళ్లు వెళ్లిపోయారు. "కొద్దిపరిచయాల కిక్కడెవరూ 'మీరు తప్పకుండా రావాలి' అంటూ మొహమాటానికి పిలవరు. హాయిగా" అన్నాడు శంకరరావు.

"మరే. ఇక్కడ నిజమైన స్నేహితులు ఏర్పడటానికి చాలా టైము పడుతుంది" అంది ఆ విషయాన్నే మరో కోణంలోంచి చూసి లక్ష్మి.

దూరంగా ఉన్న ఆవరణలో బట్టలు మార్చుకొని వచ్చారు. తమతో తెచ్చుకొన్న బుట్టలో విప్పిన బట్టలు పెట్టి అవి తమకి ఎదురుగా పెట్టుకొని నీళ్లకి నడిచారు. ఆస్ట్రేలియాలో ఎవరు బట్టలు ఎత్తుకుపోక పోయినా ఎవడైనా క్లెప్టో మానియాక్ ఉండ వచ్చునన్న భయంతో. "ఇండియాలో అవసరం దొంగతనం చేయిస్తే ఇక్కడ మానసిక దౌర్బల్యం దొంగతనం చేయిస్తుంది. రెంటికీ ఫలితం మన వస్తువులు పోవడమే కనుక మనం మన జాగ్రత్తలో ఉండాలి" అంటుంది వనజ. అది మనసులో ఉంచి వాళ్లా జాగ్రత్త తీసుకొన్నారు.

"అన్నట్టు పార్వతీ!" అని పిలిచాడు శంకరం. నీళ్లల్లో మెడవరకు మునగటానికి ప్రయత్నం చేస్తున్న పార్వతి వెనక్కి తిరిగింది. ఆ వెనక్కి తిరిగినప్పుడు వంగుని ఉండటంవల్ల ఆమె అందాలు శంకరానికి కనిపించాయి. శంకరం చెప్పదలుచుకొన్న మాట చెప్పకుండా అల్లాగే నిలబడిపోయాడు. స్త్రీల సౌందర్యం స్నానాల గదుల్లోను, స్నానవాటికల్లోను నదుల దగ్గర సముద్రాల దగ్గర కన్నుల కింపైన విధంగా బహిర్గతం అవుతూ ఉంటుంది. ఇండియాలో పుణ్యం పేరిట నదుల్లోను కాలువల్లోను సముద్రం లోను స్త్రీలు బహిరంగంగా స్నానాలు చేస్తారు. చూసేవాళ్ల కళ్లకి విందు చేస్తారు. స్త్రీలు ఎటువైపు తిరిగినా అటువంటిచోట్ల ఎవరి కళ్లనో పడకతప్పరు. తెలిసిన మగవాళ్లు ఉన్న వైపుకు కాక రెండో వైపుకి తిరిగి బట్టలు మార్చుకొంటారు. ఈ దేశంలో ఈత పేరిట జలకాలాటపేరిట స్త్రీలు బహిరంగ ప్రదేశాలలో సౌందర్యాన్ని బయటకు వంపుతూ ఉంటారు. ఎవరి దగ్గరనుంచీ దాచే ప్రయత్నం ఉండదు.

"ఏమిటి? ఏదో చెప్పబోయి ఆగిపోయారు?" అని అడిగింది నిటారుగా నిలబడి పార్వతి.

"ఏమీలేదు. ఏదో చెప్పబోయినా బ్రాడ్ డే లైట్‌లో నీ అందాలు చూస్తూ ఆగిపోయాను" అన్నాడు శంకరం, బాబుతో ఆమెవేపు నడుస్తూ. ఆ మాట గట్టిగా తెలుగులో అనటాని కతనికి భయంలేదు! అక్కడ తెలుగు ఎవరికీ రాదు!

"బావుంది సరాగం" అని విసుక్కున్నట్టుగా అంది పార్వతి. అందులో విసుగులేదు. కొంచెం గర్వం మాత్రం ఉంది.

"ఇంతకూ ఏమిటట ఆ మాట?"

''ఆదా! ఏమీలేదు. నువ్వు స్విమ్మింగ్‌కి వెళ్ళినప్పుడు వనజ తనుకూడా వస్తానంది కదూ! ఇవాళ మనం పిలవటం మర్చిపోయాంకదా ఏమన్నా అనుకొంటుందేమో ననిపించింది.''

''అంతేనా నన్ను చూసిన భంగిమలో వనజను చూడాలన్న కోరికతో అల్లా అంటున్నారా?'' అంది చురుకుగా.

''వనజనా? ఎందుకల్లా ఊహించావు?'' అని అడిగాడు ఆశ్చర్యంగా.

''నాకంటే చిన్నది కదా! పైగా పిల్లల తల్లుల కంటె కన్నెపిల్లలు బావుంటా రంటారుట!''

శంకరం బాధపడ్డాడు. ''ఇక్కడింతమంది కన్నెపిల్లలు నా కళ్ల పడుతుండగా లేని బాధ ఇక్కడ లేని వనజ నా కళ్ల బడటం గురించి ఊహించి బాధపడుతున్నావా? పైగా వనజ మన స్నేహితుల కూతురు అల్లా ఊహించటం తప్పు కదూ!''

''మీరు చూస్తుండగా స్విమ్మింగ్ డ్రెస్ వేసుకొని వనజ ఈదుతోందనుకోండి. ఆ పిల్ల అందాలు మీకు అన్ని కోణాలల్లోను కనిపిస్తాయి. ఆ తరువాత వనజ కనిపించినప్పుడల్లా ఈ దృశ్యాలు మీ కళ్లముందు ఆడ్తాయి. అదే ఈ ముక్కూ మొహం తెలియని అమ్మాయిల్ని మీ రివాళ చూసినా మర్చిపోతారు. వాళ్లని తిరిగి కలుసుకోము. కలుసుకొన్నా గుర్తించం. అందుకని వీళ్లని చూస్తుంటే మీకు రక్తమాంసాలున్న మనుషులుగా కాక ఏ హాలీవుడ్ సినిమాలోనో నటిస్తున్న బొమ్మల్లాగా కన్పిస్తారు. అదే తెల్సినవాళ్లయితే వాళ్లు మనకు కనిపించితీర్తారు. అందుకనే తెలిసినవాళ్లతో ఈతలకు రావడం నా కిష్టం ఉండదు. నాకు గుర్తుండే, వనజని పిలవలేదు'' అని పార్వతి తన మనస్సులోని మాట చెప్పింది.

శంకరరావుకి ఆ రోజున మన దేశంలో నదుల దగ్గర స్త్రీలు తమకి తెలిసున్న మగవాళ్లున్న వైపుకు కాక రెండో వైపుకి తిరిగి ఆ వైపున మగవాళ్లున్నాకూడా బట్టలెందుకు కట్టుకొంటారో అర్థమైంది. అతని తురక స్నేహితు డొకసారి ''మా చుట్టాలమ్మాయిలు మావద్ద బురఖా పాటిస్తారు. మీ దగ్గర పాటించరు. వాళ్ల మొహాల్చూసే అదృష్టం మాకుండదు.'' అని జోక్ చేసాడు.

''నీ థీరీ బాగానే ఉంది కాని ఇప్పుడు మనం ఈదుతున్న సమయంలో ఏ ఇండియన్ అన్నా వచ్చి నిన్ను చూస్తాడనుకో. అతనికి కలకాలం నువ్విలా స్విమ్మింగ్ డ్రెస్‌లోనే గుర్తుండిపోతావా? అతను నిన్నెప్పుడు చూసినా, ఆపైన, నిన్ను ఇలాగే ఊహించుకొంటాడా? అతనికి తిరిగి జీవితంలో నువ్వు కనపడకుండా జాగ్రత్త పడాలా?''

''దానికి మీరంటూ ఉంటారే ఆ ప్రాబబిలిటీ తక్కువ.'' అంది పార్వతి. ఆపైన మాట మారుస్తూ ''ఒరేయ్! బాబు ఇల్లారా!'' అంటూ ఒడ్డుకు వెళ్లి బాబుని చేతుల్లోకి తీసుకొని నీళ్లల్లో ముంచింది. పళ్లు కరుచుకొంటూ భయపడుతూనే బాబు ఆ చన్నీళ్ల సుఖాన్ని చవిచూసాడు.

ఓపికున్నంతసేపు నీళ్లలో ఆడారు. ఆపైన బయటకు వచ్చి తమతో తెచ్చుకొన్న లంచ్ తిన్నారు విశ్రాంతి తీసుకొన్నారు. ఆపైన బాబుకి స్పేడ్, బకెట్‌లు ప్లాస్టిక్‌వి యిచ్చి ఇసకలో ఆడించారు. బాబుకు ఆ వయస్సు నిజానికి రాలేదు. ఏడాది నిండబోతోంది. కాని అదో ముచ్చట. పార్వతి బాబుని ఆడిస్తూవుంటే శంకరరావు కాస్సేపు ఈదాడు. బాబుని ఆడుకోమని పార్వతి శంకరం ఈదుతున్నచోటికి వచ్చింది. మెల్‌బోర్న్‌లో సముద్రం ఎంత లోపలికి వెళ్ళినా మొలలోతుకంటే వుండదు. కెరటాలు రావు. అక్కడన్నీ 'బే'లే. అందుకని సముద్రస్నానం భయంగా వుండదు. ఇండియాలో భీమునిపట్నం దగ్గర మెల్‌బోర్న్ దగ్గరలా వుంటుంది సముద్రం. కాని మన దేశంలో అంత దూరం రూట్ బస్సుల్లో వెళ్లే ఓపిక డబ్బు ఎవరికోగాని వుండవు.

శంకరరావు పార్వతి నడుంచుట్టూ చెయ్యివేసి పట్టుకొని ఈత నేర్పాడు. మొదటిరోజే అయినా తేలటం వచ్చింది పార్వతికి. భర్తలకి భార్యలని నీలాకాశం కింద తాకాలన్న కోరిక సర్వసాధారణమే అయినా భారతదేశంలో అవకాశాలు వుండవు. ధైర్యం వుండదు. అది కప్పిపుచ్చుకోడానికి ''ఛీ పబ్లిక్ ఎగ్జిబిషన్ ఎందుకు?'' అంటూ వుంటారు. మన అభిప్రాయాలకి చాలావాటికి మనం వుంటున్న పరిస్థితులే కారణం! ఈ విషయం గురించి పార్వతిగాని శంకరరావుగాని ఆ క్షణంలో ఆలోచించలేదు మరో దేశం వచ్చి వేరు పరిస్థితుల్లో వుంటున్నారు కనక.

బయటకి వచ్చి బాబు పక్కన కూర్చున్నారు వాళ్లిద్దరు. కట్టుకొన్న బట్టల తడి ఆరగానే వాటి మీదే చీర పంచె కట్టేసుకొని పైబట్టలు తొడిగేసుకొన్నారు. అప్పుడు ఓ జంట అటుకేసి వచ్చింది. వాళ్లని షీలా, కృష్ణకాంత్‌భట్లుగా గుర్తించారు. వచ్చినవాళ్లు వీళ్ల పక్కన కూర్చున్నారు.

షీల చీర కట్టుకొని కూర్చున్న పార్వతితో ''మనం చీర కట్టుకొని బీచ్‌కి వస్తే వీళ్లు నవ్వుతారు. అందుకనే నేను పాంటు సూట్ వేసుకొని వచ్చాను'' అంది, ఈ దేశం గురించి నన్నడుగు నే చెప్తాను అన్న ధోరణిలో.

అంత వేడిలో పాంట్ సూట్ వేసుకొన్న షీల మీద శంకరరావుకి జాలివేసింది. నవ్వడం అనేది ఆ డ్రెస్సు మనదా? వాళ్లదా? అన్న దానిమీద కాక ఎబ్బెట్టుగా వుందా లేదా అన్న దానిమీద



డాక్టర్ సలహాలు

వి. ఆర్. కె. — హైదరాబాద్

నాకు పాదాలు మంటలుగా వుంటాయి. ఇలా తరచు వస్తుంది. ఇవి పోవటానికి ఏమి చెయ్యాలి? ఇలా రాకుండా ఏమైనా ముందు జాగ్రత్తలు వున్నాయా?

★ మీరు మూత్ర పరీక్ష చేయించుకోవాలి. మూత్రంలో చక్కెర (డయాబెటిస్) వున్నప్పుడు, విటమిన్ 'బి' లోపం, ఇలా రావటానికి ముఖ్య కారణాలు. ఈ పరీక్ష తర్వాత 'బ్లడ్ షుగర్' — ఫాస్టింగ్, పోస్ట్ ప్రాండియల్ చేయించుకొని రోగ నిర్ధారణ అయిన తర్వాత సరి అయిన మందు వాడవచ్చును. ఈలోగా 'బెరిన్' ఇంజక్షన్లు, బి కాంప్లెక్స్ మాత్రలు వాడండి.

కె. టి. ఆర్. — గుంతకల్లు

మా అబ్బాయికి 1 సంవత్సరము నిండుతోంది. మట్టి తింటున్నాడు. తరచూ మందంగానూ, అజీర్తిగానూ వుంటోంది.

★ పిల్లలు మట్టి, బలపాలు, బొగ్గులు మొదలైనవాటిని తినటాన్ని పైకా అంటారు. ఆహారంలో ఇనుపధాతువు లోపించినపుడు, ఆహార విషయంలో అసంతృప్తి ఏర్పడినపుడు, తల్లి దండ్రుల నుండి వేర్పాటు ముఖ్యమైనవి పిల్లలు ఇలా చేయటానికి కొన్ని కారణాలు.

నియోఫెర్రం డ్రాప్స్ తడవకి 4 డ్రాప్స్ వంతున రోజుకి మూడుసార్లు వెయ్యాలి. ఆకు కూరలు ఎక్కువ తడవలుగా కొద్దికొద్దిగా ఆహారము ఇవ్వడం, నమలటానికి వీలు కలిగేవిగా వుండేవి ఇస్తే సంతృప్తి కలుగుతుంది.

మట్టి తినటంవల్ల కడుపులో క్రిములు చేరే అవకాశము వున్నది. మల పరీక్ష చేయించి క్రిములు వుంటే మందులు వాడండి.

సి. ఎస్. ఆర్. — ఖరగ్‌పూర్

నా వయస్సు 28 సంవత్సరములు. వీపు క్రింది భాగంలో ఎప్పుడూ నొప్పిగా వుంటుంది. రోజూ లేవగానే కాళ్ళు పట్టేసినట్టు వుంటుంది. నడుస్తున్నప్పుడు నడ్డి భాగంలో నొప్పి వుంటుంది.

★ ఈ లక్షణాలు 'లంబాగో పయాటికా'ను తెలియజేస్తాయి. కాళ్ళకి వచ్చే నరములు వెన్నెముక అడుగు భాగంలోని 'సేక్రమ్' అనే ఎముకగుండా వస్తాయి. ఈ ఎముకకు, తుంటి ఎముకకు మధ్యన ఒక కదలని కీలు వున్నది. వెన్నెముక చుట్టువున్న కండరములు, వాచినప్పుడు నరముల రాపిడికి నెప్పి వస్తుంది.

బెరిన్ మాత్రలు, ఫినైల్ బ్యుటజోన్, ట్రయాక్టిన్ మాత్రలు వాడితే తప్పక ఫలితం కనబడుతుంది.

కె. సి. డి. — రాయన్నగూడెం

కామెర్లు రావటానికి కారణాలు ఏమిటి? ఈ జబ్బు ముదిరితే ప్రమాదమా? కామెర్ల లక్షణాలు ఏమిటి?

★ కామెర్లు సామాన్యంగా కలుషితమైన నీటి మూలంగా వైరస్‌వల్ల వస్తుంది. దీనిని ఇన్‌ఫెక్టివ్ హెపిటైటిస్ అంటారు.

పిత్తాశయములో రాళ్ళు మొదలయినవి అడ్డు పడినపుడు, అబ్‌స్ట్రక్టివ్ జాండిస్ వస్తుంది.

చంటిపిల్లలకి, 'ఆర్ హెచ్' — బ్లడ్ గ్రూప్‌లో తల్లికీ, తండ్రికీ వ్యత్యాసమున్నప్పుడూ పుట్టినప్పటినుంచీ కామెర్లు వుండవచ్చును.

పుట్టినప్పుడు హీమోగ్లోబిన్ ఎక్కువకాబట్టి మూడవ రోజునుంచి స్వాభావికమైన ఫిజియలాజికల్ జాండిస్ రావచ్చును.

ఏ జబ్బయినా ముదిరితే ప్రమాదమే. కామెర్లు వున్నవారికి శరీరం పసుపుపచ్చగా అవటం, మూత్రం పసుపుగా పోవటం, మలము తెల్లగా పోవటం, శరీరం దురద, ఆకలి లేమి, జ్వరము, వాంతులు సాధారణంగా వుండే లక్షణాలు.

—డా॥ కె. వెంకటేశ్వరరావు

ఆకర్షణ - వ్యామోహం

ఆధారపడ్తుందన్న చిన్న విషయం షీలకి తట్టనందుకు శంకరరావు ఆశ్చర్యపోయాడు. పైగా షీల పార్వతికి సలహాలస్తున్నందుకు శంకరరావుకి నవ్వు వచ్చింది.

''ఎందుకు నవ్వుతున్నారు?'' అనిఅడిగింది షీల.

''ఇందాక పార్వతి ఈదబోయి, మునిగిపోయిన విషయం గుర్తుకు వచ్చి'' అన్నాడు పార్వతింత వరకు ఈదుతూ వుంది అన్న విషయం షీలకి తెలియజేస్తూ.

''చీరతో పార్వతి ఈదిందా?'' అని ఆశ్చర్యంగా అడిగింది షీల, చుట్టూ ఎక్కడా తడిబట్టలు కన్పించక.

''లేదు స్విమ్మింగ్ డ్రెస్ కొనుక్కున్నాను. చీర లోపల వుంది'' అని పార్వతి, కృష్ణకేసి చూసింది. ఆ మాటలు వింటుంటే అతనిలో ఏ భావాలు కదుల్తాయో చదువుదామని. శంకరరావు ఆ చూపు గమనించాడు. కృష్ణ ''నువ్వు చాలా డేరింగే'' అని అనేలా చెయ్యాలన్నట్టుగా వుంది పార్వతి చూపు అనుకొన్నాడు, శంకరరావు. లోపలెక్కడో భగ్గుమంది, శంకరరావుకి. షీల నమ్మలేనట్టు చూసింది.

''ఓ అరగంట ముందు వచ్చుంటే మీరే చూసుండురు పార్వతిని స్విమ్మింగ్ డ్రెస్సులో. మీకు మంచి ఛాన్సు పోయింది'' అంటూ శంకరరావు పార్వతికేసి చూసాడు. పార్వతి వనజ గురించి అన్న మాటలే తను తిప్పి పార్వతి మీద ప్రయోగించ గలిగినందుకు తృప్తిపడ్డాడు. షీల, కృష్ణ ఓ గంట తరవాత ఎవరి కార్లోనో వెళ్ళిపోయారు.

ఆరోజు రాత్రి ''నువ్వు స్విమ్మింగ్ డ్రెస్ వేసుకొని ఈదావంటే వాళ్ళు నమ్మినట్టులేరు. ఎప్పుడో ఒకప్పుడు నువ్వు వాళ్ళ కంటపడకపోవు. అప్పుడు నమ్ముతారు'' అన్నాడు శంకరరావు. పార్వతిని వాళ్ళు అల్లా చూడటం, అప్పైన పార్వతి చెప్పిన మాట నమ్మటం అదే తన కోరికైనట్టు తన మనసులో వేరే భావం లేనట్టు.

పార్వతి తెలివిగా మౌనంగా వుండిపోయింది.

5

ప్రొఫెసర్లంతా రిజిస్ట్రార్స్ ఆఫీసువేపు తరలివెళ్లారు. విద్యార్థుల్లో రాడికల్స్ దాన్ని ఆక్రమించటం తమ ధ్యేయం అన్న నిర్ణయాన్ని తెలియజేసారు. విద్యార్థులు జీతాలు ఎక్కువ కడుతున్నారని అవి తగ్గించాలని ఆస్ట్రేలియాలో బ్రిటిష్‌వాళ్ళ పలుకుబడి ఎక్కువగా ఉందని అది పోయి ఆస్ట్రేలియన్లే ఆస్ట్రేలియా విషయంలో నిర్ణయాలు తీసుకోవాలని, ఎబొరిజినీస్ నిజమైన ఆస్ట్రేలియన్లని వాళ్ళకి ప్రస్తుతం ఏ విధమైన హక్కులు లేవని, అటువంటి అన్యాయాలు నశించాలని విద్యార్థులు ఒక - అయిదు వందల మంది నినాదాలు చేస్తున్నారు.

శంకరరావు తన ప్రొఫెసర్ బ్రౌన్ బయల్దేర్తుంటే అడిగాడు ''మీరంతా ఎందుకక్కడికి? ఏం జరుగుతుందో చూడటానికా?'' అని.

''కాదు. స్టూడెంట్సు లోపలికి జొరపడకుండా అడ్డు నిలబడ్డాం'' అన్నాడాయన.

''పోలీసుల్ని పిలిస్తే పోలా!''

''ఇప్పుడు వీళ్ళు అయిదు వందలమంది. వీళ్ళ అభిమానులు రెండువేలమంది లేక మూడువేల మంది. మిగిలిన విద్యార్థులు ఈ విధమైన దౌర్జన్యాని కిష్టపడరు. పోలీసుల్ని పిలుస్తే పదివేలమంది ఒకటే అవుతారు. అందుకని విద్యార్థి అలజడుల్లో పోలీసుల్ని పిలవనని వైస్ ఛాన్సలర్ విద్యార్థులకి హామీ ఇచ్చాడు. మేమక్కడ నిలబడి వాళ్ళు లోపలికి వెళ్ళకుండా అడ్డుపడటమే కాకుండా వాళ్ళని గుర్తుపట్టడం కూడా చేస్తాం.''

''ఫొటో తీస్తే గుర్తుపట్టచ్చుకదా!''

''అది రెచ్చగొట్టడమే అవుతుంది. వీళ్ళని ఐడెంటిటీ కార్డుల కోసం ఫొటోలు తీయించుకొన్నప్పుడు, అవెందుకు ఉద్దేశింపబడ్డాయో అందుకే వాడాలని, అంటే మార్కులు వేసేటప్పుడు లైబ్రెరీలో పుస్తకాలిచ్చేటప్పుడు వెరిఫై చెయ్యాలనుకొన్నప్పుడు అల్లాంటప్పుడన్న మాట... అంతేగాని ఇల్లాంటప్పుడు వాళ్ళని గుర్తుపట్టడానికి వాడరాదు అని ఆంక్ష పెట్టారు. వైస్ ఛాన్సలర్ ఒప్పుకొన్నాడు. ఇంతకూ నువ్వు వెళ్ళేది ఎటు?'' అని అడిగాడు బ్రౌన్.

''నేను అటే. చూసేందుకు మాత్రమే జొరపడేందుకు కాదు.'' అన్నాడు శంకరరావు. ఎక్కువమంది స్టూడెంట్లు ఉండటంవల్ల వీళ్ళకి ఎవడి మార్కులు ఎవడికి పడ్తాయో అని భయం. ఎవరైన బోర్డర్ స్టూడెంటుంటే వాడిని ఫెయిల్ చెయ్యాలా? పాస్ చెయ్యాలా? అన్న నిర్ణయం తీసుకోడానికి వాడి ఫొటో దగ్గర పెట్టుకొని స్టాఫ్ ఓ నిర్ణయానికి వస్తారు. లేకపోతే వాడి మొహం గుర్తుండిచావదుట. ప్రొ. బ్రౌన్ చెప్తూ నడుస్తున్నాడు. శంకరరావు వింటూ అనుసరించాడు. బ్రౌన్ పెద్దవాడైనా పెద్ద పెద్ద అంగలు వేస్తూ నడిచాడు. ఎక్కడా పొట్టన్న మాట లేదు. ఆయనతో సమానంగా నడవడం శంకరరావుకి కష్టం అయింది.

[ఇంకా వుంది]

సినిమా విశేషాలు

ఎన్నికలపర్వం హైలైట్ !

''మా చిత్రంలో ఎన్నికలపర్వం హైలైట్. ఈ సన్నివేశాన్ని షూట్ చేయడానికి చాలా టైమ్ పట్టింది. చిత్రంలో ఈ సన్నివేశ ప్రాధాన్యత స్పష్టం కావాలనే కాస్త టైమ్ తీసుకుని మరీ షూట్ చేయడం జరిగింది. కౌరవ, పాండవుల మధ్య జరిగే ఎన్నికల పోరాటంలో ఎడ్ల బండ్లు, సైకిళ్లు, జీపులు, కార్లు హెచ్చు సంఖ్యలో పాల్గొని ప్రొసెషన్‌కు కొత్త అందాల్ని తెచ్చాయి. హరిబాబు, రంగారావు, నరసింహరాజు, మాధవి, కె. విజయ ఒక పార్టీ. నూతన్‌ప్రసాద్, వంకాయల, పి. ఎల్ నారాయణ, సత్యేంద్రకుమార్ మరొక పార్టీ. ఈ రెండు పార్టీల పోరాటమే ఎలక్షన్. ''ఓటు'' విలువ ఏమిటి? దాని ప్రయోజనం ఏమిటి? కళ్లు తెరిచి ఓటు వేయండి. కుళ్లును తొలగించివేయండి అనే విషయాలను ప్రబోధిస్తూ మహాకవి శ్రీశ్రీ వ్రాసిన గీతం మా ఎలక్షన్ కాంపైన్‌కు చక్కటి ఇన్‌స్పిరేషన్'' అన్నారు దర్శకుడు హనుమాన్ ప్రసాద్.

సెప్టెంబర్ 21 నుంచి అక్టోబర్ 5 వరకు మండపేట ప్రాంతాల్లో జరిగిన 15 రోజుల షెడ్యూల్‌తో ''కలియుగ మహాభారతం'' పూర్తయింది. శ్రీ సత్యం ఎంటర్‌ప్రైజస్ వారి ఈ సినిమాస్కోప్ వ్యంగ్య భారతానికి పరుచూరి (కథ, మాటలు), లక్ష్మణ్‌గోరే (కెమెరా), సత్యం (సంగీతం), రామచంద్ర (కళ), నాయని మహేశ్వరరావు (కూర్పు), రాజు, శేషు (నృత్యం), ఈశ్వరరెడ్డి (సహకార దర్శకత్వం), కోటిలింగం (ప్రొడక్షన్) తెర వెనుక సాంకేతిక బలం. శ్రీ జి. సత్యనారాయణ నిర్మిస్తున్న ఈ చిత్రం చిత్ర పరిశ్రమలో ఒక సంచలనాన్ని సృష్టిస్తుందని సినీ పండితుల అంచనా.



'లాయర్ విశ్వనాథ్'లో ఎన్.టి. రామారావు

రాయలసీమ రాజశేఖర రెడ్డి కొత్త ప్రయత్నం

''చరిత్రహీనులు'' చిత్రాన్ని తొలి ప్రయత్నంగా అందించిన, రాయలసీమ రాజశేఖర రెడ్డి మలి ప్రయత్నంగా భారీ సినిమాస్కోప్ వర్ణ చిత్రానికి నిశ్చయించారు.

శక్తి సినీ ఎంటర్‌ప్రైజస్ పేరిట చిత్ర నిర్మాణ సంస్థను నెలకొలిపిన, రాజశేఖరరెడ్డి... విజయదశమి పర్వదినాన తొలి పాటను... జెమినీలో రికార్డు చేశారు.

''కాప్టెన్ కృష్ణ''గా హీరో కృష్ణ కొత్త తరహా పాత్రను పోషించే శక్తి సినీ ఎంటర్‌ప్రైజస్‌కు కె. ఎస్. ఆర్. దాసు దర్శకుడుగా, ఎస్. పి. బాలసుబ్రమణ్యం సంగీత దర్శకుడుగా బాధ్యతలు వహిస్తున్నారు.

సముద్ర తీరాన షూటింగు

జనవరి, ఫిబ్రవరి, మార్చి మాసాలలో కృష్ణ ... శ్రీప్రియగార్లు కాల్‌షీట్లు యిచ్చారని, నిర్మాత రాజశేఖరరెడ్డి తెలిపి... తన చిత్రానికి విశాఖపట్నం సముద్ర తీరాన్ని లొకేషన్‌గా ఎంపిక చేసినట్టు చెప్పారు.

శ్రీ ఆలపాటి రాధాకృష్ణారావు తనకు సంపూర్ణంగా సహకరిస్తున్నట్టు, నిర్వహణ భారాన్ని ఆయన చేబూనినట్టు శ్రీ రెడ్డి తెలిపారు.

మిత్రుడు శ్రీ బాలు యిస్తున్న ప్రోత్సాహ బలమే ''కాప్టెన్ కృష్ణ'' స్కోప్ వర్ణ చిత్రానికి దారి తీసింది, అన్నారు శ్రీ రెడ్డి, కృతజ్ఞతా పూర్వకంగా.

జనవరి నుంచి సొంత చిత్రం

మాంబళం వైద్యరామయ్యర్ స్ట్రీట్‌లో వుంటున్న దర్శకుడు శ్రీ యం. మల్లికార్జునరావును యిటీవల కలవడం జరిగింది. ''సొంత చిత్రం ఎప్పుడు ప్లాన్ చేశారు'' అనడిగాను. ''జనవరి నుంచి అనుకుంటున్నాను. ప్రస్తుతం జయా ఆర్ట్స్ వర్క్‌తో బిజీగా వున్నాను'' అన్నారు మల్లికార్జునరావు.

''జయా ఆర్ట్స్ చిత్రాన్ని నెలరోజుల్లో పూర్తిచేయాలనుకుంటున్నాను. నవంబర్ 20 నుంచి 30 వరకు ఒక షెడ్యూల్, డిశంబర్ 10 నుంచి 30 వరకు మరొక షెడ్యూల్ వేశాము. నవంబర్‌లో జరిగే 10 రోజుల షూటింగ్ హైదరాబాద్‌లో, డిశంబర్‌లో జరిగే 20 రోజుల షూటింగ్ వైజాగ్‌లోనూ జరపాలని నిర్ణయించుకున్నాము. రియల్లీ అవర్ సబ్జెక్ట్ ఈజ్ ఏ వెరైటీ వన్'' అన్నారు డైరెక్టర్ మల్లికార్జునరావు.

చంద్రమోహన్, నరసింహరాజు, అల్లు రామలింగయ్య, మోహన్‌రావు, కె. వి. చలం, శివరామిరెడ్డి, సుమిత్ర, మాధవి, నిర్మల ముఖ్య పాత్రధారులైన ఈ చిత్రానికి సత్యానంద్, మహర్షి, సత్యం, లక్ష్మణ్‌గోరే, కె. గోపాలరావు సాంకేతికబలం. కె. నారాయణమూర్తి ఈ చిత్రానికి నిర్మాత.

పంతులమ్మగా శారద
డాక్టరుగా రంగనాథ్

కృష్ణ చిత్ర అనెడి నూతన సంస్థ ''ప్రియబాంధవి'' వర్ణ చిత్రానికి నరసింహస్వామి కొండపైన యీ నెల 27న ప్రారంభించింది. చిత్ర పరిశ్రమలో రెండున్నర దశాబ్దాల అనుభవం వున్న శ్రీ పద్మనాభరావు కథ... చిత్రానువాదం సమకూర్చి... దర్శకత్వం వహిస్తున్న ''ప్రియ బాంధవి'' చిత్రంలో పంతులమ్మగా శారద, డాక్టరుగా రంగనాథ్ పాత్ర పోషణ గావిస్తున్నారు.

తొలి షెడ్యూలును గూడూరు పరిసర ప్రాంతాలలో పూర్తిచేసి, మలి షెడ్యూలును డిశంబరులో శ్రీశైలంలో తలపెట్టినట్టు... నిర్మాత శ్రీ కలకుంట్ల శ్రీపతిరావు తెలిపారు.

''ప్రియబాంధవి'' వర్ణ చిత్రానికి శ్రీశ్రీ సంభాషణలను, పెండ్యాల సంగీతాన్ని, వరదారెడ్డి శిల్పాన్ని, గోపాలరెడ్డి ఛాయాగ్రహణాన్ని, వెంకటేశ్వరరావు నిర్మాణతను నిర్వహిస్తున్నారు.

ఈ చిత్రంలో పండరీబాయి, ముక్కామల, ధూళిపాళ, నాగేష్ సహపాత్రధారులు.



'ఏడడుగుల అనుబంధం'లో జయసుధ, నారాయణరావు

నవత చిత్రలో నవనీతంలాంటి పాటలు

నవత చిత్ర అక్టోబర్ ఆరున ఆరంభించిన వర్ణ చిత్రానికి "ఇంటింటి రామాయణం" అని పేరు పెట్టారు. షూటింగును చాలా సింపుల్‌గా... హోమ్లీగా నిర్మాత శ్రీ ఎన్. కృష్ణంరాజు జరిపారు.

తొలి షెడ్యూలు జరిగిన రోజులలో ... యీ విలేఖరి ఒకపూట ఆ షూటింగుకు కేటాయించాడు. తన చిత్రానికిగాను ధ్వనిముద్రణ చెయ్యబడిన మూడు పాటలను, నిర్మాత కృష్ణంరాజు వినిపించారు.

మాణిక్యాల్లాంటి ఆ మూడు పాటలు ... మరల మరల వినాలనిపించాయి. సంగీతద్వయం రాజన్ ... నాగేంద్ర సలిపిన కృషికి, శ్రోతల అభినందన తప్పక లభిస్తుంది. అంత తియ్యని పాటల పల్లవులను పాఠకులకు తెలపకుంటే ఎలా?

ఒకటి: "ఒక్కటై పూలై పూసే...వెన్నెలకాసే ఈ రేయి హాయిగా."

ఈ గీతికను వేటూరి సుందరరామ్మూర్తి వ్రాశారు. బాలసుబ్రమణ్యం పాడారు.

రెండు : "వీణ వేణువైన సరిగమ విన్నావా..."

ఈ పాటను సుందరరామ్మూర్తి వ్రాశారు. బాలు ... జానకి పాడారు.

మూడు : "ఇంటింటి రామాయణం
వింతైన ప్రేమాయణం..."

ఈ పాటను, ఆరుద్ర వ్రాశారు. సుశీల ... బాలసుబ్రమణ్యం పాడారు.

"ఇంటింటి రామాయణం" వర్ణ చిత్రానికి పి. సాంబశివరావు దర్శకుడు. జంధ్యాల రచయిత.

ఈ చిత్రంలో చంద్రమోహన్... జయసుధ ఒక జంటగా, రంగనాథ్ ... ప్రభ మరొక జంటగా నటిస్తున్నారు. "ఇంటింటి రామాయణం" చిత్రంలోని సహాయ పాత్రలను గుమ్మడి, నూతన్ ప్రసాద్, నిర్మల, పి. ఎల్. నారాయణ, రమాప్రభ పోషిస్తున్నారు.

శ్రీ ఎన్. కృష్ణంరాజు నిర్మిస్తున్న యీ నాలగవ చిత్రానికి అన్నపూర్ణా పంపిణీదారులు.

మన సత్యం మరో ప్రయత్నం

స్వర్గీయ గూడవల్లి రామబ్రహ్మంగారి అనుంగు శిష్యుడు "మన సత్యం." ఆ మహానుభావుడి ఆశయాలకు అనుగుణంగా ఒక ప్రయోజనాత్మక చిత్రాన్ని అందించాలన్న తపన మన సత్యంగారికి ఎప్పట్నుంచో వుంది.

అట్టి చిత్రాన్ని నిర్మించే రోజు సమీపించింది,

'రావణుడే రాముడైతే'లో



'అతనికంటె ఘనుడు'లో జయప్రద, కృష్ణ



అన్నారు మన సత్యం. "ఎప్పుడు" అని ప్రశ్నించాను. "డిశంబరులో తను ఉద్దేశించిన విదేశ పర్యటన పూర్తయిన తరువాత," అన్నారు మన సత్యం.

బిజీగా వున్న అన్నపూర్ణా స్టుడియోస్

కొత్త సంవత్సరం ప్రారంభం నుంచి ... అన్నపూర్ణా స్టుడియోస్ చాలా "బిజీ"గా వుండే అవకాశాలు కనిపిస్తున్నాయి.

నాలుగు ఫ్లోర్లు వున్నాయి గనుక ... ఒకేసారి ముగ్గురు నిర్మాతలు ... అన్నపూర్ణాలో చిత్రీకరణ జరపవచ్చు.

శ్రీ నాగేశ్వరరావు కథానాయకుడుగా నటించే చిత్రాలకు మాత్రమేగాక ... యితరుల చిత్రాలకు కూడా అన్నపూర్ణాస్టుడియోస్‌లో 'ప్రొవిషన్'వుంది.

ముద్దుల కొడుకు


"ఈసారి ఎంపిక చేసిన కథ అందరినీ అలరించేదిగా వచ్చింది" అన్నారు, ముద్దుల కొడుకుగా నటించనున్న శ్రీ నాగేశ్వరరావు

జగపతి పిక్చర్స్ ... జనవరి నుంచి ప్రారంభించనున్న ఈ భారీ వర్ణ చిత్రానికి .. శ్రీ వి బి రాజేంద్రప్రసాద్ బహు చక్కటి "ట్రీట్‌మెంట్" ఇచ్చినట్లు, కథానాయకుడు తెలిపారు.

శ్రీ రాజేంద్రప్రసాద్ దర్శకత్వంలో రూపొందే "ముద్దుల కొడుకు" వర్ణ చిత్రంలో... జయసుధ నాయికగా నటిస్తున్నారు. సుభాషిణికి కూడా ఒక ముఖ్య పాత్ర వున్నట్లు తెలుస్తోంది.



'రామబాణం'లో శుభ, ప్రభాకరరెడ్డి



నాగేశ్వరరావు, మురళీమోహన్

జయసుధ నా చెల్లెలు

ఇటీవల ప్రసాద్ స్టూడియోలో "లాయర్ విశ్వనాథ్" చిత్రం డబ్బింగ్ జరుగుతుంటే జయసుధ వచ్చిందక్కడికి. అదే స్టూడియోలో విజయలక్ష్మి మూవీ క్రియేషన్స్ వారి "అనుకోని కథ" చిత్రం షూటింగ్‌లో పాల్గొనాలని మోహన్‌బాబు కూడా వచ్చారు. కారు దిగి నేరుగా డబ్బింగ్ థియేటర్‌వైపు నడుస్తున్న జయసుధను ఉద్దేశించి "ఏమిటే జయసుధ! చూడనట్లు వెళ్ళిపోతున్నావ్" అని పరామర్శించారు మోహన్‌బాబు "ఏం లేదు బాబు. చూడలేదు నిన్ను అంతే" అంది జయసుధ. వాళ్ళిద్దరి సంభాషణాన్ని వింటున్న నేను "ఏమిటండీ! స్వీట్ సుధతో అంత చనువుగా మాట్లాడుతున్నారు" అని మోహన్‌బాబు వైపు చూచాను. "సార్! ఇది మిస్టరీ కాదు. జయసుధ నాకు చెల్లెలులాంటిది. సో... ఒక అన్నయ్యగా ఆమెనలా పిలవడం తప్పంటారా" అని ఎదురుప్రశ్న వేశారు మోహన్‌బాబు. "నో...నో. హాపీ టు నో" అన్నాను.

"రామబాణం" తరువాత....

కౌముదీ పిక్చర్స్ రంగులలో భారీ తారాగణంతో నిర్మిస్తున్న "రామబాణం" అక్టోబరులో జరిగిన షెడ్యూలుతో... 13 రీళ్లు పూర్తయినట్లు, నిర్మాత శ్రీ ఎమ్. ఎస్. రెడ్డి తెలిపారు.

"రామబాణం" చిత్రాన్ని జనవరిలో విడుదల చేసి, ఫిబ్రవరిలో "మాణిక్యవీణ" చిత్రాన్ని ప్రారంభించి, ఏప్రిల్ నుంచి "జడకుచ్చులు" చిత్రాన్ని తలపెట్టనున్నట్లు, శ్రీ ఎమ్. ఎస్. రెడ్డి తెలిపారు.

ముత్తయిదువ

ప్రసన్నలక్ష్మి పిక్చర్స్ ఎప్పుడో ప్రారంభించిన "ముత్తయిదువ" వర్ణ చిత్రానికి శుభయోగం పట్టింది.

అక్టోబరు 16 నుంచి, వేది రోజుల షూటింగుకు ఏర్పాటు జరిగినట్లు, నిర్మాత శ్రీ వెంకటరత్నం తెలిపారు.

శ్రీ త్రిలోకచందర్ దర్శకత్వంలో, మహదేవన్ సంగీతంలో రూపొందుతున్న "ముత్తయిదువ" చిత్రంలో కృష్ణ, జయచిత్ర, జయలక్ష్మి, బాలయ్య, రంగనాథ్, నాగభూషణం, కాంతారావు ప్రధాన పాత్రధారులు.

"కొత్త కాపురం" చిత్ర నిర్మాత వెంకటరత్నంగారి మలి ప్రయత్నమే "ముత్తయిదువ" చిత్రం.

'ఎంకి – నాయుడుబావ'లో జయమాలిని, రాజసులోచన, రాజ్‌బాబు



సినిమా

బాలచందర్‌తో సినిమా తీయాలి

అనే దృఢనిశ్చయంతో వున్న నిర్మాతల్లో శ్రీ ఆంజనేయులు ఒకరు. చిత్ర పరిశ్రమతో చాలా కాలంగా సంబంధం వుంది వీరికి. చాలా కాలంగా సినిమా తీయాలనే వుద్దేశ్యం కూడా వుంది. "బాలచందర్‌గారితో చిత్రం తీయాలనే నా ఆశ. వారి కాల్‌షీట్స్ కోసమే చూస్తున్నాను. నా ఆశ త్వరలోనే కార్యరూపం దాలుస్తుందనే నా నమ్మకం" అన్నారు శ్రీ ఆంజనేయులు.

ఎందుకు ఎక్కువ చిత్రాలు రావడంలేదు ?

తెలుగు అమ్మాయి అయివుండి, ఎక్కువ తెలుగు చిత్రాల్లో నటించకపోవడానికి కారణం ఏమిటి? అని కుమారి జయలక్ష్మిని అడిగాను. ఆ అమ్మాయి చెప్పిన సమాధానం ఇలా వుంది.

"నేను తమిళ చిత్రాలతో బిజీగ వుంటానని, కనుక కాల్‌షీట్స్ ఇబ్బంది అవుతుందేమో అని కొందరు నిర్మాతల అభిప్రాయం. ఏ తక్కువ మొత్తానికో జయలక్ష్మి తప్పకుండా చేస్తుందిలే అని నా దగ్గరకు రావడం, తీరా వారు చెప్పే మొత్తానికి నేను అంగీకరించకపోవడం జరుగుతూ వుంది. భగవంతుడి దయవల్ల తమిళ చిత్రాల్లో నటించే అవకాశాలు వస్తూనే వున్నాయి. మొహమాటానికి పోయి తీసుకునే మొత్తం తగ్గించుకుంటే ఏం బాగుంటుంది చెప్పండి" అంటూంది జయలక్ష్మి.

"మంచి డిక్షన్, చక్కటి యాక్షన్" ఈ రెండూ జయలక్ష్మికి వరాలైనప్పటికీ, మన తెలుగు చిత్ర నిర్మాతలు ఆ అమ్మాయిని తమ చిత్రాల్లో బుక్ చేయడానికి ఎందుకు వెనకడుగు వేస్తున్నారో అర్థం కాదు. పేరుకు ముందు జయ అనే రెండక్షరాలు ఈ అమ్మాయికి కూడా వున్నాయి. కానీ ఎవరి దృష్టీ ఈ జయ మీద పడకపోవడం శోచనీయమే. బట్! షి ఈజ్ ఏ గుడ్ ఆర్టిస్ట్.

''ఏది పాపం ? ఏది పుణ్యం ?'లో మాధవి



"అగ్నిపరీక్ష" నవలకు తెరరూపం

ప్రముఖ నవలా రచయిత్రి మాదిరెడ్డి సులోచనగారి విశిష్ట నవల "అగ్నిపరీక్ష"కు... కొత్త సంవత్సరంలో తెరరూపం వస్తుందని, రూఢిగా తెలిసింది.

పాఠక లోకాన్ని విశేషంగా ఆకర్షించిన "అగ్నిపరీక్ష" నవలకు... నాయకుడు ఎవరయితే బాగుంటారో పాఠకులే నిర్ణయించాలి, అన్నారు, చిత్రంగా రూపొందించనున్న దర్శకుడు.

పాఠకులు తమ అభిప్రాయాన్ని, నెంబర్ వన్ డేనియల్ వీధికి వ్రాయవచ్చు.

నందనరావు పూర్ణమ్మ కథ

నాగేష్ హీరోగా, రోజారమణి హీరోయిన్‌గా నందనరావు దర్శకత్వంలో కొంతవరకు తయారైంది "పూర్ణమ్మ కథ" చిత్రం. ఆ మధ్య నాగేష్ జబ్బునపడేసరికి నందనరావును నానాగాబరా పెట్టేసారు కొంతమంది. మొన్నమధ్య కలిసినపుడు "మన టైమ్ బాగులేదు బ్రదర్. ఏదనుకున్నా ఎదురుదెబ్బ తగుల్తూంది. ఇప్పుడిప్పుడే "పూర్ణమ్మ కథ"ను ఓ దారికి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాను. మిగిలిపోయిన వర్క్‌ను త్వరలో పూర్తిచేయడానికి సన్నాహాలు చేస్తున్నాను. మానవ ప్రయత్నం మనది. ఆ తర్వాత దైవబలం ఎలా వుందో చూడాలిమరి" అన్నారు నందనరావు.

సినీ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్

మన రాజధాని నగరంలో తెలుగు ఫిలిం పరిశ్రమ స్థిరపడే మంచి రోజులు త్వరలోనే వస్తున్నాయి. సుస్థిరత్వానికి కావలసిన ప్రయత్నాలు, ఆలోచనలు ముమ్మరంగా సాగుతున్నాయి. సుప్రభాతం నుంచి పవ్వళింపు సేవ వరకు అంటే నిర్మాణం ప్రారంభమైంది మొదలు ప్రింటు థియేటర్ చేరేవరకూ నిర్మాతకు అండగా నిలబడే నిర్మాణ నిర్వాహకులు (ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్స్) "సినీ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్" అనే సంఘాన్ని స్థాపించి హైదరాబాద్‌లో స్థిరపడాలనే వుద్దేశంతో వున్నట్టు తెలుస్తోంది. ఈ సంఘంలో మద్రాసుకు సంబంధించిన ప్రొడక్షన్ వారికే కాకుండా హైదరాబాద్‌కు చెందిన ప్రొడక్షన్ వ్యక్తులకు కూడా ప్రాముఖ్యత ఇవ్వబడుతుందని నిర్మాణ నిర్వహణలో బోలెడంత అనుభవాన్ని సంపాదించిన శ్రీ కృష్ణారావు చెప్పారు.

భావి జీవిత సుస్థిరత్వం దృష్ట్యా "సినీ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్" లాంటి సంఘాలు మరికొన్ని ఏర్పడి (ఆయా శాఖలకు సంబంధించినవి) రాజధానీ నగరంలో తెలుగు ఫిలిం పరిశ్రమ "మూడు పువ్వులు – ఆరు కాయలు"గా వర్ధిల్లడానికి ముందంజ వేస్తే బాగుంటుందేమో!

తమిళ రంగంలో సారథి

విఠలాచార్యగారి "జగన్మోహిని" చిత్రం అరవదేశంలో అఖండవిజయాన్ని సాధించింది. విడుదలైన నాల్గు కేంద్రాలలో (మద్రాస్ సిటీలో) 50 రోజులు హౌస్‌ఫుల్‌గా నడిచింది. ఆ చిత్రంలో కామెడీ హీరోగా నటించిన సారథికి అరవ ప్రజల అప్లాజ్ లభించింది. "మా చిత్రంలో నటిస్తారా" అంటూ కొందరు తమిళ చిత్ర నిర్మాతలు సారథిని అడగడం మొదలెట్టారట. "అంగీకరించారా" అనడిగాను. "ఒప్పుకుందామా! వద్దా" అనే డైలమాలో పడ్డాను. భాష ప్రాబ్లమ్ ఒకటుందిగా అన్నారు సారథి "అవకాశం వచ్చినపుడు వదలకండి. వెంటనే ఒప్పేసుకోండి. అలవాటుపడితే దానంతటదే వస్తుంది భాష. ప్రొసీడ్" అన్నాను. "ధైర్యే సాహసే లక్ష్మి. ప్రయత్నిస్తాను" అన్నారు సారథి.

త్రివిక్రమరావు చిత్రంలో శోభన్

"మొనగాడు" చిత్ర నిర్మాత శ్రీ టి. త్రివిక్రమరావు తలపెట్టిన మరి చిత్రంలో శోభన్ కథానాయకుడుగా నటిస్తున్నారు.

తోబుట్టువుకోసం, ఆమె జీవన సౌభాగ్యం కోసం ఎట్టి త్యాగానికయినా సిద్ధపడే అన్నయ్య పాత్ర ... శోభన్‌కు రావడం ... శుభావహం.

ఈశ్వరరావు కేరియర్ మిస్సైందట!

"నా కెరియర్ మిస్సయిందండి. 'దేవతలారా! దీవించండి' షూటింగ్ జరుగుతున్న సమయంలో నా కేరియర్ మిస్సయింది" అన్నారు ఈశ్వరరావు. "మీ కెరియర్ మిస్ అవడమేమిటండీ! విశేషంగా చిత్రాల్లో నటిస్తున్నారు" అన్నాను. "కెరియర్ కాదండి బాబు కేరియర్, (అన్నం పెట్టుకునే పాత్ర)" అంటూ జరిగిన కథను చెప్పారు ఈశ్వరరావు.

"దేవతలారా! దీవించండి" చిత్రం షూటింగ్ జరుగుతూండొక రోజు మద్రాస్‌లో. లంచ్ బ్రేక్ వచ్చింది. అందరికీ వాళ్ల వాళ్ల ఇంటినుంచి కేరియర్లు వచ్చాయి. నేను కేరియర్‌కు చెప్పి పంపలేదు. చంద్రమోహన్, రంగారావు, అందరూ కేరియర్‌ను ఓపెన్ చేసి "అబ్బ ఎంత కమ్మగా వుంది కూర. ఎంత రుచిగా వుంది గ్రుడ్డు అంటూ కామెంట్ చేస్తూ హాయిగా తినడం ప్రారంభించారు. వడియాలు వేసుకుంటూ "ఈశ్వరరావ్ ఈ వడియాలు చూచావ్. బలేగా వున్నాయి" అంటూ నా వైపు చూచారు. ఆ రకం వడియాలు మా ఇంట్లో తిన్నట్టు గుర్తు నాకు. వెంటనే ఈ కేరియర్ ఎవరింటినుండి వచ్చింది అని ఆత్రుతగా అడిగాను వార్ని. "పాపం! బోల్తా పడ్డాడు అబ్బాయి. మీ ఇంటినుంచే వచ్చిందయ్యా. నిన్ను తమాషా పట్టించాలనే ఇలా చేశాము" అన్నారు ఏక కంఠంతో అందరూ. "హవ్వా. ఎంత మోసం. నాకు తెలియకుండా నాకు కేరియర్ రావడమేమిటి! అందులోని పదార్థాలను మీరు తినడమేమిటి" అంటూ నివ్వెరపోయాను నేను. అందరూ నవ్వడం చూచి నేను కూడ ఆ నవ్వుకు శృతి కలిపాను. ఇదీ కథ.

హిందీలో అమ్మాయిల శపథం

సురేష్ అధినేత శ్రీ రామానాయుడు తెలుగులో విజయాన్ని సాధించిన "అమ్మాయిల శపథం" చిత్రాన్ని, హిందీలో నిర్మిస్తున్నట్టు చెప్పారు, శ్రీ బాపయ్య దర్శకత్వంలో.

శ్రీకాంత్ అండ్ శ్రీకాంత్‌లో శోభన్

"పెద్దకొడుకు" చిత్రం తరువాత, శోభన్ నాయకత్వంలో శ్రీకాంత్ అండ్ శ్రీకాంత్ ఓ చక్కని కుటుంబ కథను నిర్మించడానికి నిర్ణయించినట్టు తెలిసింది.

ఒకప్పుడు ఆయనతో "జీవనమృత్యు" హిందీ చిత్రాన్ని, తెలుగులో తీయదలిచారు. జనవరిలో



'ఇంటింటి రామాయణం'లో ప్రభ, రంగనాథ్

ప్రారంభం కానున్న శ్రీకాంత్ అండ్ శ్రీకాంత్ చిత్రంలో జయప్రద నాయికగా నటిస్తారని తెలిసింది.

సంక్రాంతికి దీకొనే భారీ వర్ణచిత్రాలు

లక్ష్మి ఫిలింస్ కంబైన్స్ నిర్మించిన "రావణుడే రాముడయితే" స్కోప్ వర్ణ చిత్రం, శ్రీ ఎన్టీ రామారావు నిర్మిస్తున్న "లారీ రాముడు" వర్ణ చిత్రం, కౌముదీ పిక్చర్స్ నిర్మిస్తున్న "రామబాణం" వర్ణచిత్రం, సత్యచిత్ర నిర్మిస్తున్న "లారీ డ్రైవర్" స్కోప్ వర్ణ చిత్రం, శ్రీ వెంకటలక్ష్మి ప్రొడక్షన్స్ నిర్మించిన "ఎంకి—నాయుడుబావ" స్కోప్ వర్ణ చిత్రం.

ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్న దర్శకులు, నటీనటులు, సంస్థలు (పైన పేర్కొన్నవి) గావడంవల్ల... సంక్రాంతి చిత్రాలన్నిటికీ శుభం చేకూరాలని... యీ కలం ఆశిస్తోంది.

ఇది విన్నారా?

★ హిందీ నటి రేఖ పుట్టి పెరిగింది తమిళనాడులో. కానీ నేడు జీవిస్తున్నది ఉత్తర భారతంలో. "అరవ చిత్రాలు నాటకాల్లా వుంటాయి. నేను నాటకాల్లో నటించడానికి నిర్ణయించినరోజున, నేను తమిళ చిత్రాల్లో నటిస్తున్నాను అని అర్థం" అంటూందట రేఖ. పాపం! స్థానబలం ఆమెనలా చెప్పమని ప్రేరేపించిందేమో. ఇప్పుడొస్తున్న అరవ చిత్రాలు చూస్తే ఈ మాట అనగలేదికాదు రేఖ.

★ "షోలే" హీరో అంజాద్‌ఖాన్‌కు బెంగుళూరులో ఒక హోటలుందట. అంజాద్‌ఖాన్ నివాసం బొంబాయిలో. కానీ అతని హోటల్ విలాసం బెంగుళూరులో.

★ ఈమధ్య కొంతకాలంగా వెన్నిరాడై నిర్మల మద్రాస్‌లో లేదట. సింగపూర్ వెళ్లిందట. వెన్నిరాడై నిర్మలను పెట్టి చిత్రం తీస్తున్న ఒక నిర్మాత ఆ స్థానంలో "సుజాత"ను పెట్టారట ఇప్పుడు. నిర్మల కనపడకపోవడమే అందుకు కారణమేమో! తెలుగులో "కరుణామయుడు" చిత్రంలో కూడా ఒక చక్కటి పాత్రను పోషిస్తుంది వెన్నిరాడై నిర్మల. మరి ఈ చిత్రంలో నిర్మాత విజయచందర్‌గారికి ఎలాంటి యిబ్బందులు కల్గించినట్టు ఆధారాలు లేవు.

★ "శ్రీదేవి" అమూల్ పాలేకర్‌తో "పదహారేళ్ల వయసు" హిందీ వెర్షన్‌లో నటించింది. అమూల్‌పాలేకర్‌ను గూర్చి చెబుతూ "అరవంలో కమల్‌హాసన్‌కన్నా, తెలుగులో చంద్రమోహన్‌కన్నా, హిందీలో అమూల్‌పాలేకర్ చాలా బాగా యాక్ట్ చేసారు" అన్నదట శ్రీదేవి. అలా అనడం అవసరం. ఏ ఫీల్డ్‌కు వెళితే ఆ ఫీల్డ్‌లోని వ్యక్తిని గూర్చి మాట్లాడితీరాలి. లేకుంటే చిత్రాలెలా వస్తాయి! మరి అమూల్‌పాలేకర్ మాత్రం వూరుకున్నారా! ఒక ప్రెస్ మీట్ అరేంజ్‌చేసి "శ్రీదేవిలాంటి చక్కటి నటిని నేను చూడలేదు" అని కాంప్లిమెంట్ చేసాడట.

— జనప్రియ

జి. ఏ. జి. పేజీ

"మూడుపువ్వులు - ఆరుకాయలు"లో ఎవరు 'త్రిశూలం'?

మాస్టర్జీ : నీటిలో చేపల నడకను, ఆకాశంలో పక్షుల జాడను పట్టగల సమర్థుడీ మాస్టర్జీ! కమాన్. టెల్‌మీ – ఆ కోట్లు విలువచేసే రహస్యమేమిటో చెప్పు, త్రిశూలం!

గోపి : త్రిశూలమా!

మాస్టర్జీ : ఏస్... నీ రహస్యమేమిటో చెప్పి, మా సహకారం పొంది, ప్రతిఫలంగా మాకు కొంత భాగం ఇవ్వు. లెటస్ బి ఫ్రెండ్స్... నేను ఒన్, ట్యూ, త్రీ అనేసరికి మర్యాదగా చెప్పు... లేదా, అమర్యాదగా చెప్పించాల్సివస్తుంది...ఒన్...టూ...

[త్రీ – అనేలోగా గోపి మెరుపులా మాస్టర్జీ ముందు ఎగిరి, అతని అనుచరులను, జ్వాలను చితకబాది, చివరికి మాస్టర్జీ కంఠం చుట్టూ చేతులు పెనవేస్తాడు.]

గోపి : ఇప్పుడు తెలిసిందా – మీరనుకునే మనిషిని కాను. వాడెవడో మిమ్మల్ని మోసం చెయ్యటానికి నన్నూ మోసంచేసి, వాడి త్రిశూలం గుర్తు నాకు తగిలించాడు. దాంతో మీరు నన్ను తగులుకున్నారు. వాణ్ని పట్టాలంటే నేనవసరం మీకు. లెటస్ బి ఫ్రెండ్స్.కలిసివుంటే కలదుసుఖం.

మాస్టర్జీ : నీ పేరు ?

గోపి : కిశోర్. పనిలో దిగితే షంషేర్. మనకు కావల్సింది ప్రతి బిజినెస్సులో షేర్. ఆ త్రిశూలం గాణ్ణి నేను పట్టిస్తాను. మీక్కావలసిన రహస్యాన్ని రాబట్టుకొని, అందులో నాకు షేర్ యివ్వండి.

మాస్టర్జీ : ఎక్కడుంటావ్ ?

గోపి : ఎప్పటికెయ్యది ప్రస్తుతమో అప్పటికా అవతారం ఎత్తుతుంటాను. ఇతర్లను నొప్పించక నేనొవ్వక తప్పించుకు తిరుగుతుంటాను. పిలిస్తే పలుకుతాను. తలిస్తే తటస్థపడతాను. అందాక వస్తాను.

అని వెళ్లిపోతున్న కృష్ణ (గోపి) వంక జగ్గయ్య (మాస్టర్జీ), జ్వాల (హలం) గుడ్లప్పగించి చూస్తూండిపోయారు – డైరెక్టర్ విజయనిర్మల 'కట్' అని చెప్పేవరకు. ఈ చిత్రంలో ఆమె ద్విపాత్రధారిణి. శ్రీమతి మిద్దె జగన్నాథరావు సమర్పించే ఈ స్కోప్ కలర్ చిత్రానికి చంద్రకుమార్, విజయకుమార్, జీవన్‌కుమార్, వెంకటరమణకుమార్ నిర్మాతలు. మోదుకూరి జాన్సన్ రచయిత. సత్యం సంగీత దర్శకుడు. ఎస్. ఎస్. లాల్ ఛాయాగ్రాహకుడు. ఎస్. వి. ఎస్. ఫిలిమ్స్ నిర్మాణం.

విజయనిర్మల దర్శకత్వంలో సి. గౌరీశ్వరి నిర్మించిన గౌరీశ్వరీ ఆర్ట్స్ వారి "ప్రేమ చేసిన పెళ్ళి" వర్ణ చిత్రం అతిత్వరలో విడుదల. చంద్రమోహన్, రంగనాథ్, జరీనావహాబ్, జయలక్ష్మి, నాగభూషణం, గుమ్మడి, కాంతారావు, పి. జె. శర్మ, గెస్టులుగా సత్యనారాయణ, అల్లురామలింగయ్య, మోహన్‌బాబు, రాజ్‌బాబు, నాగేష్, పాల్గొన్నారు.

శ్రీ భాస్కర చిత్ర వారి చిత్రంలో శేఖర్, గీత

"చూడండి! నా గుమాస్తా అంతన్ను మీకు చాలకపోయినా – మీ బడివంతులు అంతన్ను నాకు చాలనుకునే వచ్చాను. ఎందుకో తెలుసా? మీ నాన్నగారి బాంక్ అకౌంటుని, మీరుండే బంగళాను చూసి కాదు. మిమ్మల్ని – మీరు ఆరాధించే కళను చూసి... కళాభిరుచి మీ ఒక్కరి సొత్తే కాదు. నాకూ వుంది. కోరి తెచ్చుకున్న పువ్వును ఎలా గౌరవించాలో నాకు తెలుసు," అన్నారు శేఖర్ పాత్రలో ఎన్. టి. ఆర్.

ఆ సన్నివేశం గురించి వివరిస్తూ డైరెక్టర్ బి. యస్. సుబ్బారావు "గీత నృత్యప్రదర్శనాన్ని తిలకించి తన్మయుడైన శేఖర్ – ఆమెను తన అర్థాంగిగా పొందగలిగితే, తన జీవితమే స్వర్గమని తలచాడు. కాని, గీతకు మాత్రం పెళ్లి ఇష్టంలేదు. నర్తకిగా పేరు ప్రతిష్ఠలతోపాటు డబ్బు సంపాదించాలని ఆమె ఆశయం. ఓ కామాలు గుమాస్తాను చేసుకుంటే, వంటింట్లోనే మగ్గాలని ఆమె భయం," అన్నారు నాతో.

గీతగా వాణిశ్రీ నటించే ఈ వర్ణ చిత్రంలో జగ్గయ్య, గుమ్మడి, పద్మనాభం, మిక్కిలినేని, రమణమూర్తి, నూతన్ ప్రసాద్, పుష్పలత, ఛాయాదేవి, బేబీ రోహిణి, మాస్టర్ మురళీకృష్ణ యితర పాత్రధారులు.

ఇటీవల ఎ.వి.ఎం.స్టూడియోలో వివిధ సెట్స్ మీద ఎడతెరిపిలేకుండా జరిగిన షూటింగ్‌లతో ఈ చిత్ర నిర్మాణం పూర్తికావచ్చినట్లు తెలియజేశారు నిర్మాత ఎ. పుండరీకాక్షయ్య.

గొల్లపూడి సంభాషణలకర్త. సి. నారాయణ రెడ్డి గీతాలకు మాస్టర్ వేణు బాణీలు కూర్చారు. రెహమాన్ ఛాయాగ్రాహకుడు. నిర్వహణ : ఎ. బి. ఎల్. ప్రసాద్. శిల్పం : గోఖలే.

మా భూమి

నైజాం నవాబుకు వ్యతిరేకంగా తెలంగాణా రైతులు జరిపిన ప్రతిఘటనోద్యమాన్ని ఇతివృత్తంగా తీసుకొని కీ॥ శే॥ కిషన్‌చందర్ రాసిన నవల "జబ్ ఖేత్ జాగే" ఆధారంగా "మాభూమి" అనే చిత్రాన్ని జి. రవీంద్రనాథ్, బి. నరసింగరావు నిర్మిస్తున్నారు. వింజమూరి సీత సంగీతం, కమల్‌నాయక్ ఛాయ గల ఈ చిత్రానికి పలు డాక్యుమెంటరీలు తయారుచేసి ప్రశంస లందుకున్న గౌతమ్‌ఘోష్ దర్శకుడు. బెంగాలు క్షామంపై ఈయన దర్శకత్వంలో తయారై, తూర్పు జర్మనీ చలన చిత్రోత్సవంలో డిప్లొమా ఆఫ్ మెరిట్ పొందిన "హంగ్రీ ఆటమ్" (ఆకలి శిశిరం) అనే అరగంట డాక్యుమెంటరీ యిటీవల మద్రాసు సినిమా పాత్రికేయులకు చూపించబడింది. హృదయాలను ద్రవింపజేసే హ్రస్వ చిత్రమిది.




'కమలమ్మ కమతం'లో జయంతి



'కోరికలే గుర్రాలైతే'లో మురళీమోహన్, ప్రభ

నాన్నారి కారు నేనే రిపేర్ చేసేశా!



టింకూ లాంటి బాబు మీకూ వుంటే రీగల్ కావలసిందేమరి! ఇండియాలో అత్యధిక శక్తి గల డిటర్జెంట్ బట్టల సబ్బు.

టింకూ లాంటి పిల్లలు ఉంటే బట్టలు ఉతికే పని అధికం. అందుకు 'రీగల్' మాత్రమే సరయిన డిటర్జెంట్ సబ్బు. 'రీగల్'కుగల అధిక తెల్లదనాన్నిచ్చే శక్తి ఎంతటి మురికినైనా తొలగించి, మీ బట్టలను తళతళలాడే తెలుపుతోను, వెలుగుతోను మెరిసేలా చేస్తుంది. లోనికి చొచ్చుకొనిపోయి మురికిని తరిమివేయగల–శక్తివంతమైన–నురుగునిచ్చేది 'రీగల్.' ఇతర డిటర్జెంట్ సబ్బులన్నిటికన్న ఎక్కువ ఉతుకులు ఇచ్చే 'రీగల్.' మీకు ఎంతో పొదుపుచేస్తుంది. 'రీగల్'ను మీ కుటుంబపు డిటర్జెంట్ సబ్బుగా చేసుకోండి.





'నిజం'లో మోహిని

కృష్ణంరాజు – విభిన్న పాత్రలు

హీరో కృష్ణంరాజు ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ ఎంతో ఉషారుగా ఉంటారు. ఆ రోజు ఉదయం మరింత ఉత్సాహంతో కనిపించారు. అభిమానుల దగ్గర్నించి వచ్చిన ఉత్తరాల కట్టల్లోంచి కొన్ని తీసి నాకు చూపిస్తూ, "వీళ్ళ ఆశీస్సులే నాలోని నటుడ్ని ముందంజ వేయిస్తున్నాయి. 'ఇద్దరూ ఇద్దరే' తర్వాత 'కటకటాల రుద్రయ్య'లో నేను చక్కని వెరైటీ పాత్రలో కనిపించానని వీళ్ళందరి అభిప్రాయం.. రచయిత–దర్శకుడు వేరయినప్పుడు – ఇద్దరికీ కొన్ని విషయాలలో ఏకాభిప్రాయం కలగకపోవచ్చు. అలా కాక కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు, దర్శకత్వ బాధ్యతలన్నీ ఒకరే నిర్వహిస్తున్నప్పుడు సంపూర్ణంగా తాధాత్మ్యం చెంది నటించడానికి మరింత వీలవుతుంది. దాసరి నారాయణరావుగారు పూర్తి కాన్ఫిడెన్స్‌తో 'కటకటాల రుద్రయ్య' క్లయిమాక్స్‌లో, ఫార్ములా చిత్రాలకు మల్లే ఫైట్స్ జొప్పించకుండా – దాదాపు వెయ్యి అడుగుల మేర నాచేత 15 పేజీల డైలాగ్‌లతో ఏకపాత్రాభినయం చేయించి, ఎక్కడా విసుగు కలిగించకుండా ఎంతో రక్తి కట్టించారు. చిత్రం విశిష్టంగా ఉందని, ప్రత్యేకించి నా పాత్ర పోషణ అమోఘంగా ఉందని ఎన్నో చోట్లనించి నాకు వచ్చిన ఉత్తరాలు చూస్తుంటే, నాకు ఎంత ఆనందంగా ఉందో వర్ణించలేను. అదృష్టవశాత్తు 'మన వూరి పాండవులు, రాముడు – రంగడు, రామబాణం, కమలమ్మ కమతం' చిత్రాలలోనూ నాకు విశిష్టమైన పాత్రలే లభించాయి. ఇంతకన్నా నేను కోరుకునేదేముంది ?" అన్నారు.

"నిజం"

ఈ చిత్రం గురించి డైరెక్టర్ దేవదాస్ వివరిస్తూ, "సమాజంలో ఏ చట్టానికీ, శాసనానికీ, నీతి సూత్రాలకూ కట్టుబడకుండా – నాగరికత ముసుగులో ఘరానాగా చెలామణీ అయ్యే మనిషిలోని సార్వభౌమత్వ దాహాన్ని జాగ్రత్తగా కనిపెట్టమని హెచ్చరిస్తుంది ఈ ప్రయోజనాత్మక చిత్రం" అన్నారు.

బి. రాజమ్మ సమర్పణలో సురేంద్రరెడ్డి విద్యాసాగర్ నిర్మించిన కళాభారతీ ఇంటర్నేషనల్ వారి "నిజం" చిత్రంలో గుమ్మడి, నారాయణరావు, నూతనప్రసాద్, శరత్‌బాబు, శ్రీనాథ్, అంకినీడు, విఠల్‌ప్రసాద్, బాబూ రాజేంద్రప్రసాద్, ఓక్కం, జె. ఎస్. శాస్త్రి, పొట్టిప్రసాద్, ధమ్, కె. వి. శాస్త్రి, హేమాచౌదరి, రాజేశ్వరి, సీమా, లక్ష్మీదేవదాస్, గిరిజారాణి, కృష్ణప్రియ, లావణ్య వగైరా తారాగణం. జంధ్యాల మాటల రచయిత. రాఘవులు సంగీత దర్శకత్వంలో నెల్లుట్ల, జాలాది గీతాలు రాశారు.

జి. వి. జి. పేజీ

డాక్టర్ భానుమతి పథకాలు

"ఏమిటి, స్వామీ – నా దగ్గర ఏదైనా న్యూస్ దొరుకుతుందని మీరెలా పసిగట్టారు – చాలా రోజుల తర్వాత ఊడిపడ్డారు ?" అంటూ భానుమతి రామకృష్ణ కుర్చీ చూపుతూ, "జీవీజీ గారు ఏం పుచ్చుకుంటారు – కాఫీయా, టీయా, గ్లాక్సోనా ?" అన్నారు. గ్లాక్సో ఎక్కడ్నించి తెప్పించగలరో పరీక్షించడానికి అదే అడగాలనిపించింది. కాని, ఆమె ఎలాగైనా తెప్పించితీరుతారేమోనని మరో క్షణంలోనే గాభరాపడి, "కాఫీ" అన్నాను.

లోపల్నించి ఏదో వేదపఠనం వినిపించి, అటు తల తిప్పాను.

"ఈ వేళ మావారికి 60వ ఏడు. ఆయుష్హోమం చేయిస్తున్నా. నెక్స్ట్ ఇయర్ షష్టిపూర్తి. ఫిబ్రవరిలో మా అత్తగారి కథలను తెరకెక్కించబోతున్నా. ఇది కొత్త ప్రయోగమే. కాని, మా అత్తగారు నాకన్నా పాపులర్ గనుక ధైర్యంతో మూడు అత్తగారి కథలను ఒక పిక్చర్‌గా తీయబోతున్నా. అన్నట్టు – ఈమధ్య హైదరాబాద్ టి. వి. కేంద్రం కోసం రెండు అత్తగారి కథలు 'కామాక్షమ్మ కథ, నరసమ్మాయణం' రెండు స్లైడ్‌లుగా మా స్టూడియోలోనే షూట్ చేసి పంపించా. ఐదు రోజులు పట్టింది. కల్పనారాయ్ అత్తగారుగా చాలా బాగా చేసింది. రోజారమణి, పద్మనాభం, ఛాయాదేవి – అందరూ అద్భుతంగా నటించారు. మా స్టూడియోలో సి. ఫ్లోర్‌ను మా పిక్చర్ల కోసం కేటాయించాము. 'రచయిత్రి' నవలను కూడా వచ్చే ఏడే తీస్తాను. 'భక్త ధ్రువ' కూడా తీయాలని ఉంది. పోతే – మా రికార్డింగ్ థియేటర్ ఎప్పటిలాగే బిజీగా ఉంది. సులక్షణా థియేటర్ ఇంకా బిజీగా ఉంది. త్వరలోనే సినిమా స్కోప్ చేయబోతున్నాం. మా భరణి అమెరికాలో ప్రాక్టీస్ చేస్తున్నాడు. నేను ఏనాడూ డబ్బు కోసం సినిమాలలో ఆక్ట్ చేయవలసిన అవసరం కలగలేదు. అయినా, నాకు తగ్గ చక్కని పాత్ర గల కథ ఎవరైనా తీసుకువస్తే, నేనెప్పుడూ నటించడానికి సిద్ధమే" అన్నారామె.

ఇంతలో రామకృష్ణగారు వచ్చారు. వారికి కంగ్రాట్యులేషన్స్ చెప్పాను.

"వచ్చే ఏడు, షష్టిపూర్తి స్వామీ ! మరచిపోకండి" అన్నారు డాక్టర్ భానుమతి నవ్వుతూ.

నేనూ నవ్వుతూ, అక్కడ్నించి సెలవు తీసుకొని బయలుదేరాను.

'ముగ్గురు మూర్ఖురాళ్ళు'లో సూర్యకాంతం





'రిషిరాజి'లో జయమాలిని, చంద్రమోహన్

లాల్ దర్శకత్వంలో మరో చిత్రం

''ఆర్. డబ్ల్యు. మూవీస్ బానర్‌లో రామచంద్ర, విలియమ్స్ నిర్మించే కలర్ చిత్రానికి పేపర్ వర్క్ జరుగుతోంది. గొల్లపూడి మాటలు రాస్తున్నారు. వేటూరి, దాశరథి గీతాలకు చక్రవర్తి స్వరకల్పన చేశారు. విలియమ్స్ ఛాయాగ్రాహకుడు. బి. చలం ఆర్ట్ డైరెక్టరు,' అని తెలియజేశారు డైరెక్టర్ ఎస్. డి. లాల్. ఈ చిత్రానికి నవంబర్ 27న కొన్ని పాటలు రికార్డ్ చేయబడ్డాయి

తెలుగునాట
తొలి సహకార చలనచిత్ర సంస్థ

కేరళలో 'చిత్రలేఖ' బొంబాయిలో 'యుక్త' అనే కో ఆపరేటివ్ ఫిలిమ్ యూనిట్స్ విజయవంతంగా నిర్వహింపబడుతున్నాయి. ఆ కోవలో తిరుపతి వాస్తవ్యులు ఎస్. మొగిలీశ్వర్ మేనేజింగ్ డైరెక్టర్‌గా, పి. చంద్రశేఖరరెడ్డి ఛైర్మన్‌గా, ఆర్. లక్ష్మణరెడ్డి ఉపాధ్యక్షులుగా 'శ్రీ చైతన్య చిత్ర కో ఆపరేటివ్ సొసైటీ' నెలకొల్పబడింది. సీడెడ్ ప్రాంతంలో సినిమా పరిశ్రమాభివృద్ధి, తిరుపతి పరిసరాలలో ఒక ఫిలిమ్ స్టూడియో నిర్మాణం, ఒక ఔట్‌డోర్ యూనిట్‌ను సమకూర్చుకోవడం ఈ సంస్థ ఆశయాలు. వీరి తొలి చిత్రానికి కె. ఎస్. రామిరెడ్డి దర్శకత్వం వహిస్తారు.

సంక్షిప్త చిత్ర వార్తలు

★ సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో బి. రాధామనోహరి నిర్మించే ఎస్. బి. ఎస్. ఫిలిమ్స్ వర్ణ చిత్రం పేరు ''సొమ్మొకడిది – సోకొకడిది''గా నిర్ణయించారు. కమలహాసన్ ద్విపాత్రాభినయం నిర్వహించడమేకాక తెలుగు సంభాషణలు ఆయనే పలకడం ఓ విశేషం. ఆయనతోపాటు జయసుధ, రోజారమణి, జయ, పండరీబాయి, రచయిత సి. ఎస్. రావు, ప్రభాకరరెడ్డి, కాంతారావు, రావికొండలరావు, సారథి పాల్గొన్నారు. జంధ్యాల సంభాషణలకర్త. రాజన్ – నాగేంద్ర సంగీత దర్శకత్వంలో వేటూరి సుందరరామమూర్తి గీతాలు రాశారు. బాలుమహేంద్ర ఛాయాగ్రాహకుడు. కథ: తోట. సహకార దర్శకత్వం: కె. వి. కృష్ణయ్య. నిర్వహణ: టి. ఎం. సంతానం.

★ ''దేవతలారా దీవించండి, సింహగర్జన'' చిత్రాలను అందించిన గిరిబాబు నూతన వత్సరారంభంలో ''ముద్దుముచ్చట'' అనే సాంఘిక వర్ణ చిత్రాన్ని ప్రారంభిస్తారు. ఆయనతోపాటు మురళీమోహన్, ప్రభ, కాంతారావు ప్రభృతులు ముఖ్య భూమికలు నిర్వహిస్తారు. వాసు దర్శకుడు.


★ కొమ్మినేని శేషగిరిరావు దర్శకత్వంలో పింజల ఆనందరావు నిర్మించే ఆనందలక్ష్మి ఆర్ట్ మూవీస్ ''లక్ష్మి పూజ'' వర్ణ చిత్రంలో నరసింహరాజు, జయమాలిని, చంద్రకళ, ధనశ్రీ, జయవాణి, నాగరాజు, ముక్కామల, బాలకృష్ణ, కె. కె. శర్మ, బేబీ రోహిణి, కల్పనారాయ్ వగైరా తారాగణం. శ్రీభారవి సంభాషణలకర్త. సత్యం సంగీత దర్శకుడు. హెచ్. ఎస్. వేణు ఛాయాగ్రాహకుడు. శిల్పం: కుదరవల్లి నాగేశ్వరరావు. కూర్పు: మోహన్. కథ, స్క్రీన్‌ప్లే: కొమ్మినేని శేషగిరిరావు.

★ అక్టోబర్ 16న వాహినీ స్టూడియోలో సురేంద్ర ఆర్ట్ పిక్చర్స్ ''ఎవడబ్బ సొమ్ము'' స్కోప్ కలర్ చిత్రం షూటింగ్ ప్రారంభమైంది. శ్రీ ఫిలిమ్స్ అధినేత పర్వతనేని చంద్రశేఖరరావు కెమెరా స్విచ్ ఆన్ చేశారు. త్రిమూర్తి ప్రొడక్షన్స్ అధినేత బాబాజీ క్లాప్ కొట్టారు. నటవర్గం: కృష్ణ, శ్రీప్రియ, సత్యనారాయణ, ఈశ్వరరావు, ప్రసాద్‌బాబు, రమణమూర్తి, లక్ష్మీకాంత్, అర్జా జనార్దనరావు, గొట్టిపాటి, కొంగర జగ్గారావు, రావికొండలరావు, జానకి, కవిత, జయమాలిని త్రిపురనేని మహారథి రచయిత. రాఘవులు సంగీత దర్శకుడు. ఎస్. ఎస్. లాల్ ఛాయాగ్రాహకుడు. కొండపనేని రామలింగేశ్వరరావు శిల్ప దర్శకుడు.

★ పదేళ్ళుగా పలు చిత్రాలకు ఎడిటర్‌గా పని చేసిన వి. జగదీశ్ దర్శకత్వంలో పి. వి. ప్రసాద్ ''నెలవంక'' అనే ఫ్యూజీ కలర్ చిత్రాన్ని విజయ కళామందిర్ పతాకంలో నిర్మిస్తారు. కథ: పాలవెల్లి. సంభాషణలు: మడిపట్ల సూరి. గీతాలు: జాలాది. సంగీతం: బి. శంకర్. ఛాయ: వి. ఎస్. ఆర్. కృష్ణారావు. శిల్పం: కొండపనేని రామలింగేశ్వరరావు. సమర్పణ: త్రినాథరావు.

★ కె. బాలచందర్ కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వంలో టి. విశ్వేశ్వరరావు నిర్మించే భారత్ ఫిలిమ్స్ ''ఇది కథ కాదు'' చిత్రం షూటింగ్ అక్టోబర్ 21న ప్రారంభమైంది. తెర ముందు: కమలహాసన్, శరత్‌బాబు, చిరంజీవి, జయసుధ, సరిత, లీలావతి. తెర వెనుక: గణేశ్‌పాత్రో, ఎం. ఎస్. విశ్వనాథన్, ఆత్రేయ, బి. ఎస్. లోకనాథ్.

'రాముడు–రంగడు'లో శ్రీధర్, కృష్ణంరాజు



(గత సంచిక తరువాయి)


నీవు యింకా ఇక్కడ ఉన్నావా?.. ఆపకు అన్నయ్యా. ఇది ఆ రాక్షసుని చెల్లెలు
రక్షింపుడు... శరణు..
భీమసేనా! శాంతింపుము. వధకర్హుడైన వానిని చంపితివి. అది ధర్మము. ఇది అబల. రక్షింపుమనుచున్నది. ఈమెను విడిచి వెళ్ళుము.
హిడింబ ఏకాంతమున కుంతీదేవితో..
అవ్వా! నేను మీకుమారుని ప్రేమించి నా చుట్టములను చెలులను విడచితిని. నా యిష్టము మీరు తీర్పని యెడల ఇప్పుడే ప్రాణముల విడిచెదను
నేను జరిగినవి, జరుగుచున్నవి జరుగనున్నవి యెఱుగుదును. జరుగనున్నది చెప్పెదను వినుడు, ముందు ఒక సరోవరమును, ఒక వనస్పతియును గలవు, వాటిని ఉపయోగించిన వారికి, ఆకలిదప్పులుండవు, మఱియు శీతవాతాతపవర్షంబులనుండి రక్షణ కల్గును. అక్కట శాలిహోత్రుని ఆశ్రమమునకు, వ్యాసమహర్షి వచ్చెదరు.
కుంతీ ధర్మజులు ఆమె వినయవిధేయతలకు సంతసించిరి. తల్లి ఆజ్ఞపై భీముడామెతో ఒక పుత్రుడు పుట్టువరకు ఉండుటకు ఒప్పుకొనెను. తరువాత ప్రయాణమైరి
1-124
హిడింబ చెప్పినట్లుగనే, వ్యాస మహర్షి, శాలిహోత్రుని ఆశ్రమమునకు వచ్చి, పాండవుల పూజలందె..
ధర్మరాజా! కష్టములు కలకాలము ఉండవు మీకు శుభంబగును. ఈ హిడింబ అసలు పేరు కమలపాలిక. ఈమెకు భీముని వలన ఘటోత్కచుడను రాక్షసమాయా విశారదుడు పుట్టును.....ఇంక నేను వెళ్ళివస్తాను...
హిడింబకు భీమునివలన మహాబలుడైన ఘటోత్కచుడు సద్యోగర్భమున పుట్టె.....
తండ్రీ! నేను నా తల్లితోడ ఉత్తరాభిముఖుడనై పోయి నా రాక్షస గణముల కను
మీకు పని కల్గినప్పుడు నన్ను తలచిన వెంటనే వచ్చెద
మంచిది! కుమారా!
తరువాత పాండవులు బ్రాహ్మణ వేషము ధరించి "ఏకచక్రపురము"నకు బయలుదేరిరి.........
1-125
ఏకచక్రపురమున.... తామున్న ఇంటివారి రోదన ధ్వని విని వచ్చి కుంతీదేవి బ్రాహ్మణునితో..
విప్రోత్తమా! మీకు వచ్చిన కష్టమేమి? వివరముగ చెప్పుడు. మీ కష్టము తీర్చెదను .....
అమ్మా! ఏమని చెప్పుదును ఎవ్వరు తీర్పలేనిది బాధ....
ఇక్కడ కొలది దూరమున బకుడను రాక్షసుడుగలడు, వానికాహారముగ ప్రతిదినము, ఒకమానవుడు, రెండు యను బోతులతో బండెడన్నము, ఏర్పాటు యున్నది...
అయ్యా! చింతింపకుడు. మీ కష్టము తీరగలదు.........
కుంతి భీముని పిలిచి......
కుమారా! ఈ విప్రోత్తమునకు వచ్చిన ఆపద తొలగింపుము.
సరే! నాయనా!
1-126
బ్రాహ్మణుడు, అతని బంధుజనులు అమితానందముతో పిండివంటలు చేసి, అన్నము పప్పు పుష్కలముగ వండి, కుండల కొలది నెయ్యి పెరుగు తెచ్చిరి.......
భీముడు సంతృప్తిగ భోజనము చేసి, బండి నిండుగ, అన్నము వేసికొని దక్షిణాభిముఖుడై బకాసురుడున్న చోటుకు బయలుదేరెను.
[ఇంకా వుంది]
1-127

మత సామరస్యం

బెంగళూరులోని ఆస్టిన్ టవునులోని ఒక పెద్ద భవనంలో హిందువులు, ముస్లిములు, క్రిస్టియనులు అద్దెకుంటున్నారట. వీరంతా కలిసి ఏకగ్రీవంగా ఎంచక్కా వినాయకచవితి పండుగ చేసుకున్నారట. దగ్గర్లోవున్న ఈశ్వరుని ఆలయానికి వీరంతా వెళ్ళిపూజలు, స్తోత్రాలూ చేశారట. బిజనూరుజిల్లాకు చెందిన వో వూరిలోని హిందూ దేవాలయంలో ముస్లిము పూజారి వున్నాడట. ఆలయం శుభ్రంచేయడం మొదలు అన్ని పనులూ తానే చేస్తాడటాయన. ఈశ్వర్ అల్లా తేరే నామ్ అవటాని గాంధీగారననేఅన్నారు కదా ! కాదా !

చేను మేసిన కంచె

బొంబాయి సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్స్ (సి.బి.ఐ.) శాఖకు చెందిన ఇద్దరు సబిన్స్పెక్టరులు బొంబాయి విమానాశ్రయంలో తిరుగుతుండగా మరో అధికారి అనుమానించి సోదా చేస్తే విదేశాలకు చెందిన నాలుగొందల రిస్టువాచీలు, ఇరవైవేల రూపాయలూ దొరికాయట వారివద్ద.

కూతుర్ని చెరచిన తండ్రి

అహమ్మదాబాదుకు చెందిన వో రైల్వే ఉద్యోగి కూతురు గర్భస్రావం కొరకు వో ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళిందట. ఆమెను ఆమె తల్లి, వో పనిమనిషి ఆసుపత్రిలో చేర్చారట. ఆ పిల్లను చెఱచి గర్భవతిని చేసినది ఆ పిల్ల కన్నతండ్రేనట. కూతురును నా భర్త బలాత్కరిస్తుండగా నేను ఆపడానికి చేసిన ప్రయత్నం ఫలించనేలేదు. నన్నోపక్కకుతోసి,చావబాదితాను తన కన్నకూతురుని బలాత్కరించాడాపాపాత్ముడు అన్నదిటా కన్నతల్లి.

నిధుల వివరాలు ?

భూప్రపంచం మీద ఏరాజకీయ పార్టీ కూడా తమ నిధుల వివరాలను ప్రజలకు వెల్లడిచేయదని, అంతరంగిక వ్యవహారాలను పత్రికా ప్రతినిధులకు చెప్పదని. నిధుల వివరాలు చాలా అంతరంగికమైనవి గనుక ఆ విషయాలు మూడో కంటికూడా తెలియనీయదనీ జనతా ప్రెసిడెంటు చంద్రశేఖర్ అభిప్రాయ పడ్డారట.

వయసు మళ్ళినా...!

విఖ్యాతహాలీవుడ్‌నటుడుఆంథోనీక్విన్ పెళ్ళిళ్ళు రెండు చేసుకుని కడుపునిండా పిల్లల్ని కన్నాక కూడా వయస్సు మళ్ళాక ప్రేమలో పడి ఆ ప్రేమించినమ్మాయితో కొన్నాళ్ళు కలిసుండడం వల్ల ఆమె వో మగపిల్లాడిని కన్నదట. ఆ పిల్లాడు తన కొడుకేనని, తన మిగతా కొడుకులు పొందే సమస్తసౌకర్యాలు, సంపదలూయీ పిల్లాడికి గూడా వస్తాయని ఆయన అన్నారట. 1912లో పుట్టిన యీయన 63లో యీ పిల్లాడికి తండ్రి అయ్యారట. అప్పటికే రెండు పెళ్ళిళ్ళు అయ్యాయట. ఈ యన ఆరడుగులమూడంగుళాలు, 195 పౌనులు బరువూ వుంటారట. తాను నటించిన ఒక్కొక్క సినిమాకూ ఆయన లక్షా డెబ్బయ్యయిదు వేల డాలర్లనుంచి నిర్మాత శక్తిమీరా అయిదులక్షల డాలర్ల వరకూ నిక్కచ్చిగా వసూలు చేయడమేగాక లాభాలలో శాతంకూడా టకాయిస్తారట.

పిన్‌బాల్‌లో రికార్డు

అమెరికాకు చెందిన హేంప్‌డెన్ నగరంలో వో పదిహేడేళ్ళ ఎడ్వర్డ్ అనే కుర్రాడు వో క్లబ్బులో పలువురి సమక్షంలో 170 గంటలువిక దాటిగా, విశ్రాంతి లేకుండా "పిన్‌బాల్" అనే ఆట ఆడి ప్రపంచ రికార్డు స్థాపించాడట. ఇంత చిన్నవయస్సులోనే మీరు యింత ఘనకార్యాన్ని సాధించారుకదా, యిప్పుడు మీరేమి చేయదలుచుకున్నారని వో విలేఖరడిగితే "మీరు వొదిలితే కాస్త విశ్రాంతి తీసుకుందామనుకుంటున్నాను" అన్నాడట.

స్టాంపుల బరువు !


మహబూబ్‌నగర్‌లో వో భారతీయ పౌరుడు విదేశంలోవున్న తనమిత్రునికోభారమైన (బరువు) వుత్తరంరాసి దగ్గరలోవున్న వో పోస్టాఫీసుకు వెళ్ళి ఎంత స్టాంపులు అతికించాలని అడిగాడట. అక్కడి వుద్యోగి ఆ కవరుని తూచి పదకొండ్రూపాయల వలభైపైసల స్టాంపులంటించాలని చెప్పి ఒకరూపాయిస్టాంపులు పదకొండూ చిల్లరకో రెండు స్టాంపులూ యిచ్చాడట. ఈ పదమూడు స్టాంపులూ అంటించికవరు యిచ్చాక ఆ క్లర్కు మళ్ళీ కవర్నుతూచి, బరువెక్కువయ్యింది, మరో రెండున్నర్రూపాయల స్టాంపులు అంటించాలి అన్నాడట. ఖరీదైనస్టాంపులు తన వద్దలేవని తక్కువ ఖరీదు స్టాంపులు బోల్డు అంటించడంవల్ల బరువు ఎక్కువయిందనీ, దానికి తన బాధ్యత ఎంత మాత్రమూ లేదని ఆ క్లర్కు వివరించాడట. వివరించడానికి జేం లోటు లేండి ! ఇంతకూ ఆ కవరు గతి !

మిడుతల్లో పోషక విలువలు !

మిడతలను అనవసరంగానూ, అజ్ఞానంతోనూ మనం సరిగా అర్థం చేసుకోటంలేదనీ, మిడతలలో బోల్డు పోషకపదార్థాలున్నాయనీ, పంటలు నాశనం చేస్తున్నాయీమిడతలు అని విచారించి ఆ మిడతలను చంపే బృహత్ యత్నాలకు బదులు ఆ మిడతల్ని పట్టుకుని ఎంచక్కా భోం చేస్తే వొంటికి మంచిదని దక్షిణాఫ్రికా విట్‌వాటర్స్ రాండ్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసరు హెప్‌బర్న్ అన్నారట. వారింటో ఫలహారమేమిటో !

రోడ్డు ప్రమాదాలు

ప్రపంచంలో ప్రతి సంవత్సరం రెండు లక్షలయాభైవేల మంది రోడ్డు ప్రమాదాలలో చనిపోతున్నారట. అంతేగాక ఏడు లక్షలయాభైవేల చిల్లర క్షత గాత్రులవుతున్నారట. మన దేశంలోనే ఏటికిసుమారు ఇరవైవేల మంది చనిపోడం, లక్షమంది గాయపడ్డం జరుగుతోందట. ప్రపంచ జనాభాలో చాలా భాగం కాన్సరు, హృదయ సంబంధ వ్యాధులవల్లచనిపోతున్నారని, యీ రెండు రోగాల తరువాత ప్రాణులను పరలోకంకు తీసుకుపోడంలో యీ రోడ్డు ప్రమాదాలదే మూడో స్థానం అట.



'మాయాజాలం మతికట్టు'

యోగిక్ స్టంట్

హైదరాబాద్‌లో జూన్ 24 న ఆ రోజు శనివారం. సాయంత్రం నాలుగు గంటలయింది. అప్పుడే విజయనగర కాలనీలో నా బంధువు లందర్నీ చూడడం ముగించుకుని సిటీబస్సులో యింటికి బయలుదేరాను.

139 వ నెంబరు బస్సునిండా జనాన్ని కూరుకుని ఓ నలభై నిముషాలలో చిక్కడపల్లి బస్సు స్టాప్‌లో ఆగింది.

బస్సులో జనం దిగకుండానే బైటున్న జనం తోసుకుంటూ లోపలికిదూసుకు రావటంతో, ఎట్లాగైతేనేం బలవంతాన బస్సులోంచి స్ప్రింగులా బయటపడి బట్టలు దులుపుకుని యింటిదారి పట్టాను.

చకచక పాట్‌ఫారం మీద నడుస్తూ, అవసరమైన చోట గంతులేస్తూ ముందుకు సాగిపోతున్నాను.


మూడు జంక్షన్లు దాటుకుని నాల్గవ జంక్షన్ చేరుకున్నాను. ఓ హోటల్ ప్రక్కగా వున్న ఖాళీ స్థలంలో బోలెడు మంది జనం వలయంగా చేరి వుండడాన్ని చూచి ఆత్రుతగా వాళ్ళని సమీపించి వలయంలో చేరాను.

అంతే! వాళ్ళందరూ ఒళ్ళు గగుర్పొడిచే ఓ భయంకర దృశ్యాన్ని కిమ్మనకుండా చేతులు కట్టుకుని కళ్ళార్పకుండా చూస్తున్నారు.

ఎవడో చూడ్డానికి ఓ మహా యోగిలా వున్నాడు. నల్లటి గుబురైన గడ్డం, ఓ పదునైన కత్తి గడ్డం మీదుగా కుడివైపు దవడలోంచి నోటికి అడ్డంగా ఎడమవైపు దవడని చీల్చుకు బైటకు వచ్చి వుంది.

ఓ చేత్తో యినుప బద్దీకి కట్టిన మువ్వలతో చప్పుడు చేస్తూ, రెండో చేత్తో తాబేటి చిప్పొకటి పట్టుకుని తిరుగుతూ, కళ్ళురిమేస్తూ అందరి వైపూ తీక్షణంగా చూడ్డం మొదలెట్టాడు

అంతే! ఆ భయంకర దృశ్యాన్ని చూడలేక అక్కడున్న వాళ్ళంతా ఆశ్చర్యపోతూ తోచినన్ని చిల్లర డబ్బులు తాబేటి చిప్పలో వేయడం మొదలెట్టారు.



నేను ఏ మాత్రం భయం మాట అటుంచి అంత బాగా వేషం వేసుకుని అంతలా అందర్నీ ఆకట్టుకుంటూ, 2, 3 చిత్రాలలో చూపిన విధంగా తయారు చేసుకున్న కత్తిని 1 వ చిత్రంలో చూపిన విధంగా, నైస్‌గా కత్తి వంకర భాగాన్ని గడ్డంలో దాగివుండేలా ఫిక్సు చేసుకుని చాక చక్యంతో ప్రదర్శించాడని అక్కడున్న వాళ్ళెవ్వరికీ తెలీనందుకు నాలో నేను నవ్వుకున్నాను.

గమనిక : 1. యీ అయిటమ్ కేవలం యోగిలా నటించిన ఒక వ్యక్తి చేసిన స్టంటు మాత్రమే.

2. యీ అయిటమ్ సందర్భాన్ని బట్టి నాటకాలలో కూడా ఉపయోగించుకోవచ్చు.

3. ఈ అయిటమ్ చెయ్యడంలో ముఖ్యంగా కత్తి చివరలు రెండూ, నోటిలో వుంచబడిన మధ్య భాగమూ, ఒకే వరుసలో వుండేలా జాగ్రత్త వహించడం ముఖ్యం.

4. యీ అయిటమ్ ప్రదర్శించేటప్పుడు ఎట్టి పరిస్థితిలోనూ, దగ్గర రాకుండా చూసుకోండి. ఒకవేళ దగ్గరను కోండి... నోట్లో వుంచబడిన కత్తి మధ్య భాగం పొరపాటున ఎగిరివెళ్లి ఆడియన్స్‌మీద పడే ప్రమాదం ఎంతైనా వుంది.

— భావరాజు కామేష్

కవితంటే కాదు

కవిత్వమంటే కాదు
పదముల ఒంపుసొంపుల మన్మథ బాణాలు
కవిత్వమంటే కాదు
చెవులకు పసందు చేసే విందు
కవిత్వమంటే కాదు
ఊహాలోకాల్లో తిరిగి
దివినుండి దిగిన పైత్యరసం
కవిత్వమంటే
ఆవేదనారోదనల మధ్య ఉదయించిన
అంతరంగ తరంగాల పదాల వెల్లువ
కవిత్వమంటే
మనిషిని మేల్కొల్పి, మనసును
చైతన్యం చేసి
బల, విశ్వాసాలను దృఢపరిచే వివేకదర్శిని
అదే కవిత్వమంటే!
అదే కవితంటే !!!

—"రాజి"

ఇందిరమ్మ గెలుపు



నవంబర్ 8 న చిక్కమగళూరు నుంచి శ్రీమతి ఇందిరాగాంధీ పార్లమెంటుకు 77,333 వోట్ల మెజారిటీతో ఎన్నికైనారు.

మరిన్ని చక్కని ప్రింటులతో కన్నుల పండువుగా అలరారుతున్నది బిన్నీ

ఇంపైన రంగుల సమోహాదయం... నిండైన అద్దకముల పుష్పవర్షం...
అందాలుచిందే వెన్నో జరుగుతున్నవి బిన్నీలో. నమ్మకంగా
వాడతగిన బిన్నీనూలు మరియు పోలిస్టర్ దుస్తులు కొత్తకొత్త
అందచందాలతో అహ్లాదకరంగా ఉండేటట్లు తయారుచేయబడుతున్నవి,
దయచేయండి-మీకు సమీపంలోగల బిన్నీ వ్యాపారికొట్లో
చూడండి బిన్నీ సరికొత్త అందచందాల దుస్తులు!





అర్చనా! అర్చనా!!

(16 వ పేజీ తరువాయి)

ఒక విచిత్రమైన పదార్థం లాంటివాడు అనంత్ ఏదీ అంత తేలిగ్గా నమ్మేరకం కాదు జరిగేది జరగక మానదూ అనే తత్వం గలవాడు. వచ్చేదేదీ రాకమాన దంటూ తనకు తాను ధైర్యం చెప్పుకుం టున్నా "వేరే డాక్టర్‌తో సంప్రదిస్తే !" అన్న అంతరాత్మ ఘోషను "నిజమైతే !" నన్నా మనసు భయం, పిరికితనం మింగే సింది. తన భార్యకు మాత్రం తెలియకుండా జాగ్రత్తపడాలను కున్నాడు. వ్యాధి వస్తుం దన్న మాత్రాన—

భర్తేనాసరే చీడపురుగులాంటి వాడా! నిన్నటిదాకా తాకి ఆనందించిన శరీరంపై అసహ్యం, ఏవగింపు, రోత. ఎందుకు? భార్యాభర్తలై నడిచిన ఏడడుగుల బంధం యిదేనా? పదేళ్ళు కలిసి కాపురం చేసి యింత తేలిగ్గా త్రుంచిన బంధాన్ని తిరిగి ముడివేయాలనుకోవడం తెలివితక్కువ తనం అనుకున్నాడు అనంత్.

* * *

పుట్టింటికి అర్చన వెళిన కొన్ని రోజులకు ఆమె దగ్గర్నుండి అనంత్‌కు ఉత్తరం వచ్చింది, పిల్లలిద్దర్నీ హాస్టల్లో వుంచినట్టు. అదేం పెద్ద విశేషం కాదను కున్నాడు కాని—ఉత్తరంలో చివరి వాక్యాలు కోపం కల్గించాయి

"...మీరు మరో స్త్రీతో సంబంధాలు పెట్టుకుంటున్నారట. యిది మీకు తగని పని. పిల్లల భవిష్యత్ ఆలోచించే మీరి అవినీతికి పాల్పడుతున్నారా?" అని —అంటే ?—

అలా చేయవద్దనే అర్థింపా? అలా చేయలేరనే బెదిరింపా? అలా చేస్తే శిక్షిస్తాననే హెచ్చరికా?!" అలా అనుకున్న క్షణంలో అసహ్యం, కోపం, అర్చన మీద కల్గింది.

అనంత్ మొట్టమొదటి సారిగా వేశ్యా వాకిట నిలుచున్నాడు. ఈ విషయం స్నేహి తుడు శంకరానికి తెల్సి, అతనన్న మాటలు యివి—

"ఆడది వెళ్ళినంత మాత్రాన బ్రతకలేక కాళ్ళా వేళ్ళాపడి తెచ్చుకునే మగాడ్ని

మాత్రం కాదని నిరూపిస్తున్నావంతే!" ఆ మాటలు లక్ష్యపెట్టలేదు అనంత్.

కొన్నాళ్ళకు మరో ఉత్తరం. "...మీరు రెండో పెళ్ళి వ్యవహారాలు మొదలు పెట్టినట్టుగా విన్నాను. అలాంటిదే జరిగితే, అవే ఏర్పాట్లు నేనిక్కడ చేసుకోవాల్సి వస్తుంది" చదివాడు పదిసార్లు. చింపి ముక్కలు కాల్చి వేస్తుంటే మనసు కసిదీరా నవ్వుకుంది. కాని—

లంకంత భవనంలో తానొక్కడే వుండడం అనంత్‌కు మహా నరకంగా వుంది. అంతే! అర్చనకు తెలియకుండా హాస్టల్లో పిల్లల్ని తీసుకుని రాత్రికి రాత్రే వూరొచ్చేశాడు. ఆ రెండో రోజునే అర్చన దగ్గర్నుండి ఉత్తరం వచ్చింది.

"...నా అనుమతి లేకుండా పిల్లల్ని తీసుకు వెళ్ళగలిగారు! వాళ్ళైనా సుఖంగా వుండడం యిష్టం లేదా? లేక మరో తల్లిని రడీగా వుంచారా? పిల్లల్ని తీసుకు వెళ్ళారు. కాని— యిప్పుడు నాలో పెరుగుతున్న "నా" అనేదాన్ని తీసుకు పోలేరుగా!!..."

అంతే! లోకం గొడ్డుపోలేదు. తనను చూసి కాకపోయినా, తన ఆస్తి అంతస్థులు చూసైనా పిల్లనిస్తారనుకున్నాడు. ఆ క్షణంలో అర్చనమీద కోపం, అసహ్యం మరొకర్ని పెళ్ళి చేసుకునే నిర్ణయానికి దారితీశాయి.

కొన్ని రోజులకు జరిగిన అనంత్ పెళ్ళికి అతని ఇద్దరు పిల్లలే సాక్షులు, బంధువులు, అతిథులు.

రెండు సంవత్సరాలు దొర్లాయి.

★ ★ ★

ఒకరోజు—

అద్దం ముందు నిలబడి తల దువ్వుకుంటున్నాడు అనంత్. హఠాత్తుగా అతని దృష్టి ఎర్రగా వాచిన చెవిమీద పడగానే భృకుటి ముడివడింది.

"ఏయ్! పోరా రాస్కెల్! మరీ మీదకొచ్చి అడుక్కుంటావేరా...వీడి అందానికి తోడు యింగ్లీషొకటి! కుష్ఠు దొధవ..." శరీరమంతా కుళ్ళిన పండులాగా, ఆ పండు మీద వాలే ఈగలు దులుపుకునే మొండి వేళ్ళుగల చేతులు, రక్తసిక్తమైన గాయాలపై దుమ్ము, దురద, బాధ.

అరె! తన ప్రతిరూపమే!! యిలా మారిందేమిటి? తనను ఎవరో హేళన చేస్తూ గెంటివేస్తున్నారు. లేదు తనకా రాత లేదు.

"లేదు." అని బిగ్గరగా అరిచాడు అనంత్.

అద్దంలో అతని ముఖం నవ్వుతోంది. ముచ్చెమటలు పట్టినందుకు, భయాందోళన అరుపు విని వైదేహి అదిరిపోయి భర్త వద్దకు వచ్చింది.

"ఏమిటండీ! అలా అరిచారేం!" అని అడిగితే తన చెవి చూపాడు.

"దోమో, ఈగో కుట్టింది. అంత మాత్రాన భయపడాలా!" అంటూ పకపకా నవ్వింది. ఆ మాటలకు ధైర్యం తెచ్చుకుందతని మనసు. కాని మూల ఏదో చిన్న అనుమానం.

అనుమానాలు భరించలేక, ఈ వ్యాధి వస్తుందని చెప్పిన డాక్టరే శరణ్యం అనుకుని బయల్దేరాడు అనంత్.

* * *

డాక్టర్ గదిలోనుంచి బైటకొస్తున్న పూలచీర కట్టుకున్న కుష్ఠు వ్యాధిరాలిని చూసి ముఖం చాటు చేసుకున్నాడు. ఆమెను చూసేసరికి అనంత్ శరీరం జలదరించింది. అబ్బా! ఏం ముఖంరా బాబు!! ఈ జబ్బు యింత అసహ్యకరమైన జబ్బా! చీరలోని పూల మాదిరే ఆమె శరీరమంతా మచ్చలు. ఎగుడు దిగుడు కురుపులు. బాబోయ్!!

ఒక్కక్షణం ఊపిరి గుండెల నిండా పీల్చుకుని డాక్టర్ గదిలోకి వెళ్ళాడు అనంత్. హల్లో! అనంత్.. అంటూ పలకరించి కుర్చీ చూపించాడు డాక్టర్.

"డాక్టర్! రెండు సంవత్సరాల క్రితం ఏదో జబ్బు వస్తుంది నాకని చెప్పారూ.." అని అనంత్ అంటుండగానే డాక్టర్ మధ్యలో ఖండించి వేశాడు.


"లేదు. ఇక రాదు" అని.

"రాదా!!... మరలా చెప్పారేం?"

"కుష్ఠు వ్యాధి నీకు కాదు— నీ భార్య అర్చనకు"

"అర్చనా!!!..." అదిరిపోయాడు అనంత్

"అవును... తనకు కుష్ఠు వచ్చే సూచనలు తెలిసి ముందే మేల్కొంది అర్చన. ముందు ముందు తన రూపం ఎలా వుంటుందో వూహించుకుని, ఆ రూపం నువ్వు భరించలేవని, జీవితాంతం కుమిలిపోతావని ఆమె నా శరణు కోరింది. తనను క్షణం కూడా విడిచి వుండలేని నిన్ను ఎలా నిన్ను దూరం చేయాలో కూడా ఆమె నాకు చెప్పింది. ఆ వ్యాధేదో నీకే వస్తున్నట్లు నా ద్వారా నీకు చెప్పించింది. నీ జీవితం నాశనం కాకుండా వుండేందుకు తన వ్యాధి రహస్యందాచి వుంచింది అప్పుడే తెల్సిన ... నటిస్తూ కుష్ఠురోగికి దూరంగా వుండాలంటూ క్షణక్షణానికి నీకు దూరం అవుతూ తను దూరంగా తప్పుకుంది. తాత్కాలికంగా



అర్చనా! అర్చనా!!

అందర్నీ, అన్నిటినీ దూరం చేస్తూ, నీ వంటే రోత పుట్టేలా, ఆమె మీద నీకు అసహ్యం పుట్టేలా ప్రవర్తించింది. నీనుండి విడిపోయి నీకు కల్పించి పుత్రరాలు వ్రాస్తూ తనకు కావల్సిన విధంగా నిన్ను మలుచుకుంది. కారణం—తన భర్త తనను పూర్తిగా మర్చిపోవాలని, తనుండగానే భర్తా, పిల్లలకు ఒక దారి చూపాలనుకోవడం, తను పూర్తిగా కనుమరుగైపోవాలన్న దృఢ నిశ్చయమే! పిల్లలు తమ తల్లి ఒక దుష్టరోగని, తల్లిలేనివారు కాకూడదనే ఈ విధంగా నాటకం ఆడింది. అసలు... ఈ రహస్యం ఎప్పటికీ నీకు తెలియకూడదని నిబరంతో జీవిస్తున్న త్యాగశీలి చెప్పొద్దన్న మనోధైర్యం ముందు నీకీ రహస్యం చెప్పి బాధ్యత తీరిపోయిందని చేతులు దులుపుకుంటూ నేను ఓడిపోయాను". భారంగా నిట్టూర్చి అగ్ని పర్వతం లాంటి రహస్యాన్ని వెళ్లగక్కాడు డాక్టర్.

"డా.. క్ట...ర్— ?!" మనోవేదనకు బలైపోతున్న అనంత్‌కు ఒక్కొక్కటే గురు రాసాగాయి

"అ బ్బ బ్బ! ... వెన్నెల రేపుంటుందిగా!..."

"మిమ్మల్నెందుకు చూడాలి? మీరు నన్ను చూడ్డం లేదంటే!"

"వద్దండి! వద్దు. ఈభయంకరమైన వ్యాధి యింకొకరికి సోక కూడదు. అది మరొకర్ని పరించకముందే యిక్కడ్నించి వెళ్ళిపోవడం మంచిది." "మిమ్మల్ని ఓదార్చే నేర్పుగాని, సేవలు చేసే ఓర్పుగాని నాకు లేదు నాకు నా సౌఖ్యం కంటే భవిష్యత్ ముఖ్యం. పిల్లలు మనిద్దర్లో ఏ ఒక్కర్నీ ఏవగించుకోవడం నాకిష్టంలేదు"

"...యిప్పుడు నాలో పెరుగుతున్న "నా" అనేదాన్ని తీసుకుపోలేరుగా!"

అర్చనలో పెరిగే "నా"—ఈ భయంకరమైన జబ్బన్నమాట! ఎంత అబ్బురు తను. తను గర్భిణి కాబోతుందేమో అనుకున్నాడప్పుడు. అర్చన అనాదరణలో ఎంతటి ఆదరణ దాగివుంది!

ఆమె ద్వంద్వార్థపు మాటల్లోని గూఢార్థం యిప్పుడు బోధపడింది అనంత్‌కు వెంటనే అన్నాడు—

"డాక్టర్! అర్చన యిప్పుడెక్కడ వుంది?"

"ఈపాటికి నీకు అందనంత దూరం వెళ్ళిపోయే వుంటుంది. ఇదిగో తన పుట్టింటి ఆస్తిని తన పిల్లలపేర వ్రాసిన వీలునామా! ఇప్పుడే యిచ్చి వెళ్ళింది."

"ఇప్పుడా!!... ఎక్కడా?" అరిచినట్లుగానే అడిగాడు అనంత్

"ఆవేశపడకు అనంత్! నీ కంట కన్నీరు చిందకూడదనే ఆమె చివరికోర్కె. చిందే కన్నీటితో ఆమె హృదయావేదనా జ్వాలలు ప్రజ్వరిల్లుతాయేగాని చల్లారదు"

"లేదు డాక్టర్! లేదు. నా దేవతను చూడాలి."

"నువ్వు నిజంగా దురదృష్టవంతుడివి. అనంత్ నీవొస్తున్న అడుగు చప్పుడిని గ్రహించి, నీవు వస్తున్నావని బెదురులో, దుఃఖంతో బైటకు వెళ్ళిపోతూ లోపలికి వచ్చే నీకు ఎదురుపడిన అర్చనలో పెరిగిపోయిన వ్యాధి పూర్తిగా తినేస్తుండడం నీవు చూడలేదా అనంత్!" అన్న డాక్టర్ మాటలు విని కొయ్యబారిపోయాడు అతను.

గదిలో నుంచి తనకు ఎదురు పడినది! పూలచీరామె!! ఆమె!!... అయితే!—ఆమె! అర్చనా!!...

అంతే!—

డాక్టర్ వద్దనుండి బైటకు గాలిలా దూసుకొచ్చాడు అనంత్. అనంతమైన ఆవేదనకు లోనయ్యాడు అనంత్. భూమి దద్దరిల్లేలా అరిచాడు.

"అర్చనా!!..."

జవాబు లేదు. కనిపించలేదు. అతని అరుపుకు భయపడి చెట్లమీద పక్షులు గొల్లున అరుస్తూ పైకెగిరిపోయాయి

హార్లిక్స్
మీకు ఎక్కువగా అవసరమయినప్పుడూ శక్తినిచ్చే కీలకపోషక పదార్థం.



గర్భవతిగా ఉన్న కాలంలో

గర్భిణీ స్త్రీకి మంచి సమతూకంలో ఉండి, తేలిగ్గా జీర్ణమయ్యే ఆహారం అవసరం. అందువల్లనే గర్భిణిగా ఉన్నప్పుడు హార్లిక్స్ ఆదర్శప్రాయమయిన ఆహారం. ఇది తల్లికి, పిల్లకి కూడా శరీర నిర్మాణానికి కావలసిన మాంస కృత్తులు, కార్బోహైడ్రేట్లు సరిఅయిన సమతూకంలో సమకూరుస్తుంది. రాత్రిళ్ళు సేవించిన మలబద్ధకం ఉండదు. ఉదయమే నిస్సత్తువగా ఉండటం పోతుంది.

అస్వస్థత / అస్వస్థనుంచి కోలుకునే కాలంలో

జబ్బు చేసినప్పుడు మీ శరీరం ఎంతో విలువయిన మాంసకృత్తులు, పోషక పదార్థాలు కోల్పోతుంది. దీనివల్ల నిస్సత్తువ ఏర్పడుతుంది. ఈ నష్టాలని భర్తీ చేసేందుకు హార్లిక్స్ తేలిగ్గా జీర్ణమయ్యే రూపంలో శరీర కణాల నిర్మాణానికి కావలసిన మాంస కృత్తులు, శక్తినిచ్చే కార్బోహైడ్రేట్ల ఖనిజాలు సమకూరుస్తుంది. దీనివల్ల మీరు త్వరగా కోలుకొంటారు. మరో జబ్బు పడకుండా తట్టుకునే శక్తి ఏర్పడుతుంది.

ప్రపంచమంతటా డాక్టర్లు సిఫార్సు చేశారు
హార్లిక్స్ మంచి పుష్టికరమైనది

హార్లిక్స్ రిజిస్టర్డ్ ట్రేడ్ మార్క్

Hx.4669 Tel 1

ప్రశ్నావళి!

కె. రామలక్ష్మి

ఎస్. కె. ఎస్. — మంచిర్యాల

"అపుత్రస్యగతిర్నాస్తి" అన్నారు...

★ పుత్రుడు లేక సద్గతి లేదని. కాని ఇప్పుడా మాట మార్చుకోవాలి "సద్గతికిపుత్రులు లేక పోవడమే - మేలు" అని...ఈనాటి రాజకీయ నాయకుల పుత్రరత్నాలు తెస్తున్న గొడవలు చూస్తున్నాం కదా!

ఏర్. — సామర్లకోట

మగవాళ్లను చూసి తప్పుగా అంచనా వేసే ఆడవాళ్లనుఏమనాలి? అలాంటిఆడవారంటే నాకు పట్టలేని కోపం.

★ "మంచి వాడుగా నిరూపించబడే దాకా" మన అంచనాలు మార్చుకోవలసిన పనిలేదని మామూలు ఆడవాళ్ళ నమ్మకం. ఇక మీమంచి తనం నిరూపించు కోకుండ మిమ్మల్ని నమ్మని వారిమీద మీకెందుకు కోపం?

ఎస్. బి. — హైదరాబాదు

మా వారికి సిగరెట్టు తాగే అలవాటుంది. నాకేమో చాలా అసహ్యం...

★ చిట్టితల్లీ - పెళ్ళంటూ చేసుకుంటే - సుగుణాలతోటీ, దుర్గుణాలతోటీ ఆ వ్యక్తిని స్వీకరించినట్టే లెక్క. మనకిష్టం మార్చాలని పెళ్ళి చేసుకోవడం అన్యాయం. అనురాగం, ప్రేమ, ఒకరిమీద ఒకరికి గౌరవం వుంటే - ఒకరి కిష్టంలేదని తెలిసిన విషయాలు ఇంకొకరు - చేయరు. మల్లె పూవు పెట్టుకో, తెల్లచీర కట్టుకో మంటూ చికాకొస్తే భర్త మాటకెదురు తిరగడం ఎంత సహజమో - "నీ యిష్టం" అనే భర్త అనుకూలవతిగా ప్రవర్తించడం అంత సహజం - ఆడదానికి. మీ కిష్టం లేదని తెలిస్తే క్రమంగా వారే మానేయవచ్చు, మీరిలా ప్రాణాలుతోడితే - పట్టువిడవక కాల్చనూవచ్చు. అది మీ చేతిలో వుంది!

బి. ఎస్. — గురజాల.

భర్త భార్యను ఏమేవ్ అనిపిలుస్తాడు. అదే స్త్రీకి సమానత్వపు హక్కు లనిస్తే ఆమె భర్తను ఏమని పిలవాలి?

★ ఇంతకీ సమానత్వపు హక్కు లేక పోవడంవల్లే "ఏమేవ్" అని పిలవబడుతున్నారు - భార్యలు అంటాను!

ఏ. ఆర్. ఆర్. — కలకత్తా

కష్టం వచ్చినప్పుడు కుంగిపోడం, మంచి జరిగినప్పుడు పొంగిపోవడం జరుగుతుంది, అలా ఎందుకని?

★ అది మనిషి బలహీనత. కష్టం - సుఖం వీటిలో ఏదీ శాశ్వతంగా నిలచే స్థితికాదని తెలిసీ - తెలియని తనం!

విజయకుమార్ — సికింద్రాబాదు.

ఒక అమ్మాయిని ప్రేమించాను. వాళ్ళనాన్న ఒప్పుకున్నారు. మా నాన్నగారు ఒప్పుకోవడం లేదు. ఆస్తిలో చిల్లిగవ్వ రాదంటున్నారు.

★ ప్రేమ కంటే ఆస్తి గొప్పది - ఈసంగతి ఈ మాట కాదంటే కొన్నాళ్ళకైనా తెలిసి వస్తుంది. అంచేత ఆస్తి వచ్చేదాకా ఆగి ప్రేమించండి!

పి. డి. ఆర్. — పలాస

జీవితానికి భోగభాగ్యాలు ముఖ్యమా, దాంపత్య జీవనం ముఖ్యమా?

★ సాగితే - భోగభాగ్యాలతో కూడిన దాంపత్య జీవనం బాగుంటుందేమో!

పాప పుణ్యాలంటే ఏమిటి? ఎవరు రుజువు చేయగలరు?

★ సాటి మనిషికి మంచి చేయడం పుణ్యం. చెడు చేయడమేకాదు, తలపెట్టడం కూడా పాపం. ఏది పాపం ఏది పుణ్యంఅని ఎవరూ మీకు చెప్పనక్కరలేదు. మీ అంతరాత్మే దానికి సాక్షి.


ఆర్. ఎల్. — విశాఖపట్నం

భగ్న ప్రేమకు తాగుడొక్కటే పరిష్కారమా? లేక నాగేశ్వరరావుగారికే అది సాధ్యమా?


★ ఆయనకేం మహారాజు! అనుకూలవతి అయిన అన్నపూర్ణ వుంది! ఎటొచ్చీ, కథలూ దర్శకులు సృష్టించిన భగ్న ప్రేమికుల్ని మధువులో ముంచి రక్తి కట్టించి భగ్నప్రేమికులకి తాగుడు ట్రేడ్ మార్కు చేసేశారు!

ఛాంపియన్ డిటర్జెంట్ కేక్ !

1అప్




మురికపై విజయం!



అధిక శక్తిగల వన్-అప్,
మురికిని నామరూపాలు
లేకుండా తుదముట్టించి,
మురిపించే మెరిపించే
శుభ్రత నిస్తుంది !

వన్-అప్ లోని అధిక శక్తివంతమైన పదార్థాలు, లోపలికి చొచ్చుకుపోగల, తీవ్రంగా పనిచేసే మరగనూ, అధికంగా తెలుపుచేసేవాటినీ సమకూరుస్తాయి. అందుకే వన్-అప్, లోపలదాగిన మురికిని అంతా తీసేసి, బట్టలని శుభ్రపరుస్తుంది—దాంతో తెల్లవాటికి మరింత తెలుపు, రంగువాటికి మరింత మెరుపూ వస్తుంది.


బట్టలకు సంరక్షణ!



సుతిమెత్తని వన్-అప్ మీ
బట్టలను పూర్తిగా సంరక్షించి,
వాటికి సుగంధాన్నిచ్చే ఓ
తాజాదనాన్ని తెస్తుంది!


వన్-అప్, శక్తివంతమైనదైనా ఎంతో మృదువుగా పని చేస్తుంది. ఎందుకంటే దీనిలో హానికరమైన పదార్థాలేమీ లేవు గనక. చక్కని సుగంధం చిందించే వన్-అప్, మీ బట్టలపై మృదుత్వంతో పనిచేస్తుంది. దాంతో అవి సుగంధం తాజాదనంతో రూపొందుతాయి.

డబ్బు ఆదాతో ఉపకారం!



వన్-అప్‌లోని మన్నిగల
శక్తి, మరీ మరీ, ఉతికిన
ప్రతిసారీ డబ్బును ఆదా
చేస్తూనే ఉంటుంది !

వన్-అప్, మరే యితర డిటర్జెంట్ కేక్‌కన్నా ఎక్కువ కాలం మన్నుతుంది. ఎందుకంటే, వాడగానే దబ్బున అరిపోదు గనక. అంటే వాడే ప్రతిసారీ మీరు డబ్బును ఆదా చేస్తున్నారన్నమాటే !



1అప్

శుభ్రతా, సువాసనా, మెరుపూ
సమకూర్చే ఛాంపియన్!

ASP/WL-I UP IA

విట్‌కో లిమిటెడ్, కాలోల్ 389 330, గుజరాత్.

వయసు - వ్యామోహం

వేదగిరి రాంబాబు



రోహిణి మనసాలోచనల్తో చికాకై పోయింది.

ఆఫీసుకి చేరుకున్న తర్వాత కూడా ఆ ఆలోచన్లామెని విడిచిపెట్టలేదు. పని చేయాలనిపించడం లేదు.

పోనీ శలవు పెట్టి ఇంటికి వెళ్ళిపోదామంటే ఇంటిదగ్గర అసలు మనశ్శాంతి వుండదు.

'హుఁ... చేతులారా చేసుకున్నది! అంతా తన ప్రారబ్ధం! ఇప్పుడనుకుని మాత్రం ప్రయోజనమేముంది?'

బావ రమణిని ప్రేమించాడని తెలిసి కూడా అతన్నే పెళ్ళి చేసుకుంటానని మొండికేసి కూర్చోవడం తన మూర్ఖత్వం. అమ్మా నాన్నలకు తనొక్కర్తే కూతురు కావడంతో ఆస్తి కోసం అత్తయ్యామావయ్యలు తనని కోడలుగా చేసుకోవాలని వువ్విళ్ళూరసాగారు. ఫలితంగా బావ మరెవర్నో ప్రేమించినా తనకే దక్కాడు.

ప్రాణంకన్న మిన్నగా ప్రేమించిన బావని భర్తగా పొందగల్గినందుకు గర్వించింది. ఆ గర్వమెంతో కాలం నిలువలేదు. బావ భౌతికంగా తనకి దగ్గరైనా, మానసికంగా తన కెంతో దూరమనే విషయం అర్థమైపోయింది.

అప్పటికే చేతులు కాలాయ్! ఆకులు పట్టుకుని మాత్రం లాభమేంటి? జీవితాంతం వుత్తర దక్షిణ ధృవాల్లాగానే కాపురం చెయ్యాలి!

తనంటే ప్రత్యేకమైన అభిమానం లేకున్నా పర్లేదు. తను దాని కంతగా బాధపడదు... కానీ తను మాట్లాడితేనే చికాకు! పొద్దునకి పొద్దున తనేమన్నదని చెయ్యి గోడా చేసుకున్నాడు...

ఆమెకి కళ్ళవెంట నీళ్ళు వచ్చాయ్. ఎవరైనా చూస్తారేమోనని గబుక్కున కర్చీఫందుకుని కళ్ళద్దుకోసాగింది.

"నమస్కారం మేడమ్..." పలకరింపుతో వులిక్కిపడి తలెత్తి చూసింది రోహిణి.

ఎదురుగా ఈశ్వర్!

ఆశ్చర్యంతోపాటు ఆనందం కూడా వేసింది.

"నమస్కారం! రండి కూర్చోండి" పెదాలమీదకి నవ్వు తెచ్చుకుంటూ అంది.

"ఏంటి విశేషాలు? ఎలా వున్నారు?— చెప్పండి" అన్నాడీశ్వర్ తనూ నవ్వుతూ ఆమె కెదురుగా వున్న కుర్చీలో కూలబడి.

"ఏమున్నాయ్? అన్నీ మామూలే! అన్నట్టు మీరీవూరెప్పుడొచ్చారు?"

"బావగార్ని, చెల్లెల్ని పండక్కి తీసుకెళ్ళడానికి వచ్చాను. తిరిగి రాత్రి బండిలో వెళ్ళిపోతున్నాం. ఈలోపు మిమ్మల్నోసారి పలకరించి పోదామని వచ్చాను. ఇదీ సంక్షిప్తంగా నా రాకకి కారణం" చిన్నగా నవ్వాడీశ్వర్.

ఎంత ప్రశాంతంగా నవ్వుతాడు!

ఇతనికి, బావకి ఎంతో తేడా వుంది. తనని చూస్తే చాలు బావ నవ్వుమొహం కూడా వికృతంగా మారిపోతుంది.

ఈశ్వర్ చిరునవ్వు, బావ చిరాకు చూపులు కంటిముందు మెదిలాయ్ రోహిణికి.

"ఏంటి మేడమ్! అంత తీవ్రంగా ఆలోచించేస్తున్నారు!" మళ్ళీ చిరునవ్వు.

ఈశ్వర్‌కి తనంటే ఎంత ఇష్టం! అతని సాన్నిధ్యంలో కొంతవరకైనా చిరాకుని మర్చిపోవచ్చు. కాని ఇక్కడింతమంది

మధ్యలో అతనితో ఎలా ఫ్రీగా మాట్లాడ గలదు ?

"మీకింకా పన్లేమైనా వున్నాయా పూర్ణా ?" అడిగిందతన్ని.

"మరో ఇద్దరు స్నేహితులున్నారు. వాళ్ళని పలకరించాలి."

"అయితే ఒకపని చెయ్యకూడదూ ?"

"ఏంటి ?"

"ఇప్పుడు కాస బిజీగా వుంది మీరలా మీ స్నేహితుల్ని చూసొచ్చి సాయంత్రం ఐదుగంటలకల్లా వచ్చేశారంటే ఇద్దరం కలిసి మా ఇంటికి వెళ్దాం. అప్పుడు మనిషం వచ్చినంత సేపు కబుర్లు చెప్పుకోవచ్చు."

"విత్ ప్లెజర్! అలాగే ఐదు గంటలకల్లా వస్తాను" వెళ్ళిపోయాడీశ్వర్.

అతను వెళ్ళిపోయినా ఆమె ఆలోచనలన్నీ అతని చుట్టూనే తిరగసాగాయ్. తనంటే అతని కెందు కంత ఆరాధన! తనారోజు అంత క్రూరంగా ప్రవర్తించినా ఎందుకింకా తనంటే అభిమానం! అసలు ఆరోజు తను చేసింది మంచి పనేనా ?

* * *

ఆ రోజుతో ఫైనలియర్ పరీక్షలై పోయాయ్.

విద్యానగర్ రైల్వేస్టేషన్లో కలిశాడీశ్వర్.

"ఏమండీ! ఇవాళ మీతో ఓ విషయం మాట్లాడాలను కుంటున్నాను" అన్నాడు చిన్నగా నవ్వుతూ.

"మాట్లాడండి" తనూ నవ్వింది.

"ఇప్పుడు కాదండీ-పరీక్ష అయిపోయిం తర్వాత..."

"పర్లేదు. ఇప్పుడు చెప్పండి." అతనేం చెప్పాలనుకుంటున్నాడో తనకి తెలుసు. తనంటే అతనికి వెర్రి ఆరాధననే విషయం తనకేకాదు, క్లాసులో అందరికీ తెలుసు. అతని దగ్గర్నించి ప్రేమకి సంబంధించిన మాటల్ని ఎప్పుడో ఒకప్పుడు వినాల్సొస్తుందని తనూహించింది.

అతను చదువులోనేకాదు నడవడి విషయంలో కూడా అందరి మన్ననలని పొందుతున్న మనిషి. అంతకుమించి మంచి ఆస్తిపరుడని కూడా వింది. అయినా తన మనసతని మీదకి మళ్ళడంలేదు.

అందుక్కారణం అతన్లో లోపమేమీ

వయసు-వ్యామోహం

కాదు. అప్పటికే తన మనసుని బావ పూర్తిగా ఆక్రమించేశాడు.

అందుకే ఇష్టంవచ్చినట్లే వేవో మాట్లాడి తనమీదున్న అతనిఅభిప్రాయాన్ని చెడగొట్టాలని నిశ్చయించుకుంది.

"ఇప్పుడు కాదండీ...పోనీ సాయంత్రం పబ్లిక్ గార్డెన్స్‌కి వస్తారా ?" నసిగాడు.

"ఏంటీ ? పబ్లిక్ గార్డెన్స్‌కి రావాలా ! మీ వుద్దేశం...?" తెచ్చిపెట్టుకున్న కోపంతో గద్దించింది తను.

"అబ్బే... అది కాదండీ ... దయచేసి వేరేగా అనుకోకండి ... మీతో వంటరిగా మాట్లాడాలని అలా అన్నాను. అంతే !" అతన్లో కంగారు అధికమైంది. అతని అవస్థ చూస్తుంటే తనకి నవ్వొస్తోంది.

తనని అతను పెళ్ళి చేసుకోవడమనేది జరగని విషయం. అయినా అతని నోటి నించీ అతని కోరికని వినాలని మనసు తహతహలాడింది.

"ఏం మాట్లాడదల్చుకున్నారో ఇక్కడే మాట్లాడండి" అంది తను.

"ఇవాల్టితో మన పరీక్షలైపోతున్నాయ్ – రేపు మావూరెళ్ళిపోతున్నాను. అందుకనీ విషయం మీతో మాట్లాడి ..."

"ఏ విషయం?" కావాలనే అడిగింది తను.

"అదే... మీరంటే నాకు చాలా ఇష్టం. మీక్కూడా ఇష్టమైతే ఈ విషయం మా నాన్నగారికి చెప్పాలని..."

"నా జవాబు చెప్పబోయే ముందు మిమ్మల్నో ప్రశ్న అడుగుతాను. మన క్లాసులో ఎంతో మంది అమ్మాయిలున్నారు మరి, నాకొక్కదాన్నే వరంటే కలగని ఇష్టం మీకు నేనంటేనే ఎందుకు కలిగింది? నేనెప్పుడూ మీతో సరదాగా కూడా మాట్లాడలేదే!"

దూరంగా లోకల్ రైలు వస్తూ కనిపించింది.

ఆమె అలా అనేసరికి ఈశ్వర్‌కి తల దిమ్మెక్కి పోయినట్లనిపించింది. కోపంతో మొహం జేవురించింది. ఏదో చెప్పాలని నోరు తెరవబోయి, మానుకున్నాడు.

"సారీ మిష్టర్! నా కిటువంటి ప్రేమ అన్నా ప్రేమ పెళ్ళి అన్నా మంచి అభిప్రాయం లేదు" మళ్ళీ తనే అంది.

అప్పటి అతని మొహం ఇప్పటికీ తన కళ్ళముందు మెదుల్తూనే వుంది.

అతని మొహంలోని భావాలు వర్ణనాతీతం. ఆతన్నంతగా బాధ పెట్టినందుకు తనకే బాధ వేసింది అయినా తప్పదు. అప్పటికే తన మనసు పూర్తిగా బావపరమైపోయింది. మరో మగవాడికి తన మనసులో స్థానం లేదు.

ఇంతలో బండి ప్లాట్‌ఫారం మీదకి రావడంతో తను లేడీస్ కంపార్ట్‌మెంట్‌లోకి, అతను పక్క కంపార్ట్‌మెంటులోకి ఎక్కారు.

అంతే! అప్పట్నించీ మళ్ళీ అతను కనిపించలేదు.

పరీక్షలైపోగానే తనకి బావతో పెళ్ళైపోయింది. పెళ్ళికి ఆహ్వానిస్తూ ఈశ్వర్‌కి శుభలేఖ పంపింది.

'నాకు కొన్ని అర్జంటు పనులుండడం వల్ల వివాహానికి రాలేకపోతున్నానని, మీ వివాహ జీవితం ఏంతో మాధుర్యాన్ని నింపుకుని సెలయేరులా సాగిపోవాలని కోరుకుంటున్నా'నని వుత్తరం రాస్తూ–రాధాకృష్ణుల వినామిల్ పెయింట్‌ని బహుమతిగా పంపించాడు.

ఆ తర్వాత తనకి వుద్యోగం వచ్చిందని తెలిసినప్పుడు కూడా వుత్తరం ద్వారా తన సంతోషాన్ని తెలియజేశాడు.

ఒకటికి రెండుసార్లు పనిగట్టుకుని ఆఫీసుకొచ్చి పలకరించి వెళ్ళాడు. అతణ్ని చూస్తుంటే జాలితోపాటు అభిమానం కూడా కలుగ సాగింది.

ఇతన్ని కాదని బావని చేసుకోవడంలో తప్పు చేశానేమో– ఈ ఆలోచన రాగానే ఇంక ఆలోచించలేక పోయింది రోహిణి. బలవంతాన ఆ ఆలోచనలని మనసులోనించి

ద్రౌపది అయిదుగురికి భార్య ఎలా అయింది ?

పాంచాల రాజపుత్రి పాండవులు అయిదుగురికి భార్య ఎలా అయినదీ భారతంలో ఒక రీతిగా చెప్పబడింది. తను కొక భిక్ష దొరికిందంటే, అయిదుగురూ దానిని అనుభవించాలని కుంతి ఆదేశించినటు ఉన్నది అంతేకాక వ్యాస మహర్షి మరొక విధంగా సమర్థించినట్లూ ఉన్నది—

ఈ విషయం మార్కండేయపురాణంలో మరొక రీతిగా కానవస్తున్నది.

యుద్ధంలో మరణించినరాక్షసులందరూ భారతదేశంలోని రాజకుటుంబాలలో జన్మించారు స్వాభావికమైన దుష్టబుద్ధివల్ల వాళ్లు ప్రజలను హింసిస్తూ ఉండేవారు. వారి బరువును మొయ్యలేక భూదేవి మేరు పర్వతం మీదవున్న దేవతలతో మొరపెట్టుకున్నది దుష్టులైన ఆ రాజులనువధించి, భూభారాన్ని తగ్గించడానికి దేవతలు నిశ్చయించి తమ తమ అంశాలతో భూమికి అవతరించారు ఇంద్రునితోపాటు అతని భార్య-పరమ పతివ్రత శచీదేవి కూడా భూమికి అవతరించింది. ఇంద్రునితేజస్సు ధర్మజ భీమ-అర్జున-నకుల- సహదేవులు అయిదుగురి యందున్నూ సంక్రమించినది. వాస్తవానికి వీరు అయిదుగురున్నూ ఇంద్ర పుత్రులే ! కాని యుధిష్ఠిర - భీమ — అర్జునులు ముగ్గురూ పృథకు - కుంతీదేవికి పుత్రులయినా పార్థుడనే పేరు అర్జునుడియందే రూఢమైనట్లు. వీరందరూ ఇంద్రుని కుమారులే అయినా ఇంద్రపుత్రుడనే పేరు అర్జునుడియందే ప్రసిద్ధమయింది.

కౌరవులతోడి యుద్ధంలో ఈ పాండవులే దుష్టరాజులనందర్నీ సంహరించి భూభారాన్ని తగ్గించారు పాండవులయిదుగురూ పంచభూత స్వరూపాలట! ధర్మరాజుపృథివీ స్వరూపుడు అందువల్లనే భూమి మాదిరిగానే ఆయనకూ సహనశక్తి అధికంగా అలవడినది భూమి సర్వంసహ గదా! భీమసేనుడు వాయుస్వరూపుడు. అందువల్లనే వాయువునకుండే గొప్ప బలం ఆయనకు వచ్చింది. అర్జునుడు జలస్వరూపుడట! నకులుడు అగ్ని స్వరూపుడనీ, సహదేవుడు ఆకాశ స్వరూపుడనీ ఆ పురాణంలో ఉన్నది.

మహాపతివ్రత అయిన శచీదేవి పాంచాల రాజగృహంలో యజ్ఞవేదికలో యాజ్ఞసేనిగా అవతరించినది పంచపాండవులూ ఇంద్రాంశంవల ఉద్భవించిన వారే కాబట్టి వారందరికీ ఆమె భార్య అయినది. అయిదుగురికీ ఒక్కతే భార్యకావడం కొంత విరుద్ధంగా కనబడినా, పయి కారణంవల్ల ఆమె అయిదుగురికి పత్ని కావలసి వచ్చినది.

ఈ విషయాన్నే వ్యాసమహర్షి మహాభారతంలో మరొక విధంగా సమర్థించాడు.

—బులుసు వేంకట రమణయ్య

తోసివేయడాన్కి ప్రయత్నిస్తూ ఎదురుగా వున్న ఫైలందుకుంది.

* * *

సరిగ్గా అయిదు నిముషాలు తక్కువ అయిదుగంటలకు కొచ్చాడీశ్వర్.

అతన్ని చూడగానే రోహిణి గుండెలు ఆనందంతో కొట్టుకోసాగాయ్.

"మీ పనైపోయిందా ? ఇంక మనం బయల్దేరవచ్చా ?" అడిగాడతను.

"వన్‌మినిట్" టేబుల్ సర్ది, సొరుగు లాక్‌చేసి బయల్దేరింది.

ముందతను, వెనుక తను !

- ఇలా ఆఫీసుకొచ్చి తీసుకెళ్ళమని ఎన్ని సార్లు ప్రబతిమాలింది బావని.

'ఆఫీసొదలగానే నాకింకేమీ పనుండదనుకున్నావా - నిన్ను స్కూటర్ మీద తిప్పడం తప్ప' భర్త చిరాకు మొహం కనిపించేసరికి మెలోని ఉత్సాహం నీరుగారి పోయేది.

"మీరిప్పాట నామాట కాదనగూడదు. మీ ఇంటిదాకా సరదాగా కబుర్లు చెప్పుకుంటూ నడిచిపోదాం" ఈశ్వర్ ఆశగా రోహిణి వంక చూస్తూ అన్నాడు.

రోహిణికి అతన్ని నిరుత్సాహపరచాలనిపించలేదు. అదీగాకుండా తనకి వెంటనే ఇంటికి వెళ్ళాలని పించడంలేదు. అందుకే మౌనంగా తలూపింది !

ఇద్దరూ నడుస్తూ బయల్దేరారు కబుర్లు చెప్పుకుంటూ.

అతనేమేమో చెప్తున్నాడు. ఆమె వింటోంది.

మధ్య మధ్య ఆమె నవ్వుతోంది. అతను పరవశించిపోతున్నాడు.

"కాస్త కాఫీ తాగి వెళ్దాం" దార్లో కామత్ హోటల్ చూస్తూ అన్నాడతను.

"పదండి..." ఆమెకి కాఫీ తాగాలనిపించింది.

ఇద్దరూ కామత్‌లోకి దారి తీశారు.

"టిఫినేమైనా తీసుకుంటారా ?" అడిగాడతను.

"నాకక్కర్లేదు మీరేమైనా తీసుకుంటే తీసుకోండి."

"రెండు కాఫీ..." ఆర్డరిచ్చాడతను.

ఇద్దరూ ఏవేవో కాలేజీనాటి విషయాలు మాట్లాడుకొని నవ్వుకొన్నారు

కాఫీ తాగడం పూర్తి చేసి ఇద్దరూ లేచారు. ఆమె వద్దంటున్నా అతనే బిల్లు చెల్లించాడు.

ఆమె మనసెంతో ఆనందంగా వుంది.

అతనికి ఎంతో తృప్తిగా వుంది.

ఇద్దరూ హుషారుగా కబుర్లు చెప్పుకుంటూ నల్లకుంట దాకా నడిచి వచ్చారు.

కూరల బండ్లని చూడగానే ఆమె ఠక్కునాగిపోయింది ఆమెతోపాటే అతనూ ఆగిపోయాడు.

'కనీసం కూరలు కూడా ఆయన తేరు. ఇంటి పనన్నీ తనే చూసుకోవాలి. ఏ మాత్రం లోటు కనిపించినా నానా గొడవా చేస్తారు పొద్దునకి పొద్దున ఇట్టాంటి కూర చేయలేదని ఎంత గొడవ చేశారూ! పొద్దున

వయసు-వ్యామోహం

విషయం గుర్తుకు రాగానే రోహిణి మనసు మళ్ళీ చికాకైపోయింది.

ఎదురుగా వున్న కూరల బండివేపు నడిచింది.

"టమేటాలెలా?" అడిగింది.

చెప్పాడతను.

ఏరి బుట్టలో వెయ్యసాగింది తనకూడా కాయల ఏరడంలో ఆమెకు సహాయపడసాగా డీశ్వర్.

అవన్నీ తూయించి సంచిలో వేయించుకుంది రోహిణి. హఠాత్తుగా డబ్బులు తీసి కూరలతనికిచ్చాడీశ్వర్.

"ఇందాక హోటల్లో ఇచ్చారంటే అర్థముంది. ఇక్కడకూడా డబ్బులు మీరే ఎందుకిచ్చారు?" ఆశ్చర్యంగాను, చిరు కోపంగాను అడిగిందామె.

"జీవితాంతం మీరు కొనే వస్తువులన్నింటికీ నేనే డబ్బులివ్వాలనుకున్నాను. ఆ అదృష్టం నాకెలానూ లేదు. కనీసం ఈ ఒక్క పూటైనా ఆ అనుభూతిని పొందనీయండి" అన్నాడతను జీరపోయిన గొంతుతో మొహం పక్కకి తిప్పేసుకుంటూ.

ఆమాట లామె గుండెల్ని తాకాయ్. కళ్ళవెంట నీళ్ళు తిరిగాయ్. ఏమీ మాట్లాడలేక పోయింది.

రెండడుగులు వేయగానే "హరి నివాస్" అటుగా పోతున్న ఆటోను నిలిపి, ఎక్కుతూ అన్నాడీశ్వర్.

అతన్నాగమనాలని, ఏమేమో చెప్పాలని అనిపించిందామెకి. అయినా మాట్లాడలేక పోయింది.

ఆటో వాళ్ళిద్దరి మధ్యా దూరాన్ని పెంచుతూ సర్రున దూసుకు పోయింది.

ఇంటికి చేరుకుని నీరసంగా పడక్కుర్చీలో వాలిపోయింది రోహిణి. రకరకాల ఆలోచన్లామె మనసుని ముసరసాగాయ్.

ఈశ్వర్‌కి పెళ్ళైపోయింది. అతని భార్య అతన్ని ఖచ్చితంగా ఆరాధిస్తూనే వుంటుంది. ఈశ్వర్ తనని ప్రేమిస్తున్నాడు. తను బావని ప్రేమించింది. బావ మరెవర్నో ప్రేమిస్తున్నాడు. కోరుకున్న వాళ్ళెవ్వరికీ దొరకలేదు. కనీసం దొరికిన వాళ్ళతో రాజీ కూడా పడడంలేదు.



వంటలు

కేబేజీ పచ్చడి

కావలసినవస్తువులు:— కేబేజీ ఒక పెద్ద సైజు, నూనె ½ కేజీ, చింతపండు ¼ కేజీ, ఎండు మిరప 100 గ్రాములు, ఇంగువ ½ స్పూను, శనగపప్పు 100 గ్రా. మినపపప్పు 100 గ్రాములు, తగినంత పోపు సామాన్లు.

తయారుచేయు విధానం :— కేబేజీని ముక్కలుగా తరిగి, అందులో ఉప్పు, పసుపు, చింతపండు కలుపవలెను. ఆ తర్వాత ఎండు మిరప గుండను చల్లి రెండు మూడు రోజులు ఉంచవలెను. వేడిచేసిన నూనెలో, పోపు ద్రవ్యాలు వేసి నిలువ వుంచిన కేబేజీ ముక్కలలో వేసి, బాగా కలియబెట్టాలి. శనగపప్పు, మినపపప్పు నూనెలో కొద్దిగా వేయించి, యిందులో మిశ్రమం గావిస్తే కేబేజీ పచ్చడి మరింత రుచికరంగా వుంటుంది.

— శ్రీమతి ప్రభా మల్లిబాబు.

కొబ్బరిపాలతో వడియాలు

కావలసిన వస్తువులు:— కొబ్బరికాయ ఒకటి, బియ్యప్పిండి—పావుకేజి, తగినంత ఉప్పు, కారం, కొంచెంజీలకర్ర, తినేసోడా కొంచెం.

ముందుగా కొబ్బరి (కాస్త ముదురుగా ఉండాలి) తురిమి, దానిలో కొంచెం నీరు పోసి, బాగా పరిగించి వడకట్టేన, కొబ్బరి పాలు వస్తాయి. ఈ పాలు స్టౌ మీద పెట్టి బాగా మరుగుతున్న సమయంలో బియ్యం ప్పిండిని పోస్తూ కలుపుకోవాలి. (దంపుడు పిండి ఐతే మంచిది) అటుపైన క్రిందకు దించి, నీరు చాలని యెడల కొద్దిగా చిలకరించుకొని రొట్టెలపిండి కంటే మృదువుగా ఉండేటట్లు చేసుకోవాలి. కొద్దిగా తినేసోడా ఉప్పు, కారం, జీలకర్ర అవీ వేసుకొని బాగా కలుపుకోవాలి.

తెల్లని శుభ్రమైన గుడ్డ తడిపి, ఆరవేసి దాని పైన జంతికల గొట్టము సహాయముతో ఈ పిండినంతటినీ జంతికల మాదిరిగా ఆరవేసు కోవాలి. బాగా ఎండిన పిదప డబ్బాలో వేసి మూత పెట్టుకుంటే చాలా రోజులు నిలువ ఉంటాయి.

— ఎల్. శ్యామల.

వయసు—వ్యామోహం

జీవితంలో తలచినవన్నీ జరగకపోవచ్చు. అంతమాత్రాన నిరుత్సాహ పడిపోయి, తనతోపాటే తనని నమ్ముకున్న వాళ్ళని కూడా బాధపెట్టడం అవివేకం.

ఈశ్వర్ ఇంకా తనని పూర్వంలాగానే ప్రేమిస్తున్నాడని ఆనందపడిందేగాని తన లాగే మరో స్త్రీ ఇరుకునబడి నలిగిపోతోందని ఆలోచించలేదు. సరిగ్గా తను బావతో పడుతున్న బాధనే ఈశ్వర్ భార్యకూడా ఈశ్వర్‌వల్ల పడుతూంటుంది.

తనకిలాగానే ఆమె బాధపట్టానికి వీల్లేదు.

వెంటనే కాగితం, కలం అందుకొంది రోహిణి.

ఈశ్వర్‌గార్కి—

యవ్వనంలోకి అడుగు పెట్టాంతర్వాత వయసు వ్యామోహంలో ప్రతిమనిషి ఎవర్నో ఒక్కర్నైనా ప్రేమించక తప్పదు. ఒక్క మాటలో చెప్పాలంటే అది ప్రేమకాదు ఆకర్షణ. వయసు వ్యామోహంలోంచి బయట పడాల్సిన వయసులోకి అడుగు పెట్టాం. జీవితంలో జరగని విషయాల గురించి ఆలోచించి బాధపడడం అవివేకం. అదీకాకుండా మనం ప్రేమించిన వాళ్ళు మనకు భాగస్వాములుగాదొరకడం అదృష్టం కాదు—మనల్ని ప్రేమించేవాళ్ళు దొరకడం అదృష్టం. దొరికిన అదృష్టాన్ని కాలదన్ను కోవద్దు. మీ పూర్తి ప్రేమకి పాత్రురాలు ఆమె మాత్రమే! ఇదే ఓ మంచి స్నేహితురాలిగా నా సలహా—

రోహిణి.

ఉత్తరాన్ని ముగించి, కవర్లో పెట్టి అంటించి, దాన్ని వెంటనే దగ్గర్లో వున్న పోస్ట్ డబ్బాలో వేసివస్తేగాని ఆమె మనస్సు కొద్దిగానైనా తృప్తిపడలేదు.

Printed and Published by S. NageswaraRao at the Andhra Patrika press, MallikarjunaRao Street, Gandhinagar, Vijayawada-3. Editor: S. Radhakrishna

బ్రూక్ బాండ్ గ్రీన్ లేబిల్

3 తరాల వారికి అదే కమ్మని రుచి



గ్రీన్ లేబిల్ : అనేక సం॥ల గా బామ్మగారు దాన్ని ఉపయోగిస్తున్న విధం




గ్రీన్ లేబిల్ : అమ్మ దాన్ని ఉపయోగిస్తున్న విధం



అదే గ్రీన్ లేబిల్ : మీరు మెచ్చుకొనే విధం మరియు మీరు ఉపయోగించే విధం

మూడు తరాల వారికి అభిమాని కావడంలో ఆశ్చర్య పడనవసరం లేదు. మరియు ఈ రోజు అందుకే అధికంగా అమ్ముడవుతుంది



ఎల్లప్పుడూ శ్రేష్ఠమైనది, స్ట్రాంగైనది

OBM-5709 A/1 TEL